ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన

ఒంగోలు, గిద్దలూరుల్లో నిర్వహణ

ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు




ఒంగోలులో పోటీలకు హాజరై ముగ్గులు వేస్తున్న మహిళలు (ఇన్‌సెట్లో) ప్రథమ బహుమతి ఎల్ఈడీ స్మార్ట్ టీవీ అందజేస్తున్నకమిషనర్ వెంకటేశ్వరరావు, సరస్వతీ విద్యాసంస్థల అధిపతి రమణారెడ్డి

పుడమితల్లి ముగ్గుల చీర కట్టి పరవశించింది. మహిళలు రమణీయమైన రంగవల్లికలతో సంక్రాంతి శోభకు వన్నెలద్దారు. ఒంగోలు, గిద్దలూరుల్లో ముందే పండుగ సందడి తెచ్చారు. "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. ఒంగోలులో శ్రీ సరస్వతీ విద్యాసంసంస్థల సౌజన్యంతో పీవీఆర్ బాలుర హైస్కూల్‌లోని క్రీడా మైదానం, గిద్దలూరులో లక్ష్మీ మిల్క్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సౌజన్యంతో టెన్నిస్ స్టేడియంలో పోటీలు జరిగాయి. మహిళలు భారీగా తరలివచ్చారు. ఆకాశంలో చుక్కలను నేలకు దించారు. తమ వేలికొనలతో ఒక్కో చుక్కను కలుపుతూ రమణీయమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. కొందరు సామాజిక స్పృహను జోడించారు. సంక్రాంతి విశిష్టతను, తెలుగు సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా పలువురు వేసిన ముగ్గులు చూపరులను ఆకట్టుకున్నాయి.

సప్తవర్ణ శోభితం

ఒంగోలు (కల్చరల్), జనవరి 7: ఒంగోలులో సంక్రాంతికి ముందే పండుగ సందడి నెలకొంది. నగరంలోని పీవీఆర్ బాలుర హైస్కూల్ సప్తవర్ణ శోభితమైంది. ముత్యాల ముగ్గులతో మెరిసిపోయింది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా సంఖ్యలో మహిళలు తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలలో ప్రథమ విజేతగా ఇంకొల్లుకు చెందిన సిహెచ్.మణిమంజరి, ద్వితీయ విజేతగా ఒంగోలు పాపాకాలనీకి చెందిన కె.విజయలక్ష్మి నిలిచారు. తృతీయ బహుమతిని కడవకుదురుకు చెందిన జి.విజయశాంతి సాధించారు. ప్రథమ బహుమతిగా ఎల్ఈడీ స్మార్ట్ టీవీ, ద్వితీయ బహుమతిగా వాషింగ్ మిషన్, తృతీయ బహుమతిగా ట్రావెలర్స్ లగ్జరీ సూట్‌కేస్‌లను ఇతర అతిథులతో కలిసి సరస్వతీ విద్యాసంస్థల అధినేత ఎ.వి.రమణారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో తెలుగు వారి పెద్దపండుగ అయిన సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం హర్షణీయమన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు మహిళలను ప్రోత్సహించటానికి, మన సంస్కృతిని కాపాడుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మరో అతిథి కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఏబీఎన్-ఆంధ్రజ్యోతి, తమ బ్యాంకు కలిసి నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. న్యాయనిర్ణేతలుగా సింహాద్రి జ్యోతిర్మయి, సిహెచ్.లక్ష్మి, పద్మావతి వ్యవహరించారు. ఈ సందర్భంగా 13 మందికి ప్రోత్సాహక బహుమతులు, పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ గిఫ్ట్‌ను సరస్వతీ విద్యాసంస్థల తరపున రమణారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి ఆళ్ల శ్రీనివాస్, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టర్ బండపల్లి వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.



గిద్దలూరులో ముగ్గులు వేస్తున్న మహిళలు

గిద్దలూరులో ఉత్సాహంగా..

గిద్దలూరు, జనవరి 7 : గిద్దలూరులో ఆదివారం నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. పెద్దఎత్తున తరుణీమణులు తరలివచ్చారు. అందాల రంగవల్లికలతో ఇలపై ఇంద్రధనుస్సు సౌందర్యాన్ని ఆవిష్కరించారు. కొందరు సామాజిక స్పృహను జోడించారు. స్థానిక టెన్నిస్ స్టేడియంలో లక్ష్మీ మిల్క్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సౌజన్యంతో ఈ పోటీలు జరిగాయి. 130 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. రమణీయమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. బేస్తవారపేటకు చెందిన బెల్లం హిమబిందు విజేతగా నిలిచి మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చేతుల మీదుగా రూ.10వేల నగదు బహుమతిని అందుకున్నారు. కొమరోలు మండలం గాజుల వెంకటాపురం గ్రామానికి చెందిన జి.శిరీష ద్వితీయ బహుమతి రూ.6వేల నగదును గెలుచుకొన్నారు. కడప జిల్లా బద్వేలుకు చెందిన జె.రెడ్డికాత్యాయని తృతీయ స్థానంలో నిలిచి రూ.4వేల నగదు బహుమతిని అందుకున్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు నిర్వాహకులు బహుమతి అందజేశారు. కన్సొలేషన్ బహుమతులను కూడా దాతలు అందించారు. ముగ్గుల పోటీ ద్వారా రాష్ట్రంలో సంక్రాంతి శోభను ముందుగానే 'ఆంధ్రజ్యోతి' తెచ్చిందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ఈసందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ ఐ.వి.సుబ్బారావు, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ షాన్షావలి, నాయకులు బిల్లా రమేష్, హిందూ దేవాలయాల కమిటీ అధ్యక్షులు చేరెడ్డి యర్రారెడ్డి పాల్గొన్నారు. సుజాత, ఆదిలక్ష్మి, రేవతి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.



గిద్దలూరులో ప్రథమబహుమతి విజేతకు రూ.10 వేల నగదును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



ఆడబిడ్డకు సంక్రాంతి కానుక

బెల్లం హిమబిందు, ప్రథమ బహుమతి విజేత, బీ పేట

ఆడబిడ్డకు 'ఆంధ్రజ్యోతి' నుంచి సంక్రాంతి కానుక అందినట్లు ఉంది. బేస్తవారపేటలో నేను వలంటీర్‌గా పనిచేస్తున్నా. మూడేళ్ల నుంచి నేను ముగ్గుల పోటీలో పాల్గొంటున్నా. ఒకసారి కన్సొలేషన్, మరోసారి తృతీయ బహుమతి, నేడు ప్రథమ బహుమతి లభించింది. ఏటా మహిళల కోసం పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉంది.






రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందాలన్నదే లక్ష్యం

సిహెచ్.మణిమంజరి, ఇంకొల్లు, ప్రథమ బహుమతి విజేత

మహిళలకు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీలు నిర్వహించి ప్రోత్సహించడం అభినందనీయం. ఒంగోలులో ప్రథమ బహుమతి సాధించిన నేను రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలలో సైతం గెలుపొందాలన్నదే లక్ష్యం. నాకు చిన్నతనం నుంచి ముగ్గులంటే ఎంతో ఇష్టం. పోటీలో విజేతగా నిలవడం ఆనందంగా ఉంది.

మహిళలకు ప్రోత్సాహకరం

కె.విజయలక్ష్మి, ఒంగోలు, ద్వితీయ బహుమతి విజేత

ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల ద్వారా మహిళలలో ఉన్న సృజనాత్మకత, పోటీతత్వం వెలికివస్తాయి. అంతేకాకుండా ఈ పోటీలు మహిళలకు ఎంతో ప్రోత్సాహకరం. ప్రతి సంవత్సరం వీటిని నిర్వహించడం అభినందనీయం.



ముగ్గుల పోటీలపై మక్కువతో..

కాత్యాయని, తృతీయ విజేత, బద్వేలు

ముగ్గుల పోటీలు ఎక్కడ జరిగినా అక్కడకు వెళుతుంటాను. ఈ పోటీలు మహిళలకు కానుక లాంటివి. అందుకే జిల్లా మారి వచ్చి ఇక్కడ పోటీలో పాల్గొన్నాను. ముగ్గుల పోటీలో పాల్గొనడం, బహుమతి పొందడం సంతోషంగా ఉంది. పక్క జిల్లా నుంచి వచ్చిన శ్రమ కూడా మరచిపోయాను.






చెప్పలేని సంతోషంగా ఉంది

శిరీష,రెండో బహుమతి విజేత, జీ వెంకటాపురం

ముత్యాల ముగ్గుల పోటీల్లో ద్వితీయ స్థానం సాధించడం సంతోషంగా ఉంది. గతంలోనూ నేను ఈ పోటీల్లో పాల్గొన్నా. కన్సొలేషన్ బహుమతి లభించింది. పట్టుదలతో ప్రయత్నించడం ద్వారా ద్వితీయ స్థానం పొందా. పండుగకళ కనుమరుగవుతున్న ఈ తరుణంలో 'ఆంధ్రజ్యోతి' ఏటా ముగ్గుల పోటీ నిర్వహించడం అభినందనీయం.




చాలా ఆనందంగా ఉంది

జి.విజయశాంతి, కడవకుదురు, తృతీయ బహుమతి విజేత

ముగ్గుల పోటీలలో గెలుపొందడం ఎంతో ఆనందంగా ఉంది. నేను ఉద్యోగం చేస్తూనే ముగ్గులను ప్రాక్టీసు చేస్తుంటాను. అందుకు తగిన ఫలితం ఈరోజు లభించిందని భావిస్తున్నాను. అంతేకాకుండా నేను వేసిన ముగ్గులో కాన్సెప్ట్‌కు ఈ బహుమతి లభించిందని అనుకుంటున్నాను.



నేడు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు

కనిగిరిలో ఏర్పాట్లు పూర్తి

కనిగిరి, జనవరి 7 : "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" సంయుక్త ఆధ్వర్యంలో అమరావతి మెడికల్ సైన్సెస్ గుంటూరు ఎండీ డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి సౌజన్యంతో కనిగిరిలో సోమవారం జరిగే పోటీలకు సర్వం సిద్ధమైంది. అమరావతి గ్రౌండ్స్‌లో అందుకు ఏర్పాట్లు చేశారు. పోటీల్లో కనిగిరి నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి ఎల్ఈడీ టీవీ, రెండో బహుమతిగా ట్రావెలింగ్ లగ్జరీ సూట్‌కేస్, మూడో బహుమతిగా రాకింగ్ రిలాక్సబుల్ చైర్‌ను అందజేస్తారు. జిల్లా స్థాయిలో విజేతలకు 1వ బహుమతిగా ట్రావెలింగ్ లగ్జరీ సూట్‌కేస్, 2వ బహుమతిగా రాకింగ్ రిలాక్సబుల్ చైర్‌ను ఇవ్వనున్నారు. పాల్గొనే ప్రతి ఒక్కరికీ కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. ఉదయం 9లోపే గ్రౌండ్స్‌కు చేరుకోవాలని నిర్వాహకులు కోరారు.

వైసీపీకి షాక్

'బేస్తవారపేట'లో నలుగురు మాజీ సర్పంచ్‌లు టీడీపీలో చేరిక

ఆహ్వానించిన ముత్తుముల



లోపలి పేజీల్లో...

టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


ఒంగోలులో ఎస్మా జీవోను దహనం చేస్తున్న కార్మిక సంఘాలు


కొండపిలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు


నాగులుప్పలపాడులో..

'ఎస్మా'పై పెల్లుబుకిన నిరసనలు

- జిల్లావ్యాప్తంగా జీవో ప్రతుల దహనం
- అంగన్‌వాడీలు, కార్మిక సంఘాల ఆగ్రహం

ఒంగోలు నగరం, జనవరి 7: ప్రభుత్వం అంగన్‌వాడీలపై ఎస్మాను ప్రయోగించటంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు వెల్లువెత్తాయి. ఎస్మాను ప్రయోగించినా వెనక్కి తగ్గేది లేదంటూ అంగన్‌వాడీలు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు నినదించి మండల కేంద్రాలు, ఐసీడీఎస్ ప్రాజెక్టు కేంద్రాలు, కలెక్టర్ కార్యాలయం ఎదుట జీవో ప్రతులను దహనం చేశారు. చీకటి చట్టాలను తెచ్చి ఉద్యమాలను అణచివేయాలని చూస్తే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కాగా స్థానిక కలెక్టరేట్ వద్ద రెండో రోజు 24 గంటల నిరవధిక నిరాహార దీక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజి శ్రీనివాసరావు ప్రారంభిం మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం పరిష్కరించకుండా వారిపై ఎస్మాను ప్రయోగించటం దుర్మార్గమన్నారు. నిత్యావసర సరుకులు పెరిగిన మేరకు అంగన్‌వాడీల వేతనం ఎప్పుడో పెరగాల్సి ఉందని చెప్పారు. అంగన్‌వాడీలు చేస్తున్న ఆందోళనకు యూటీఫ్ చివరిదాకా సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. సీఎం జగన్మోహనరెడ్డి అధికారం లేనప్పుడు ఒకలా, అధికారంలోకి వచ్చాక మరో విధంగా మాట్లాడుతూ అంగన్‌వాడీలను మోసం చేశారన్నారు.

యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.వీరాంజనేయులు, రవి మాట్లాడుతూ ప్రభుత్వం హక్కులను కాలరాస్తూ అంగన్‌వాడీలపై ఎస్మాను ప్రయోగించటం దుర్మార్గమన్నారు. వెంటనే ఎస్మా చట్టాన్ని ఉప సంహరించుకోవాలన్నారు. రాష్ట్ర నాయకురాలు సులోచన మాట్లాడుతూ మహిళలు 27 రోజులుగా సమ్మె చేసి రోడ్డున పడితే ప్రభుత్వం స్పందించే తీరు బెదిరించే విధంగా ఉందన్నారు.


టంగుటూరులో ఎస్మా చట్టం ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు, నాయకులు

సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం.రమేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.కల్పన, సీపీఐ జిల్లా నాయకులు పీవీఆర్.చౌదరి ప్రసంగించారు. అనంతరం అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున చేరి ఎస్మా చట్టం ప్రతులను తగులబెట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కేవీ.సుబ్బమ్మ, అన్నపూర్ణ, ధనలక్ష్మి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో..

ఒంగోలు(కలెక్టరేట్): అంగన్‌వాడీల ఉద్యమంపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు 2ను వెంటనే ఉప సంహరించుకోవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఎస్మా జీవో ప్రతులను సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎస్‌టీయూ ఆధ్వర్యంలో ఒంగోలులోని అద్దంకి బస్టాండు వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గత 27 రోజుల నుంచి అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే ఆ సమస్యను పరిష్కరించకుండా ప్రభుత్వం ఉద్యమాన్ని అణిచివేసేందుకు ఎస్మాను ప్రయోగించడం దుర్మార్గంగా ఉందన్నారు. ఇప్పటికే ఉద్యమాన్ని అణిచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించి విఫలమైందని ఆరోపించారు. వెంటనే ఎస్మా జీవోను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు జి.శ్రీనివాసులు, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఆర్.మోహన్, పీవీఆర్.చౌదరి, ఎస్‌డీ.సర్దార్, మహ్మద్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు: తమ హక్కుల సాధన కోసం అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మెను బలవంతంగా అణిచివేసేందుకు ప్రభుత్వం నల్ల చట్టాన్ని ప్రయోగించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు మాట్లాడుతూ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ఎస్మా చట్టం సరికాదన్నారు. అనంతరం వారంతా ప్రదర్శనగా బస్టాండ్ కూడలికి చేరుకున్నారు. అక్కడ ఎస్మా చట్టం ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాము, మోజెస్, అంగనవాడీ వర్కర్ల యూనియన్ నాయకురాళ్లు శేషమ్మ, క్రాంతి పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: అంగన్‌వాడీలకు కనీస జీతం రూ.26వేలు ఇవ్వాలని అంగన్‌వాడీలు చేస్తున్న నిరసన కార్యక్రమం 27వ రోజైన ఆదివారం కూడా కొనసాగింది. కొండపిలోని ప్రభుత్వ కార్యాలయాల ఎదుట జరుగుతున్న నిరసన కార్యక్రమంలో అంగన్‌వాడీలు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్మా చట్టానికి వ్యతిరేకంగా, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలు చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, పున్నమ్మ, సీఐటీయూ మండల నాయకుడు జి. వందనం పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్): నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆదివారం సమ్మెలో భాగంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్మా జీవో ప్రతులను తగులబెట్టారు. కార్యక్రమంలో నాయకులు జుజ్జూరి జయంత్‌బాబు, టి.శ్రీకాంత్, వెంకటసుబ్బమ్మ, దుర్గాభవానీ, రజనీ, ప్రమీల, రమాదేవి, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగన్ మనసు మారాలని కార్మికుల ప్రార్థనలు


ప్రార్థనలు చేస్తున్న కార్మికులు

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 7 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మునిసిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం కొనసాగింది. ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయలో కార్మికులు ప్రత్యేక ప్రార్థనలు చేసి సీఎం జగన్‌కు మంచి మనసు ప్రసాదించాలని ప్రార్థించారు. కార్మికుల సమస్యలపై స్పందించి, న్యాయం చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొర్నెపాటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసరావు, బాలకృష్ణ, గోపి, వెంకటేశ్వర్లు, యు.కుమారి, కె.సామ్రాజ్యం, కార్మికులు పాల్గొన్నారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ సోమవారం మునిసిపల్ కార్మికులు కలెక్టరేట్ ముట్టడి చేపడుతున్నట్లు తెలిపారు.

చీమకుర్తిలో మున్సిపల్ కార్మికుల భిక్షాటన

చీమకుర్తి : తమ సమస్యలు పరిష్కరిచాలని కోరుతూ చీమకుర్తిలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె 13వ రోజుకు చేరుకుంది. ఆదివారం కార్మికులు పట్టణంలో భిక్షాటన చేపట్టారు. పట్టణాన్ని అనునిత్యం పరిశుభ్రంగా ఉంచే తమకు ఈ గతి పట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పద్మ, ఏడుకొండలు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో రామ్‌రాజ్ షోరూం


కొనుగోళ్లను ప్రారంభిస్తున్న మేయర్ సుజాత

ఒంగోలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని ట్రంక్ రోడ్డు, భాగ్యనగర్ రెండో లైన్‌లో రామ్‌రాజ్ షోరూం ప్రారంభమైంది. ఆదివారం ఉదయం ఈ షోరూంను మేయర్ గంగాడ సుజాత ప్రారంభించగా 19వ వార్డు కార్పొరేటర్ పసుపులేటి విజయలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేశారు. జ్యోతి గ్రానైట్స్ మేనేజింగ్ డైరెక్టర్ శిద్దా సుధీర్ మొదటి కొనుగోలు చేశారు. ఇదిలా ఉండగా రామ్‌రాజ్ సంస్థ వినూత్న, విశేషమైన ధోవతులను రూపొందించింది. బ్యాక్టీరియా, ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడేలాగా యాంటీ బ్యాక్టీరియల్ ధోవతులను ప్రజలకు అందుబాటులో ఉంచింది.

గ్రానైట్ ట్రాలీ ఢీకొని సెక్యూరిటీ గార్డ్ మృతి

చీమకుర్తి, జనవరి7: గ్రానైట్ ట్రాలీ ఢీకొని సెక్యూరిటీ గార్డ్ మృతి చెందిన సంఘటన ఆదివారం రామతీర్థం సెంటర్‌లో జరిగింది. తాళ్లూరు మండలం బొద్దికూరపాడుకు చెందిన చీమలదిన్నె యలమంద(62) హంసా గ్రానైట్ క్వారీలో సెక్యూరిటీ గార్డ్‌గా గత కొన్నేళ్లుగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో ఆయన రామతీర్థం సెంటర్‌లో కర్నూల్‌రోడ్డు దాటుతుండగా గ్రానైట్ ట్రాలీ ఢీ కొనటంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. బాధితుడిని చికిత్స కోసం చీమకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. చీమకుర్తి పోలీసులు కేసు విచారణ జరుపుతున్నారు.

సైకో సీఎంను ఓడించాలి : టీడీపీ


ప్రచారం చేస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు (ఒంగోలురూరల్), జనవరి7: రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన సైకో సీఎం జగన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని టీడీపీ నాయకులు కోరారు. ఉప్పుగుండూరులో ఆదివారం రాత్రి బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబునాయుడును మరోసారి సీఎంగా చేసుకుందామని కోరారు. కార్యక్రమంలో నాయకులు కనగాల శ్రీనివాసరావు, కె.సెల్వం, టి.జాన్సన్, బెల్లం శ్రీను, బట్టు సురేష్, కొణిజేటి సురేష్ , జె.సురేంద్ర, పి.నాగార్జున, పి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

ముగిసిన చెకుముకి సంబరాలు

మద్దిపాడు, జనవరి 7: జేవీవీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఏడుగుండ్లపాడులోని హర్షిణి జూనియర్ కాలేజీలో ఆదివారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా జేవీవీ జిల్లా గౌరవసలహదారు పుల్లారావు, ఉపవిద్యాశాఖ అధికారి అనితారోజ్ మేరి, హర్షిణి విద్యాసంస్థల అధినేత రవికుమార్ హాజరయ్యారు. నగర జేవీవీ అధ్యక్షుడు ఎస్‌వీ.రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో పుల్లారావు మాట్లాడుతూ జ్ఞానవంతమైన సమాజమే అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో సైన్స్ అధికారి రమేష్, డీసీఈబీ కార్యదర్శి వై.వెంకట్రావ్, జేవీవీ జిల్లా అధ్యక్షులు ముండ్ల శ్రీనివాసులు, ప్రధానకార్యదర్శి జయప్రకాష్, రాష్ట్ర సభ్యులు స్వరూపారెడ్డి, బాస్కర్, కె.బ్రహ్మాచారి, ఖాజాహుస్సేన్, కోశాధికారి తిరుపతయ్య, రంగారెడ్డి, వెంకటేష్, నల్లూరి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, దేవప్రసాద్, బీవీ.రామన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే ముస్లింల అభ్యున్నతి

మైనార్టీలపై కపట ప్రేమను ఒలకబోసి మోసం చేసిన జగన్‌రెడ్డి • ఎమ్మెల్యే స్వామి ధ్వజం


ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే స్వామి, టీడీపీ నేతలు

సింగరాయకొండ, జనవరి 7 : రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి కృషి చేసిన ఏకైక పార్టీ టీడీపీనేనని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. గత సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తే మైనార్టీల జీవితాల్లో వెలుగులు నింపుతానని నమ్మించి ఓట్లు దండుకొని గద్దెనెక్కిన తరువాత వారిని వంచనకు గురి చేశారని ధ్వజమెత్తారు. పంచాయతీ పరిధిలోని ఈద్గామిట్టలో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఎమ్మెల్యే స్వామి మాట్లాడారు. ముస్లిం యువతలకు గత టీడీపీ ప్రభుత్వంలో పెళ్లి ఖర్చులకు దుల్హాన్ పథకం ద్వారా రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని అందించామని గుర్తు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక సాయం రూ. 1లక్షకు పెంచుతామని హామీ ఇచ్చి తీరా నిధులు లేవని అర్థంతరంగా నిలిపివేశారన్నారు. ఇప్పుడు ఆ పథకానికి రకరకాల కొర్రీలు పెట్టి నీరుగార్చారని దుయ్యబట్టారు. టీడీపీ ప్రభుత్వంలో రంజాన్ తోఫాను అందజేసి పేద మైనార్టీల కళ్లలో ఆనందాన్ని నింపామన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక దానికి కూడా మంగళం పాడి వారి నోట్లో మన్ను కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇమాంలకు నెలకు రూ.5వేలు, మౌజంలకు రూ.3వేలు ఇచ్చి తొలుత ఆదుకున్న ప్రభుత్వం టీడీపీదని వివరించారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ. 50 వేలు నుంచి రూ.1 లక్ష వరకు రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా చేయూత ఇచ్చామన్నారు. తెలుగుదేశం హయాంలో చంద్రబాబు కడప, విజయవాడలో హజ్ భవనాలను నిర్మించారని వివరించారు. స్థానిక ఈద్గామిట్ట, మల్లెతోటలో గత ప్రభుత్వంలో రూర్బన్ పథకం కింద దాదాపు రూ. కోటి వెచ్చించి అంతర్గత డ్రైనేజీతో కూడిన సీసీ రోడ్లను నిర్మించామన్నారు. షాదీ ఖానా చుట్టూ రూ. 20 లక్షలతో ప్రహరీ నిర్మాణం, పాకల రోడ్డులో శ్మశానవాటికను రూ.10 లక్షలతో అభివృద్ధిచేశామని తెలిపారు. అలాగే రూ.20 లక్షలు వెచ్చించి తాగునీటి సౌకర్యం కొరకు అంతర్గత పైపులైన్ ఏర్పాటు చేశామన్నారు. మాజీమంత్రి దామచర్ల ఆంజనేయలు హయాంలో రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించి షాదీఖానాను నిర్మించారని స్వామి గుర్తు చేశారు. తన హయాంలో షాదీ ఖానా పైఅంతస్తు నిర్మాణానికి రూ.30లక్షలు నిధులు మంజూరు చేయిస్తే వైసీపీ వచ్చాక ఆ పనులను నిలిపివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు షేక్ సంధానీబాషా, చీమకుర్తి కృష్ణ, కూనపరెడ్డి సుబ్బారావు, పులి ప్రసాద్, సుదర్శి చంటి, మించల బ్రహ్మయ్య, అబ్దుల్‌సుభాన్, యస్థాని, సనావుల్లా, సాజీద్, మోటుపల్లి వెంకటేశ్వర్లు, శీలం చంటి, రవిశంకర్‌రెడ్డి, వల్లెపు రవి, తుమ్మా కోటేశ్వరరావు, జనసేన నేతలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జగన్‌రెడ్డి పాలనకు అంతం పలకాలి

వచ్చే ఎన్నికల్లో జనసేన గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్ పిలుపు


ర్యాలీ నిర్వహిస్తున్న రియాజ్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 7: జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రాభివృద్ధి కన్నా గంజాయి, ఎర్రచందనం అక్రమ రవాణాలో వైసీపీ నాయకులు బాగా అభివృద్ధి చెందారని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ ఆరోపించారు. ఒంగోలు నగరంలోని రాజపానగల్ రోడ్డు నుంచి గద్దలకుంట గాంధీబొమ్మ వరకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ముందుగా అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం గద్దలగుంటలో జనసేన పార్టీ జెండా ఆవిష్కరించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో రియాజ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయంలో దళితులపై దాడులు పెరిగాన్నారు. ఈ దాడులను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం సాధారణంగా మారిందని విమర్శించారు. రానున్న రోజుల్లో జనసేన అధినేత పవన్, కళ్యాణ్, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయకత్వంలో ఏర్పడే ప్రజా ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతామన్నారు. ఒంగోలు శాసనసభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డి ఇళ్ళ స్థలాలు ఇస్తామని చెప్పి ఎన్నికలు దగ్గరకు వస్తుండటంతో ఇప్పుడు 25వేల మందికి పట్టాలు ఇస్తానని, లేకపోతే పోటీ చేయనని కల్లబొల్లిమాటలు చేప్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు అడుసుమల్లి వెంకట్రావు అమంచి రాజేంద్ర, మలగా రమేష్, రాయపాటి అరుణ, ముత్యాళ కళ్యాణ్, పల్ల ప్రమల, రాయని రమేష్, పిల్లి రాజేష్, దండే అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు అండగా ఉంటాం

- యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు



దీక్షలో పాల్గొన్న ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 7: సమగ్ర శిక్ష ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులకు ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని, తాము అండగా ఉంటామని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజీ శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక దీక్ష ఆదివారానికి 19వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఉద్యోగులు మోకాళ్ళపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అవేమి పట్టించుకోకుండా ఉద్యోగులను బెదిరింపులకు పాల్పడటం దారుణంగా ఉందన్నారు. సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులను బెదిరించే విధంగా ప్రభుత్వం జారీ చేసిన షోకాజ్ నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలకు యూటీఎఫ్ నాయకులు వీరాంజనేయులు, రవి, అబ్దుల్‌హై, బ్రహ్మయ్య, రాజసులోచన, వీరాంజనేయులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి కళ్యాణి, శ్రీనివాసులు, శ్రీహరి, వేణుబాబు, సోమశేఖర్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, నరేష్‌బాబు, శ్రీదేవి, సుశీలరాణి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

19న విజయవాడకు తరలిరావాలి : జంకె

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 7: విజయవాడలో ఈనెల 19వ తేదీన జరగనున్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహవిష్కరణలో జిల్లా నలుమూలల నుంచి వైసీపీ శ్రేణులు తరలిరావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి బడుగు, బలహీనవర్గాలపై ఉన్న ప్రేమకు నిదర్శనం ఈ విగ్రహ ఆవిష్కరణ అని చెప్పారు. ప్రతి నియోజకవర్గం నుంచి ముఖ్యనాయకులు, కార్యకర్తలు విజయవాడకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, ఒడా ఛైర్‌పర్సన్ మీనాకుమారి, మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ కనకారావు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి అదెన్న, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్, బీసీసెల్ అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, ఎస్సీసెల్ అధ్యక్షుడు సుధాకర్, జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

పీఎంశ్రీ స్కూళ్ల ఆటస్థలాలకు నిధుల మంజూరు

ఒంగోలు(విద్య), జనవరి 7 : రాష్ట్రంలోని పీఎంశ్రీ పాఠశాలల్లో ఆట స్థలాల అభివృద్ధికి ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా రూ.33 కోట్లు మంజూరు చేసింది. మొత్తం 662 పాఠశాలలకు ఒక్కొక్క పాఠశాలకు రూ.5 లక్షల చొప్పున ఆటస్థలాల అభివృద్ధికి కేటాయించారు. ఈ మేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నివేదిక ప్రకారం 634 పాఠశాలలకు ఆట స్థలాలు ఉండగా 38 స్కూళ్లకు ఆట స్థలాలు లేవు. 634 స్కూళ్లలో ఒక్కొక్క పాఠశాలకు రూ.లక్ష చొప్పున రూ.6.34 కోట్లు విడుదల చేశారు. ఈ నిధుల వినియోగం తర్వాత మిగతా మొత్తం విడుదల చేస్తారు. ఈ నిధులతో ఆటస్థలాల అభివృద్ధితోపాటు అవుట్ డోర్, ఇన్‌డోర్ గేమ్స్‌కు వసతులు కల్పిస్తారు. పాఠశాల కమిటీ ద్వారా ప నులు చేపడతారు. కాగా జిల్లాలో 441 పీఎంశ్రీ పాఠశాలలకు రూ.2.05 కోట్లు మంజూరయ్యాయి.

నేడు విద్యార్థులకు పలు పోటీలు

ఒంగోలు(విద్య), జనవరి 7 : జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం విద్యార్థుల మధ్య సామాజిక న్యాయం అనే అంశంపై చిత్రలేఖనం, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో వీఎస్.సుబ్బారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడలో ఈనెల 19న స్వరాజ్‌మైదానంలో సామాజిక న్యాయం- డాక్టర్ బీ ఆర్.అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పట్టివేత


పట్టుకున్న మద్యం సీసాలతో సీఐ లక్ష్మణ్ తదితరులు

ఒంగోలు(క్రైం), జనవరి6: అక్రమంగా నిల్వ ఉంచిన అక్రమ మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సుందరయ్య భవన్‌రోడ్డులో నివాసం ఉంటున్న బత్తుల ప్రసన్నాంజనేయులు పాండిచ్చేరి నుంచి మద్యం తరలించి అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్నాడు. ఈక్రమంలో ఆదివారం పోలీసులు ఆకస్మికంగా ప్రసన్నాంజనేయులు ఇంటిపై తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన రాయల్ స్టాగ్, మాన్‌సన్‌హస్ కంపెనీలకు చెందిన 40 ఫుల్ బాటిళ్ల మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ లక్ష్మణ్ తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ దాడిలో ఎస్సైలు మురళి, సంపత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

11న యువజన కాంగ్రెస్ గర్జన

ఒంగోలు(క్రైం), జనవరి7: ఒంగోలులో ఈ నెల 11న యువజన కాంగ్రెస్ ఆధ్వరంలో గర్జన సభ నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదా సుధాకర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి బీఆర్.గౌస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో ర్యాలీతో పాటు అద్దంకి బస్టాండ్‌లో కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్‌తో పాటు ముఖ్య నాయకులు పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

టెన్త్ విద్యార్థులకు వికాస పరీక్షలు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 7: యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లావ్యాప్తంగా పదవ తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాస పరీక్షలు నిర్వహించినట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ఈ పరీక్షల్లో ఆరువేల మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలతో పాటు విద్యాభివృద్ధి కోసం, పరీక్షల భయం పోగొట్టేందుకు ఈ విధమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరీక్ష నిర్వహణకు సహరించిన ఉపాధ్యాయ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

మెడికల్ క్యాంపునకు విశేష స్పందన

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 7: దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం, జీబీఆర్ ఫౌండేషన్ సహకారంతో ఆదివారం ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మునిసిపల్ స్కూలులో మెడికల్ క్యాంపు జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు బి.హరిబాబు, రవితేజ 1442 మందిరోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గత ఎనిమిదేళ్ళుగా ప్రతి రెండు నెలలకు ఒకసారి ఈ కేంద్రం ద్వారా ఉచిత క్యాంపు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు మాదాల వెంకట్రావు తెలిపారు. శిబిరం కోసం డాక్టర్ బి.జవహర్ రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

10లోపు ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించాలి : ఆర్ఐవో

ఒంగోలు(విద్య), జనవరి 7 : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన విద్యార్థులు, మధ్యలో చదువు మానేసిన జనరల్, ఒకేషనల్ విద్యార్థులు మార్చిలో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యేందుకు ఈనెల 10వతేదీలోపు పరీక్షలు ఫీజు చెల్లించాలని బోర్డు ఆర్ఐవో ఎ.సైమన్‌విక్టర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు రూ.250 అపరాధరుసుంతో పరీక్ష ఫీజు చెల్లించాలి. ఇప్పటి వరకు పరీక్ష ఫీజు చెల్లించని విద్యార్థులు వెంటనే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇదే చివరి అవకాశమని, ఇక ఎటువంటి గడువు పొడగించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

ఒంగోలు రూరల్ సీఐగా రాజమోహన్‌రావు

ఒంగోలు(క్రైం), జనవరి7: ఎన్నికల బదిలీలలో భాగంగా గుంటూరు రేంజి పరిధిలో ఉన్న 16 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కల్పిస్తూ ఐజీ జీ.పాల్‌రాజు ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈక్రమంలో ఒంగోలు రూరల్ సీఐగా పనిచేస్తున్న వి.శ్రీనివాసరెడ్డిని తిరుపతి జిల్లా నాయుడుపేట సర్కిల్‌కు బదిలీ చేశారు. బాపట్ల జిల్లా చుండూరు సర్కిల్‌లో పనిచేస్తున్న ఎ.రాజమోహన్‌రావును ఒంగోలు రూరల్ సర్కిల్ సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో ఇచ్చారు.

ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ స్థలం పరిశీలన

సంతనూతలపాడు, జనవరి 7: మద్దులూరు గ్రామ పంచాయతీలో బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్న ఎస్‌డబ్ల్యూసీసీ షెడ్ స్థలాన్ని ఆదివారం డీపీవో నారాయణరెడ్డి ఆదేశాల మేరకు స్థానిక అధికారులు, పాలకులు పరిశీలించారు. 15వ ఆర్థికసంఘం నిధులతో అసంపూర్తిగా ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ల నిర్మాణాన్ని పూర్తిచేయాలని డీపీవో తెలిపినట్లు వారు తెలిపారు. పంచాయతీల్లో షెడ్ నిర్మాణాలు పూర్తికాకుంటే సదరు కార్యదర్శి బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 7: విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్క రించాలని యునైటెడ్ ఎల క్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షు డు దేవూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఒంగోలులోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులను విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఐటీఐ విద్యార్హత ఉన్న వారిని షిఫ్ట్ ఆపరేటర్లుగా పదోన్నతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు ఎస్‌డీ.సర్దార్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 7 : ఒంగోలు నగరం సంతపేటలోని డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో ఆదివారం 1974 సంవత్సరం పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అట్టహాసంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా నాటి ఉపాధ్యాయులు రామ్మోహన్‌రావు, కోటేశ్వరరావు, నాగేశ్వరరావులు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రస్తుత హెచ్‌ఎం ఇ.వెంకట్రావు, పూర్వ విద్యార్థులు కారుమూడి ఆంజనేయులు, దండు అంజిరెడ్డి, కారుమూడి మురళీకృష్ణ, కె.ఎలమంద, మలక పల్లి వెంకటేశ్వర్లు, సిరాజ్, శంకర్, ఆరిగా మళ్ళీ, భవనం సుబ్బారెడ్డి పాల్గొన్నారు. వచ్చే ఏడాది జరిగే పాఠశాల వందేళ్ల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు.

రోడ్డుపై గ్రానైట్ రాళ్లు..బయటపడిన అక్రమ రవాణా


రోడ్డుపై పడిన గ్రానైట్ రాళ్లు

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 7 : చీమకుర్తి నుంచి కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తున్న గ్రానైట్ అక్రమ రవాణా బయటపడింది. ఈమేరకు ఆదివారం అర్ధరాత్రి 12గంటల సమయంలో వెళ్తున్న టిప్పర్‌లో నుంచి కొన్ని రాళ్లు ఒంగోలులోని సెయింట్ జేవీఎస్ స్కూల్ వద్ద ఒక్కసారిగా రోడ్డుపై పడ్డాయి. అయితే అర్ధరాత్రి కావడం, జనసంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇదే తరహా అక్రమ రవాణా ప్రతి రోజూ జరుగుతున్నప్పటికీ అధికారులు కళ్లుమూసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.



ఒంగోలులో ద్వితీయ బహుమతి సాధించిన ముగ్గు విజేత విజయలక్ష్మికి వాషింగ్ మిషన్ అందజేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, శ్రీసరస్వతి విద్యాసంస్థల అధినేత రమణారెడ్డి తదితరులు



తృతీయ బహుమతి సాధించిన ముగ్గు విజేత జి. విజయశాంతికి ట్రావెలర్స్ లగ్గేజ్ సూట్‌ను అందిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, శ్రీ సరస్వతి విద్యాసంస్థల అధినేత రమణారెడ్డి తదితరులు

అంగరంగ వైభవంగా ముగ్గుల పోటీలు

- పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు
- ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీకి విశేష స్పందన
- విజేతలకు బహుమతులను ప్రదానం చేసిన సరస్వతీ విద్యాసంస్థలు

ఒంగోలు(కల్చరల్), జనవరి 7: ఒంగోలుకు సంక్రాంతి పండుగ ముందుగానే వచ్చిందా అన్నంత సందడిగా ఆదివారం ముత్యాల ముగ్గుల పోటీలు జరిగాయి. ఆంధ్రజోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన సంయుక్తంగా ప్రముఖ విద్యాసంస్థ శ్రీసరస్వతీ విద్యాసంస్థల అధినేత ఏవీ.రమణారెడ్డి సహకారంతో జరిగిన ముగ్గుల పోటీలు కన్నుల పండువగా జరిగాయి.ఈ పోటీలకు ఒంగోలు నగరం నుంచే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాల నుంచి కూడా మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇక పోటీలకు వేదికైన ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలను ముగ్గులతో ఇంద్రధనుస్సు ఇలకి దిగివచ్చిందా అన్నంతంగా మారింది. తెలుగువారి సంప్రదాయం ఉట్టిపడేలా కొన్ని, సంప్రదాయంతో పాటు సందేశాత్మకంగా కొన్ని ఇలా మహిళలు రంగులతో చిత్రించిన ముగ్గులు చూపరులను ఆకట్టుకున్నాయి. ఇక పోటీలలో పాల్గొన్న కళాశాల విద్యార్థినులు, యువత అభిరుచులు ఉట్టిపడేలా ముగ్గులు వేశారు. సుమారు 100 మంది మహిళలు పాల్గొన్న ఈ పోటీలు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిందని అతిథులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



ముగ్గులను పరిశీలిస్తున్న మహిళలు



పీవీఆర్ గ్రౌండ్‌లో మహిళలు వేస్తున్న ముగ్గులను పరిశీలిస్తున్న స్పాన్సర్లు



సినీ నటుడు తనికెళ్ల భరణికి పురస్కారాన్ని అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

తెలుగు భాష ఓనమాలు దిద్దుకున్న నేలపై

పురస్కారం అభినందనీయం

అద్దంకిటౌన్, జనవరి 7: ఎర్రాప్రగడ నడిచిన అద్దంకి సీమలోని ప్రతి అణువు శివమయమని, తెలుగుభాష ఓనమాలు దిద్దుకున్న నేలపై పురస్కారం అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని సినీ నటుటు, పురస్కార గ్రహీత తనికెళ్ళ భరణి అన్నారు. ఆదివారం నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కల్యాణ మండపంలో పుట్టంరాజు బుల్నెయ్య, రామలక్ష్మమ్మ జీవిత సాఫల్య పురస్కార సభ డీవీఎం సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. తనికెళ్ల భరిణి నటనవైదుష్యాన్ని, ఆయా పాత్రల్లో పంపించిన హాస్యాన్ని విలనిజాన్ని, సోదహారణలద్వారా సినీ విశ్లేషకులు వారణాసి రఘురామశర్మ వివరించారు. ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ, కుటుంబ సభ్యులతో పురస్కారాన్ని తనికెళ్ల భరణికి అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్వీ రాఘవరావు, వారణాశి రఘురామశర్మ, ట్రస్ట్ సభ్యులు పుట్టరాజు చక్రధర్, తాండవకృష్ణ, నంబూరి హనుమంతరావు, బాలభార్గవి, వీరవల్లి రుద్రయ్య(సుబ్బారావు), మురళీ సుధాకరరావు, కేవీ పోలిరెడ్డి, వీ రయ్య, శ్రీనివాసరావు, జె.హనుమంతరావు, వెంకటేశ్వర్లు, ప్రసాదరావు, విశ్వమోహన్ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

దర్శి, జనవరి 7 : హోరాహోరీగా సాగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. మూడు రోజుల పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగాయి. ఈ పోటీల్లో 11 పురుష, 11 మహిళల జట్లు పాల్గొన్నాయి. దర్శిలో రెండవ సంవత్సరం నగర పంచాయతీ వైస్ చైర్మెన్ స్టీవెన్, సీనియర్ జర్నలిస్టు శీలం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కల్చరల్), జనవరి 7: విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, తమ భవిష్యత్‌ను నిర్ణయించుకునే సత్తాను పెంపొందించుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. ఒంగోలులోని అంబేద్కర్‌భవన్‌లో ఆదివారం శ్రీ పతాంజలి శ్రీనివాస్ యోగా శిక్షణలో గత ఐదు నెలలుగా సాంఘిక సంక్షేమ హస్టల్స్ విద్యార్థులతో నిర్వహిస్తున్న నిత్య యోగ సాధన శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా నిత్య సాధన ద్వారా విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. ఫిబ్రవరి 15న రథసప్తమి సందర్భంగా సూర్య భగవానుడికి నీరజనాల ఆర్పిస్తూ 3వేల మంది విద్యార్థులతో 108 పర్యాయల సూర్య నమస్కారాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పతంజలి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు యోగా విద్య, అలాగే సూర్యయజ్ఞం ప్రకాశం జిల్లాలో మాత్రమే కొనసాగుతుందని తెలిపారు. ఈ ఘనత పూర్తిగా కలెక్టర్ దినేష్‌కుమార్‌కే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు తాతా ప్రసాద్, కిరణ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

వైసీపీకి షాక్

- బేస్తవారపేట మండలంలో నలుగురు మాజీ సర్పంచ్‌లు టీడీపీ చేరిక
- కండువాలు వేసి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు, జనవరి 7 : వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. బేస్తవారపేట మండలంలో అధికార పార్టీకి భారీ షాక్ తగిలింది. నేకునాంబాద్, చెట్టిచెర్ల, బేస్తవారపేట పంచాయతీలకు చెందిన నలుగురు మాజీ సర్పంచులు, నూర్‌బాషా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆదాములు, వారి అనుచరులతో విడివిడిగా టీడీపీలో చేరారు. గిద్దలూరులో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వీరికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. తొలుత బేస్తవారపేట పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు, నూర్‌బాషా సంఘం రాష్ట్ర కార్యదర్శి దూదేకుల ఆదాము 25 కుటుంబాలతో సహా వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. గత ఎన్నికల్లో జగన్ ఇచ్చిన అబద్ధపు హామీలను నమ్మి మోసపోయామన్నారు. టీడీపీలో చేరిన వారిలో బేస్తవారపేట మాజీ సర్పంచ్ దూదేకుల మాబుతోపాటు బాబూసాహెబ్, సిద్ధయ్య పెద్దఖాదర్, కాశయ్య, తదితరులు ఉన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహ,నాయకులు సైదులు, ముప్పూరి రాము, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. నేకునాంబాద్ మాజీ సర్పంచ్ యామా సుహాసిని ఆధ్వర్యంలో 40 కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరాయి. వారిలో దూదేకుల కాశయ్య, బత్తుల మహాలక్ష్మమ్మ, సాలమ్మ, నాగరాజు, నాగేంద్ర, రంగయ్య తదితరులు ఉన్నారు. చెట్టిచెర్ల పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్‌లు తీగిరెడ్డి భూపాల్‌రెడ్డి, కె.కొండారెడ్డి, మాజీ వైస్ సర్పంచ్ చింతల చిన్నవెంకటయ్య, ప్రస్తుత వైస్‌సర్పంచ్ మాచర్ల భూపాల్‌రెడ్డి, వైసీపీ నాయకులు రామచంద్రరెడ్డి, నారాయణరెడ్డి, అనంతరెడ్డి, సయ్యద్ భాషా, తదితరులు టీడీపీలో చేరారు. వీరికి అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఎస్మా చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 7 : న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం గత 20 రోజుల నుంచి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మాను వెంటనే ఉపసంహరించుకోవాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దద్దాల శ్రీనివాసులు, ఏల్చూరి మాధవరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నాలుగు సంవత్సరాల నుంచి ఇచ్చిన హామీలు చేయకుండా ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. వెంటనే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, జనవరి 7 : తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగాభవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గంగమ్మకు పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు ప్రాంతంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి మొ క్కులు తీర్చుకునేందుకు రావడంతో భక్తులతో సందడిగా మారింది. గంగమ్మ తల్లిని భక్తులు దర్శించుకోగా, పలువురు భక్తులు అమ్మవారికి వాహనదారులు వాహనపూజలు చేయించారు. మరి కొందరు భక్తులు గంగమ్మకు విరాళాలుగా సమర్పించారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న 10 కుటుంబాలు

- ఎమ్మెల్యే స్వామి సమక్షంలో పార్టీలో చేరిక

సింగరాయకొండ, జనవరి 7 : సింగరాయకొండ వైసీపీకు చెందిన 10 కుటుంబాల వారు ఆదివారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే స్వామి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఎస్‌కే ఖాజాహుస్సేన్, మస్తాన్, ఖాదర్‌బాషా, బాజీ, అబిద్, పలువురు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత మందలపు గాంధీచౌదరి పాల్గొన్నారు. సింగరాయకొండ పంచాయతీ పరిధిలో ఈద్గమిట్టలో మక్కా వెళ్తున్న టీడీపీ మాజీ ఎంపీటీసీ సభ్యురాలు షేక్ రసూల్‌బీ నివాసంలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే స్వామి, సీనియర్ నేత దామచర్ల పూర్ణచంద్రరావు పాల్గొని మక్కా యాత్ర దిగ్విజయంగా జరగాలని ఆమెను ఆశీర్వదించారు.



రసూల్‌బీతో ఎమ్మెల్యే స్వామి, పూర్ణచంద్రరావు



విజయకుమార్ సమక్షంలో టీడీపీలోకి చేరిన యువకులు

బీఎన్ సమక్షంలో..

మద్దిపాడు: వైసీపీ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు అధ్వానంగా తయారయ్యాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ ఆరోపించారు. ఇనమనమెళ్లూరుకు చెందిన పలువురు వైసీపీ నాయకులు ఆదివారం ఒంగోలులోని బీఎన్ విజయకుమార్ కార్యాలయంలో విజయకుమార్‌ను కలిసి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తగిన ప్రాధాన్యత లేదన్నారు. టీడీపీలో అన్నివర్గాలకు సమన్యాయం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కొండూరి ప్రభాకరరెడ్డి, డొప్ప శేషయ్య, గంగవరపు జోసఫ్, డొప్పు సుబ్బయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు

చూసేందుకు పోటెత్తిన ప్రజలు

దర్శి, జనవరి 7 : జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో దర్శిలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు హోరాహోరీగా సా గుతున్నాయి. దర్శి ప్రాంతంలో గతంలో ఎన్నడూలేని విధంగా నాలుగు రోజులు పాటు భారీ స్థాయిలో జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఏర్పాటు చేయడంతో ఈ పోటీలను తిలకించేందుకు ప్రజలు పోటెత్తారు. వం దలాది మంది మహిళలు కూడా వేదిక వద్ద కూర్చుని పోటీలు తిలకించడం విశేషం. తొలిరోజు శనివారం నాలుగు పళ్ల ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించగా అత్యధికంగా 38 జతలు పాల్గొన్న విషయం తెలిసిందే. తొలిరో జు పోటీలు పూర్తయ్యే సరికి అర్ధరాత్రి 2 గం టల సమయం పట్టింది. పోటీలు పూర్తయిన తర్వాత విజేతలకు బహుమతులు ప్రదానం చే శారు. రెండవ రోజు ఆదివారం ఆరుపళ్ల ఎడ్ల బలప్రదర్శన పోటీలకు 21 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ఈ రోజు కూడా పోటీలు అర్ధరాత్రి వ రకు కొనసాగే అవకాశం ఉంది. మూడవ రోజు సోమవారం న్యూ క్యాటగిరీ ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తారు. 9వ తేదీ చివరిరోజున మంగళవారం సీనియర్ క్యాటగిరీ ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తారు. దర్శి - అద్దంకి రోడ్డులో పోలాల్లో విశాలమైన మైదానంలో పోటీలు నిర్వహిస్తున్నారు. వేధికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ముఖ్య అతిథులు కూర్చునేందుకు వీలుగా 200 మంది ఆహుతులు కూర్చునే వీలుగా సభా వేదికను ఏ ర్పాటు చేశారు. బలప్రదర్శన పోటీలు నిర్వహించే సభ చుట్టూ గ్యాలరీని ఏర్పాటు చేసి ప్రజలు చూసేందుకు వీలుగా ఏర్పాటు చే శారు. మహిళలకు లోపల కుర్చీలు వేసి ప్ర త్యేక సదుపాయం కల్పించారు. పోటీలను తిలకించేందుకు వచ్చిన ప్రజలకు భోజన వసతి కల్పిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ విశేష ఆకర్షణగా నిలిచింది. ప్రభపై ప్రజలను అలరించేందుకు కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. నిర్వాహకుడు వెంకట్‌ను పలువురు అభినందిస్తున్నారు. చివరి రెండు రోజులు భారీ స్థాయిలో ఎడ్లు వచ్చే అవకాశం ఉన్నందున పోటీలు ఉత్కంఠంగా సాగే అవకాశం ఉంది. పోటీలను తిలకించేందుకు అధికసంఖ్యలో యువత పాల్గొని ఆస్వాదించారు.



మొదటి బహుమతిని తోట శ్రీనివాసరావుకు, ద్వితీయ బహుమతిని రామిరెడ్డికి అందజేస్తున్న జనసేన పార్టీ నేత వెంకట్

నాలుగు పళ్ల ఎడ్ల బలప్రదర్శనలో విజేతలకు బహుమతులు ప్రదానం

జనసేన పార్టీ దర్శి నియోజకవర్గ నాయకుడు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో తొలిరోజు జరిగిన నాలుగు పళ్ల ఎడ్ల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో గుంటూరు జిల్లా, కుప్పురావూరుకు చెందిన తోటా శ్రీనివాసరావు ఎడ్లు 15 నిమిషాల్లో 4269.5 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానం సాధించారు. గుంటూరు జిల్లా తుళ్లూరుకు చెందిన మోదుగుల రామిరెడ్డి ఎడ్లు 4202.9 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం పొందారు. గరికపాటి వెంకట్‌కు చెందిన ఎడ్లు 4202.5 అడుగుల దూరం లాగి మూడవ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా, సరిపూడికి చెందిన శాఖమూరి రామకోటయ్య, వెదుళ్లపల్లి శ్రీనివాసరావు ఎడ్లు 4200 అడుగుల దూరం లాగి నాల్గవ స్థానం, పల్నాడు జిల్లా, గురజాలకు చెందిన లింగా అంజయ్యచౌదరి ఎడ్లు 4131.3 అడుగుల దూరం లాగి ఐదవ, గుంటూరు జిల్లా కుప్పురావురుకు చెందిన తోటా శ్రీనివాసరావు ఎడ్లు 4110.4 అడుగుల దూరం లాగి ఆరవ, ప్రకాశం జిల్లా, ఎర్రగొండపాలెంకు చెందిన పునాది శ్రీనివాసరెడ్డి ఎడ్లు 3908.1 అడుగు దూరం లాగి ఏడవ, నంద్యాల జిల్లా, పులిగెల గ్రామంకు చెందిన బత్తుల జనార్దన్‌రెడ్డి ఎడ్లు 3773.5 అడుగుల దూరం లాగి ఎనిమిదవ, గుంటూరు జిల్లా, తక్కెళ్లపాడుకు చెందిన నందిపాటి శ్రీజరి భవాగ్న, అభయ్‌రామ్ తరుణ్‌తేజ్‌కు చెందిన ఎడ్లు 3681 అడుగుల దూరం లాగి తొమ్మిదవ స్థానం సాధించాయి.

విజేతలకు ప్రథమ బహమతిగా రూ.50వేలు, రెండవ బహుమతిగా రూ.40వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు, నాల్గవ బహుమతిగా రూ.25వేలు, ఐదవ బహుమతిగా రూ.20వేలు, ఆరవ బహుమతిగా రూ.18 వేలు, ఏడవ బహుమతిగా రూ.15వేలు, ఎనిమిదవ బహుమతిగా రూ.10వేలు, తొమ్మిదవ బహుమతిగా రూ.8వేలు నగదును అందజేశారు. పోటీల్లో పాల్గొన్న అన్ని జట్లకూ రూ.6వేలు చొప్పున ప్రత్యేక బహుమతులను అందజేశారు. ఎడ్ల యజమానులందరినీ శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి!

ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

బల్లికురవ, జనవరి 7: వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ప్రజలకు తెలియజేయాలని ఎమ్మెల్యే గొట్టి పాటి రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం సంత మాగులూరు మండలం పుట్టవారిపాలెంలో ఎమ్మెల్యే అతిథి గృహంలో బల్లికురవ మండలానికి చెందిన కూ కట్లపల్లి, వైదన, కొణిదెన గ్రామాలకు చెందిన టీడీడీ నేతలతో ఎమ్మెల్యే రవికుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాలవారీగా పార్టీ నేతలతో మాట్లా డారు. గ్రామాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసు కొన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజు రయిన అభివృద్ధి పనులు, ఇప్పుడు చేసిన పనులపై చర్చించారు. ఈవిషయాలను ప్రజలకు తెలియజేయా లని ఓటరు పేజీని వేగవంతంగా పూర్తిచేసి ఇం టింటి కి తిరిగి ప్రచారం చేపట్టాలని సూచించారు.

ఈసందర్భంగా నేతలతో ఎమ్మెల్యే రవికుమార్ మా ట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలపై పె నుభారం వెూపుతుంద న్నారు. విచ్చలవిడిగా అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మారుస్తుందన్నారు. గత నాలుగేళ్ల నుంచి అభివృద్ధి అనే పనులు చేపట్టకుండా వచ్చిన కాడికి అప్పులు తెచ్చి అరకొరగా ప్రజలకు నగదు పంపిణీ చేయటం దుర్మార్గమన్నారు. ప్రజలకు ఈ విషయాలను అర్థమయ్యేలా వివరించా లని చెప్పారు. ఎంతో అనుభవశాలి అయిన చంద్రబాబునాయుడు తిరిగి ముఖ్యమంత్రిగా వస్తే సంపద సృష్టించి అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలందరికి అందిస్తారన్నారు. ఇప్పుడు జగన్ ఇస్తున్న పథకాల నగదు విద్యుత్ బిల్లుకు కూరగాయాలకు కూడ సరిపోవటం లేదని ఆయన విమర్శించారు. పేరు గోప్ప ఊరు దిబ్బ అన్న చందంగా అరకొర పథకాలు అందించిన ప్రతిసారి కోట్లు వెచ్చించి ప్రకటనల రూపం లో ప్రజా ధనం వృధా చేస్తున్న ఘనత వైసీపీకే దక్కుతుందని ధ్వజమెత్తారు. సమావేశంలో టీడీపీ మండల నేత కొండేటి ఇజ్రా యల్, గ్రామాల నేతలు ఇప్పల అంజిరెడ్డి, పందిరి అబ్రహాం, పోగుల చంద్రశేఖర్, మండల ముస్లిం మైనా రిటీ అధ్యక్షులు షేక్ ఖాదే, గ్రామాల బూత్ కమిటీ సభ్యులు, పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కూకట్లపల్లి గ్రామ టీడీపీ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్





ద్వితీయ బహుమతి పొందిన శిరీషకు ఆరువేల నగదు బహుమతి, తృతీయ బహుమతి నాలుగువేల నగదు బహుమతి అందజేస్తున్న అశోక్‌రెడ్డి, ముగ్గును పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

- ఏబీఎన్, ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహణ
- 30 మందికి కన్సొలేషన్ బహుమతులు
- ముఖ్య అతిథిగా హాజరైన అశోక్‌రెడ్డి

గిద్దలూరు, జనవరి 7 : గిద్దలూరులోని టెన్నీస్ స్టేడియంలో "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన" ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. లక్ష్మీ మిల్క్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సౌజన్యంతో పోటీలు జరిగాయి. ఉదయం 9 గంటల నుంచే ముగ్గులు వేసేందుకు మహిళలు బారులు తీరారు. మధ్యాహ్నం 2 గంటల వరకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం న్యాయనిర్ణేతలు సుజాత, ఆదిలక్ష్మి, రేవతి ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. అంతేకాకుండా 30 మంది వేసిన ప్రత్యేక ముగ్గులకు కన్సొలేషన్ బహుముతులను అందజేశారు. మొదటి బహుమతి బేస్తవారపేటకు చెందిన బెల్లం హిమబిందు, రెండవ బహుమతి కొమరోలు మండలం వెంకటాపురానికి చెందిన శిరీష, మూడో బహుమతి బద్వేలుకు చెందిన కాత్యాయిని సాధించారు. ఈ సందర్భంగా జరిగిన సభను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ . ఏటా ముగ్గుల పోటీలు నిర్వహించి ముందస్తు సంక్రాం తి వేడుకలను ప్రజలకు పరిచయం చేస్తోందన్నారు. ఆంధ్రజ్యోతి ఒంగోలు బ్రాంచి మేనేజర్ ఐ.వి.సుబ్బారావు మాట్లాడుతూ ఏటా గిద్దలూరులో నిర్వహించే ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీల్లో మహిళలు, వృద్ధులు కూడా ఉత్సాహంగా పాల్గొనడం ఆహ్వానించదగిన పరిణామమన్నారు. ప్రత్యేకంగా ముగ్గులు వేసిన 30 మంది మహిళలకు వెంకటేశ్వర అపార్ట్‌మెంట్స్ యజమాని ఎల్.జనార్ధననాయుడు, బోర్ వెల్స్ యజమాని ఆరవీటి జనార్ధన్, టెక్స్‌మో డీలర్ పరుచూరి నాగేశ్వరరావు, హిందూ దేవాలయాల కమిటీ అధ్యక్షులు చేరెడ్డి యర్రారెడ్డిలు కన్సొలేషన్ బహుమ తులను అందజేశారు. సాయిశ్రీనివాస జ్యూవెలర్స్ యజ మాని నటుకుల శ్రీనివాసులు 40 మందికి జూవెలరీ బ్యాగులను అందజేశారు. కమల క్లాత్ యజమాని వాడకట్టు శివప్రసాద్ పోటీలో పాల్గొన్న అందరి పేర్లతో లక్కీడిప్ ఏర్పాటు చేశారు. ఐదుగురికి మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చేతుల మీదుగా చీరలను అందజేశారు. ఐటీసీ డీలర్ కొల్లి నాగరాజు పోటీలో పాల్గొన్న వారికి ఉపాహారం సమకూర్చారు. ప్రధాన స్పాన్సర్‌నైన మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పోటీలో పాల్గొన్న 130 మందికి ప్రత్యేక బహుమతులను అందజేశారు. వారికి అల్పాహారాన్ని సమకూర్చారు. మొత్తం మీద టెన్నీస్ కోర్టు మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులతో కళకళలాడింది.




కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న మహిళలు, ముగ్గులు వేస్తున్న మహిళలు

వైసీపీకి షాక్

- బేస్తవారపేట మండలంలో నలుగురు మాజీ సర్పంచ్‌లు టీడీపీలో చేరిక
- కండువాలు కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే ముత్తుముల



టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు, జనవరి 7 : వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. బేస్తవారపేట మండలంలో అధికార పార్టీకి భారీ షాక్ తగిలింది. నేకునాంబాద్, చెట్టిచెర్ల, బేస్తవారపేట పంచాయతీలకు చెందిన నలుగురు మాజీ సర్పంచులు, నూర్‌బాషా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆదాములు, వారి అనుచరులతో విడివిడిగా టీడీపీలో చేరారు. గిద్దలూరులో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వీరికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. తొలుత బేస్తవారపేట పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు, నూర్‌బాషా సంఘం రాష్ట్ర కార్యదర్శి దూదేకుల ఆదాము 25 కుటుంబాలతో సహా వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. గత ఎన్నికల్లో జగన్ ఇచ్చిన అబద్ధపు హామీలను నమ్మి మోసపోయామన్నారు. టీడీపీలో చేరిన వారిలో బేస్తవారపేట మాజీ సర్పంచ్ దూదేకుల మాబుతోపాటు బాబూసాహెబ్, సిద్ధయ్య, పెద్దఖాదర్, కాశయ్య, తదితరులు ఉన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహ,నాయకులు సైదులు, ముప్పూరి రాము, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. నేకునాంబాద్ మాజీ సర్పంచ్ యామా సుహాసిని ఆధ్వర్యంలో 40 కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరాయి. వారిలో దూదేకుల కాశయ్య, బత్తుల మహాలక్ష్మమ్మ, సాలమ్మ, నాగరాజు, నాగేంద్ర, రంగయ్య తదితరులు ఉన్నారు. చెట్టిచెర్ల పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్‌లు తీగిరెడ్డి భూపాల్‌రెడ్డి, కె.కొండారెడ్డి, మాజీ వైస్ సర్పంచ్ చింతల చిన్నవెంకటయ్య, ప్రస్తుత వైస్‌సర్పంచ్ మాచర్ల భూపాల్‌రెడ్డి, వైసీపీ నాయకులు రామచంద్రరెడ్డి, నారాయణరెడ్డి, అనంతరెడ్డి, సయ్యద్ భాషా, తదితరులు టీడీపీలో చేరారు. వీరికి అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

మద్యం, పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

మార్కాపురం రూరల్, జనవరి 7: పట్టణంలోని పదోవార్డు నాగులవరం రోడ్డులో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. వారిని అరెస్టు చేశారు. అలాగే భగత్‌సింగ్ కాలనీలో పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.950ను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు.

దోర్నాలలో వికసిత భారత్ సంకల్పయాత్ర

పెద్దదోర్నాల, జనవరి 7: స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని బీజేపీ మండల అధ్యక్షులు గండి వీరారెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ పథకాలు ముద్రాలోన్, ఉజ్వల భవిష్యత్తు ఆయుస్మాన్ భారత్ హెల్త్ యోజన, కిసాన్ యోజన వంటి పథకాలను ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగపరుచుకొని అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాసర్‌రెడ్డి, తహసీల్దారు వేణుగోపాలరావు, ఎంఈవో మస్తాన్‌నాయక్, ఏవో జవహర్‌లాల్‌నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భ్రమరాంబికాదేవి, ఆయా శాఖాధికారులు, నాయకులు మల్లారెడ్డి, శ్రీనివాసులు, సామియేలు, తదితరులు పాల్గొన్నారు.

మండల భవన కార్మికుల సంఘం నూతనకార్యవర్గం ఏకగ్రీవం

- అధ్యక్షుడిగా షేక్ పీరా

ఎర్రగొండపాలెం, జనవరి 7 : ఎర్రగొండపాలెం మండల భవననిర్మాణ రంగ కార్మికుల సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. మండల భవన కార్మికుల సంఘం అధ్యక్షులుగా షేక్ పీరా, కార్యదర్శిగా అన్వర్‌బాషాలు ఎన్నికలయ్యారు. మరి కొంతమందిని కార్యవర్గసభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డి.శ్రీనివాసులు, సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, కేవీ.కృష్ణగౌడ్ భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ఎంఈవో-2ల నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

పొదిలి, జనవరి 7 : మండల విద్యాశాఖ అధికారుల (ఎంఈవో-2) నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రాజాల కొండారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వి.గిరిధరశర్మ, కోశాధికారిగా కే.శివాజీ, గౌరవ అధ్యక్షులుగా డి వెంకటరెడ్డిని ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా సీహెచ్ సుబ్రహ్మణ్యం, డి రామిరెడ్డి, రమాదేవి, రాజశేఖర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. ఎంఈవో-2లో జాబ్ చార్ట్‌లను మార్పు చేయాలని నూతన కమిటీ తొలి తీర్మానం చేసింది. సమగ్రశిక్ష కార్యకలాపాలన్నీ ఎంఈవో-2ల ద్వారా చేయిస్తున్నారని, సిబ్బంది అయిన పీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటాఎంట్రీ ఆపరేటర్లను రెండవ ఎంఈవోలకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఆలయ ముఖద్వారం ప్రారంభం



ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గిద్దలూరు టౌన్, జనవరి 7 : దక్షిణ కాశీగా పేరొందిన శ్రీపాతాళ నాగేశ్వరస్వామి ఆలయ తూర్పు ముఖద్వారాన్ని ఎమ్మెల్యే అన్నారాంబాబు ప్రారంభించారు. దాతలైన ఫ్రెండ్స్ కమిటీ ప్రతినిధులు, వైసీపీ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోనికి వస్తేనే దళితుల అభివృద్ధి

వై.పాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు



టీడీపీ మేనిఫెస్టో పత్రాలు అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జనవరి 7 : రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే దళిత కాలనీల అభివృద్ధి చెందుతాయని, ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. ఎర్రగొండపాలెం మండలం గురిజేపల్లి గ్రామం ఎస్సీకాలనీలో ఆదివారం సాయంత్రం 'బాబుష్యూరిటీ భవిష్యత్‌కు టీడీపీ గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి టీడీపీ మేనిపెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. మూడు నెలల్లో ఎన్నికలు రానున్నాయని, టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. నియోజకవర్గంలో ఏ కాలనీకి వెళ్లినా తాగునీటి సమస్య వెంటాడుతోందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఆయా కాలనీలోని సమస్యలను దగ్గరుండి పరిష్కరిస్తామన్నారు. అదే విధంగా ఎస్సీ కార్పోరేషన్ రుణాలు పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, టీడీపీ రైతు అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి టీడీపీ మండల నాయకులు కంచర్ల సత్యనారాయనగౌడ్, వేగినాటి శ్రీను, వెన్నా వెంకిరెడ్డి, కొత్త బాస్కర్, కందుల నారాయణరెడ్డి, రైతు అధ్యక్షులు పోక వెంకట సుబ్బయ్య, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గిద్దలూరు, జనవరి 7 : పట్టణంలోని శ్రీవివేకానంద కళాశాలకు చెందిన 1983-85-88 బ్యాచ్ పూర్వ విద్యార్థుల 4వ వార్షిక సమ్మేళన కార్యక్రమం విరా సుబ్బరత్నం కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. రిటైర్డ్ పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ కాకమాను రాజశిఖామణి ముఖ్య అతిథిగా హాజరుకాగా పూర్వ విద్యార్థులలో ఒకరైన మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరైనారు. పేద ఎంబీబీఎస్ విద్యార్థిని చదువుకోసం రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గురువులను, ఆశ్రమాల నిర్వాహకులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు హనుమంతరెడ్డి, తులసిబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



శిక్షణ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 7: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు పోకల సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక సీ కన్వెన్షన్‌లో 'అపూస్మా' సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. బట్టీ చదువులకు స్వస్తి చెప్పి సరైన ప్రణాళికతో చదవాలన్నారు. ప్రశ్నించడం అలవాటు చేసుకొని సరైన పద్ధతిలో తమను తాము మలుచు కోవాలన్నారు. పట్టణంలోని 15 ప్రైవేట్ పాఠశాలల నుంచి 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో 'అపూస్మా' డివిజన్ అధ్యక్షులు మల్లికార్జున రెడ్డి, ఎంఈవో రాందాస్ నాయక్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా ముగ్గుల పోటీలు



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

మార్కాపురం రూరల్ జనవరి 7: పట్టణంలోని వడ్డేబజారులో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గులు పోటీలు నిర్వహించారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా మహిళలను ఉత్సాహపరిచేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పూజలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ముగ్గులు వేశారు. అలాగే మహిళలకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలలో మొదటి బహుమతి విజయలక్ష్మీ, రెండో బహుమతి రితికలు గెలుచుకున్నట్లు తెలిపారు. విజేతలకు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీ.కృష్ణారావు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొంతల కృష్ణ, కంభం వెంకటరమణ, గుండారపు నాగరాజు, డీఎం బాష, వెంకటేశ్వరరెడ్డి, వాసవీ, ప్రియ, నాగేశ్వరరావు, సురేష్‌లు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

త్రిపురాంతకం, జనవరి 7: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 8న సోమవారం ఉదయం 11.00 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.సాంబశివరావు తెలిపారు. ఎంపీపీ కోట్ల.సుబ్బారెడ్డి సమావేశానికి అధ్యక్షత వహిస్తారన్నారు. మండలంలోని అన్ని శాఖల మండలస్థాయి అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

ఎస్మాకాకే కాదు.. ఎన్‌కౌంటర్‌కూ బెదరం..!

కంభం, జనవరి 7 : ప్రభుత్వం తమపై ఎస్మా ప్రయోగించినా.., ఎన్‌కౌంటర్ చేసినా బెదిరేది లేదని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం 27వ రోజు దీక్షలో వారు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో అంగన్‌వాడీల సత్తా ఏమిటో ప్రభుత్వానికి తెలుస్తుందన్నారు. ఏఐటీయూసీ నాయకులు మహమ్మద్ ఇబ్రహీం మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను తీర్చాలని సమ్మెచేస్తున్నా ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయిందన్నారు. ఎస్మాను రద్దు చేసి అంగన్‌వాడీలకు న్యాయం చేయాలన్నారు. న్యాయం జరిగేంత వరకు దీక్షలు విరమించబోమన్నారు. అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అన్వర్, సరళ, రాజేశ్వరి, శ్రీదేవి, ఆదిలక్ష్మి, శారద పాల్గొన్నారు.

గిద్దలూరు : డిమాండ్ల పరిష్కారం కోసం గత 27 రోజులుగా నిర్వధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు ఆదివారం కూడా తమ ఆందోళన వీడలేదు. గిద్దలూరు వచ్చిన ఎమ్మెల్యే అన్నా రాంబాబును కలిసి వినతిపత్రం అందచేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంగన్‌వాడీలపై ప్రయోగించిన ఎస్మా ప్రతులను దహనం చేశారు. బెదిరింపులకు భయపడమని, సమస్యలను పరిష్కరించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్వర్ణకుమారి, మున్నా, వరలక్ష్మి ఆవులయ్య పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డి.శ్రీనివాసులు అన్నారు. ఎర్రగొండపాలెంలో ధర్నా శిబిరం వద్దకు సీపీఐ నాయకులు, భవనకార్మికుల సంఘం నాయకులు కలసి వెళ్లి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.., ఎస్మా చట్టాన్ని ప్రయోగించి అంగన్‌వాడీలను బెదిరించడం దారుణమన్నారు. సంఘీబావం తెలిపిన వారిలో సీపీఐ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, మండల కార్యదర్శి బి.రామయ్య, భవనకార్మికుల సంఘం అధ్యక్షులు షేక్ ఫీరా, కార్యదర్శి అన్వర్‌బాష, ఆవుల యోగయ్య,సంఘీబావం తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్& హెల్పర్స్ యూనియన్ నాయకులు జి మల్లేశ్వరి, పి సుబాషిణి,నాగరాజకుమారి, రామసుబ్బమ్మ, అరుణ,సునీత, తలపాటి సుబ్బమ్మ,సుజాత, విజయలక్ష్మి, రూత్‌మేరి, రామకుమారి, తిరుపాలమ్మ, పాల్గొన్నారు. మూడు మండలాల నుంచి 300మందికిపైగా కార్యకర్తలు, పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని లేనిపక్షంలో ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. దోర్నాలలో ఆదివారం కూడా అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఇప్పటికైనా స్పందించి తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముంతాజ్‌బేగం, సుబ్బమ్మ, వెంకటలక్ష్మీ, వెంటరత్నం, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

పొదిలి : అంగన్‌వాడీ కార్యకర్తలపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని తక్షణమే వెనక్కు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.రమేష్ డిమాండ్ చేశారు. తక్షణమే ఆజీవోను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక చిన్నబస్టాండ్ సెంటర్‌లో ఎస్మా జీవోను రద్దుచేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో జీవో ప్రతులను దహనం చేశారు. అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగం చెల్లదన్నారు. అంగన్వాడీలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. అంగన్వాడీలతోపాటు, మున్సిపల్ కార్మికులు, సమగ్రశిక్ష ఉద్యోగులతో ముఖ్యమంత్రి చర్చలు జరిపి సమ్మెకు పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎంవి.రావ్, బి.కోటేశ్వరరావు, ఆర్ తిరుపతయ్య తదితర కార్మికులు పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : అంగన్‌వాడీ కార్యకర్తలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి వారి సమస్యలు పరిష్కరించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ అన్నారు. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 27వ రోజు ఆదివారం నాడు కొనసాగింది. స్థానిక కోర్టు కూడలిలో మానవ హారం ఏర్పాటు చేసి ప్రభుత్వ జీవోను కాల్చివేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాసరయ్య, కాశీం, రఫీ, నాయకురాళ్లు పాల్గొన్నారు.




కంభంలో దీక్ష చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కార్యకర్తలు



ఎస్మా ప్రతులను దహనం చేస్తున్న కార్యకర్తలు

అవీ..ఇవీ..

సేవచేయడమే మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యం



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

పొదిలి, జనవరి 7 : ఆపదలో ఉన్నవారికి సేవచేయడమే మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ లక్ష్యమని వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎస్వీగ్రాండ్ ఆవరణలో పార్థసారధి, కల్లం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయసమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తక్కువ కాలంలో పొదిలి ప్రాంతంలో మానవతా స్వచ్ఛంద సేవాసంస్థలో సేవచేయడానికి ముందుకురావడం శుభపరిణామమన్నారు. ఇబ్బదిపడుతున్న ప్రజలను గుర్తించి వారికి మేమున్నాము అంటూ వెన్నుతట్టి తోచినంత సాయం అందించి, వారి భాగోగుల్లో పాలుపంచుకోవడమే సంస్థ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అందుకు ముందుకు వచ్చిన పొదిలి ప్రాంత సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. సంస్థకు స్వచ్ఛందంగా వెలిశెట్టి వెంకటేశ్వర్లు బహూకరించిన శాంతిరథాన్ని ఆయన ప్రారంభించారు. అదేవిధంగా టీడీపీ జడ్పీటీసీ మాజీ సభ్యుడు కాటూరి పెదబాబు, వైసీపీ రాష్ట్ర నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, యర్రం వెంకటరెడ్డిలు 3 ఫ్రీజర్ బాక్స్‌లను అందజేశారు. అనంతరం వారిని శాలువాలతో సత్కరించారు.

చెంచు గిరిజనులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంస్థ నిర్వాహకులు

పెద్దదోర్నాల, జనవరి 7: మండలంలోని బలిజేపల్లి గిరిజనగూడెంలో చెంచు గిరిజనులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గూడేనికి చెందిన 25 కుటుంబాలకు దుప్పట్లు అందజేసినట్లు ట్రస్ట్ చైర్మన్ పులి శ్రీనివాసప్రసాద్ తెలిపారు. సంస్థ ద్వారా మరిన్ని సేవలందించనునట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తన్నీరు బాలరంగారావు, వలంటీరు బాలరాజు నాయక్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో మేథోవికాసం

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 7: విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనడం ద్వారా మేధస్సు మరింత పెరుగుతుందని, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం పాఠశాలలో ప్రజ్ఞావికాస పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశ్నాపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఓ.వీరారెడ్డి, బి.శ్రీరాములు, పాపయ్య, వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు విజయ్, వై.శివ తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 7: మార్కాపురంలోని ఎం.ఎస్. మార్షల్ ఆర్ట్స్ కరాటే స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా పాఠశాల చీఫ్ ఎగ్జామినర్ మారంరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం విద్యార్థులను అభినందించి మాట్లాడారు. జోయా సిటీకి ముస్కాన్, యాసిన్ బాషాలు బంగారు పతకాలు సాధించారన్నారు. భార్గవ్, షకీల్, యాసిన్, జశ్వంత్‌రెడ్డి, శివ, యాసిన్‌లు రాజస్థాన్‌లోని జయపూర్‌లో జరిగిన 24వ జాతీయ స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు సాధించారన్నారు.

వెండి శంఖం బహూకరణ



వెండి శంఖం అందిస్తున్న శ్రీనివాసులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 7: పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు ఆలంపల్లి శ్రీనివాసులు శివాజీ నగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయా నికి ఆదివారం వెండి శంఖం బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేడుకగా అధ్యాయన ఉత్సవం



అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 7: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని చెన్న కేశవస్వామి ఆలయంలో అధ్యయన ఉత్సవం ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవ స్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులు, రామానుజాచార్యుల ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకం, వివిధ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉభయదాతలు కేశవరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఏపీ మంచినీటి పథకం అస్తవ్యస్తం

- శిథిలావస్థకు చేరిన పైపులు, ఓవర్‌హెడ్ ట్యాంకులు
- నీటి సరఫరాకు తీవ్ర ఆటంకం
- తాగునీరు సక్రమంగా అందక అవస్థలు

దర్శి, జనవరి 7 : 120 గ్రామాలకు తాగునీరు అందించే ఎన్‌ఏపీ రక్షిత మంచినీటి పథకం అస్తవ్యస్తంగా మారింది. ఏళ్ల తరబడి సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో పూడిక తీయకపోవడంతో నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. సుమారు 35 సంవత్సరాల క్రితం వేసిన పైపులైన్లు, నిర్మించిన ఒవర్‌హెడ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. దీంతో తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. స్కీమ్ పరిధిలోని గ్రామాలకు మంచినీరు అందక ప్రజలు అవస్థలు పడుతున్నారు. దర్శి ఎన్‌ఏపీ



నిల్వ సామర్థ్యం కోల్పోయిన దర్శి సమ్మర్ స్టోరేజీ ట్యాంక్



శిథిలావస్థలో ఓవర్ హెడ్ ట్యాంక్

చెరువు ద్వారా దర్శి, ముండ్లమూరు, పొదిలి తదితర ప్రాంతాలకు 120 గ్రామాలకు నీరు పంపిణీ చేయాల్సి ఉంది. 35 సంవత్సరాల కిందట వేసిన పైపులైన్ భూమిలో అడుగున శిథిలమై ఉన్నాయి. ఒత్తిడికి పగిలిపోయి తరచూ నీటి పంపిణీకి ఆటంకం కలుగుతోంది. పైపులు మరమ్మతులు చేయాలంటే సిబ్బంది 5 అడుగులు గుంతతీసి తెలుసుకునేందుకు కష్టతరమవుతుంది. అదేవిధంగా ఒవర్‌హెడ్ ట్యాంకులు కూడా కూలే దశకు చేరాయి. పంపింగ్ చేసే మోటార్లు తుప్పుపట్టి పోవడంలో సక్రమంగా పనిచేయక తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ఇటీవల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో పట్టణంలోని అనేక ప్రాంతాలకు నీటి సరఫరా కాలేదు. ప్రస్తుతం ఏదో ఒక ప్రాంతంలో పైపులైన్లు పగిలి నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఆధునీకరణ పనుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు విడుదల కాకపోవడంతో అలాగే నెట్టుకొస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ స్కీమ్ మరింత అధ్వానంగా తయారై మూలనపడే ప్రమాదం ఉంది. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన స్కీమ్ అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.



తుప్పుపట్టిన మోటార్లు



పింఛన్ కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు

వారమైనా పింఛన్ అందలేదు

వలంటీర్ కోసం వృద్ధుల ఎదురుచూపు

తాళ్లూరు, జనవరి 7 వైఎస్సార్ పింఛన్ కానుక వారమైనా అందలేదు. వలంటీర్ కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఎదురుచూస్తున్నారు. శివరాంపురం గ్రామ వలంటీర్ వారం రోజులుగా పెన్షన్ నగదు పంపిణీ చేయకపోవడంతో పింఛన్‌దారులు ఆందోళన చెందుతున్నారు. శివరాంపురం గ్రామంలో వలంటీర్ అనుపర్తి మరియదాసు నగదు తన దగ్గరే ఉంచుకొని వారం దాటినా పంపిణీ చేయలేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో వలంటీర్ విధుల్లో లేక పోవడంతో ఆ వలంటీర్ పరిధిలోని పెన్షన్ లబ్ధిదారులకు నగదు పంపిణీ చేయాలని అధికారులు నగదును మరియాదాసుకు అందజేశారు. ప్రభుత్వం నుంచి నిధులు ఆలస్యంగా విడుదల చేయగా వలంటీర్ లబ్ధిదారులకు వారం రోజులుగా పంపిణీ చేయలేదని అంటున్నారు. గత మూడు రోజులుగా నిత్యం వలంటీర్ వద్దకు పెన్షన్ కోసం వెళ్లి గంటల కొద్ది పడిగాపులు కాస్తున్నా డబ్బులు ఇవ్వలేదని వాపోతున్నారు. పెన్షన్ నగదు చెల్లించకుండా ఏవేవో సాకులు చెప్తూ కాలం వెళ్ల దీస్తున్నారని తెలిపారు. పెన్షన్ నగదు వలంటీర్ వద్ద ఉందో లేదో అన్న అనుమానాలు వ్యక్త మవుతున్నాయని వారంటున్నారు. అనారోగ్య సమస్యలకు మందు, మాత్ర వేసుకునేందుకు పింఛన్ డబ్బులే ఆధారమని, వలంటీర్ తనవద్దే ఉంచుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. గతంలో కూడా పలు పర్యాయాలు ఇలాగే ఇబ్బందులు పెట్టారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పింఛన్ డబ్బులు అందించేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న పువ్వాడి

సభ విజయవంతంపై ధన్యవాదాలు

పామూరు, జనవరి 7 : మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆధ్వర్యంలో జరిగిన చంద్రబాబు శంఖారావం సభ విజయవంతం చేసిన ప్రజలు, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో టీడీపీ ముఖ్య నేతలతో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ముమ్మరంగా వ్యవసాయ ఇతర పనుల్లో నిమగ్నమై ఉన్న ప్రజలు చంద్రబాబు, ఉగ్రపై అభిమానంతో పెద్ద సంఖ్యలో సభకు హాజరై జయప్రదం చేయడం సంతోషకరమన్నారు. సభకు అశేష సంఖ్యలో మహిళలు తరలిరావడం మార్పునకు సంకేతమని, టీడీపీ వెంటే మేమన్న సంకేతం దీంతో స్పష్టమైందని వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సక్సెస్ రానున్న ఎన్నికల విజయం కోసం అందరూ కలిసి పనిచేసేందుకు పనికివస్తుందన్నారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు బీ నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబు, షేక్ ఖాజారహంతుల్లా, హరిబాబు, పీ వెంకటేశ్వర్లు, ఎన్.సాంబయ్య, ఇర్రి కోటిరెడ్డి, శ్రీను, రమణయ్య, ఆర్‌ఆర్ రఫి, చినహాజరత్, పులినాయభ, జీ మహేష్, వినోద్ పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడి.. 13 మంది అరెస్టు

23 మోటార్ సైకిళ్లు, రూ.17,450, 10 సెల్ ఫోన్లు స్వాధీనం

దొనకొండ, జనవరి 7 : మండలంలోని దొండపాడు - వద్దిపాడు గ్రామాల మధ్య పొలాల్లో కోడి పందేలు జరుగుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేసిన సంఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. అందిన వివరాల మేరకు దొనకొండ గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్‌ఐ ఎం.సైదుబాబు తన సిబ్బందితో మారు వేషాల్లో ఆ ప్రాంతానికి చేరుకొని వలపన్ని చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ దాడిలో కోడి పందాళ్లు ఆడుతున్న దొండపాడు పరిసర గ్రామాలకు చెందిన 13 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.17450 నగదు, ఎనిమిది కోడి పుంజులు, పది సెల్‌ఫోన్లు, 23 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సైదుబాబు తెలిపారు. కోడి పందెం ఆడుతూ పట్టుబడిన 13 మందిని, 23 మోటార్ సైకిళ్లను ట్రాక్టర్లల్లో ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టి కేసు నమోదు చేసి దర్శి కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మండలంలోని ఏ గ్రామంలోనైనా కోడి పందేలు, పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే 9121102175 నెంబరుకు చెప్పాలని ఎస్‌ఐ విజ్ఞప్తి చేశారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై దాడి చేసి 29 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సైదుబాబు తెలిపారు. మండలంలోని మంగినపూడి గ్రామంలో వెంకటేశ్వర్లు అనే వ్యక్తి దుకాణంలో అక్రమ మద్యం విక్రయిస్తుండగా పట్టుకొని తనిఖీ చేయగా 29 అక్రమ మద్యం బాటిల్స్ దొరికినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్శి కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

ముండ్లమూరు : మండలంలోని పసుపుగల్లు, పోలవరం, వేములబండ గ్రామంలోని బెల్టు షాపులపై ఎస్‌ఐ యూ వెంకట కృష్ణయ్య తన సిబ్బందితో వెళ్లి ఆదివారం దాడులు చేయగా 49 మద్యం సీసాలు పట్టుబడినట్టు ఎస్‌ఐ వెంకట కృష్ణయ్య తెలిపారు. 25 పసుపుగల్లు, 17 పోలవరం, వేములబండలో ఏడు సీసాలు పట్టుబడినట్టు తెలిపారు. ఏఎస్‌ఐ బీ పవన్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, మహేష్, కాశీరాజు, శ్రీను పాల్గొన్నారు.

తాళ్లూరు : మండలంలోని లక్కవరం గ్రామంలో ఎస్‌ఐ వైవీ రమణయ్య ఆధ్వర్యంలో పోలీసులు అక్రమంగా మద్యం విక్రస్తున్న షాపులపై దాడులు చేసిన ఇద్దరు వ్యక్తుల వద్ద 46 లిక్కర్ బాటిళ్లను ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. షాపులలో మద్యం అమ్ముతున్నారన్న సమాచా రం మేరకు దాడులు నిర్వహించారు.గ్రామంలోని దేవెళ్ల రమణమ్మ ఇంట్లో అ నుమతి లేకుండా అమ్మకానికి ఉంచిన 38 లిక్కర్ బాటిళ్లు, కొండలు షాపులో 8 లిక్కర్ బాటిళ్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బాటిళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి ఇరువురిని దర్శి కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు.

కురిచేడు : మండలంలోని నాంచారపురం గ్రామం వద్ద పేకాడుతున్న ఐదుగురిని ఎస్‌ఐ దేవకుమార్, దర్శి ఎస్‌ఈబీ ఎస్‌ఐ శ్రీధర్‌బాబు అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.6830 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



సీఐ నాయక్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

సీఐకి టీడీపీ నేతల శుభాకాంక్షలు

పామూరు, జనవరి 7 : పామూరు నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన రామానాయక్‌ను పామూరు టీడీపీ శ్రేణులు ఆదివారం సర్కిల్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పరిచయ కార్యక్రమం అనంతరం సీఐను టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు పూలమాల వేసి శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సీఐ రామానాయక్‌ను కలిసిన వారిలో టీడీపీ జిల్లా కమిటి సభ్యులు సయ్యద్ అమీర్‌బాబు, షేక్ ఖాజారహంతుల్లా, ఆర్‌ఆర్ రఫి, పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యులు, ఉప్పలపాటి హరిబాబు, ఇర్రి కోటిరెడ్డి, పందిటి హరీష్, పాలపర్తి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, డోలా శేషాద్రి, ఎం రమణయ్య, దేవరపు మాల్యాద్రి, ఎన్.సాంబయ్య జీ శ్రీనివాసులు, బత్తుల సత్యనారాయణ, పులినాయభ, కొలూరి రహంతుల్లా, చిన హజరత్, కావేరి రసూల్, మెంటా నరసింహారావు, పోకా వినోద్, యర్రసింగ్ రాయుడు, గుత్తి మహేష్, బండ్ల నారాయణ, నగేష్, ప్రసాద్ ఉన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

దర్శి జనవరి 7 : హోరాహోరీగా సాగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. మూడు రోజుల పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 11 పురుష, 11 మహిళల జట్లు పాల్గొన్నాయి. దర్శిలో రెండవ సంవత్సరం నగర పంచాయతీ వైస్ చైర్మెన్ స్టీవెన్, సీనియర్ జర్నలిస్టు శీలం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు.

సమస్యలను పరిష్కరించే వరకూ పోరాడతాం

చెత్త తరలింపు వాహనాన్ని అడ్డుకున్న కార్మికులు

కనిగిరి, జనవరి 7: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడుతామని ఏఐటీయూసీ నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, సీఐటీయూ నాయకులు పీసీ కేశవరావులు అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఆదివారం ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో నుంచి చెత్త తరలించేందుకు వెళ్తున్న వాహనాన్ని వెళ్లనీయకుండా రోడ్డుపై అడ్డంగా కార్మికులతో పడుకుని నిరసన ధర్నా నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని కార్మిక యూనియన్ నాయకులు, కార్మికులతో సర్ది చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ చెత్త వాహనాన్ని ఒదలక పోవడంతో చేసేది లేక పోవడంతో పోలీసులు చేసేది లేక చెత్త వాహనాన్ని కార్యాలయం లోపలే పెట్టించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు గుజ్జుల బాలిరెడ్డి మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో మున్సిపల్ కార్మికులు తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి పారిశుద్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. కానీ ప్రభుత్వం వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోగా వారిపై నిర్లక్ష్య ధోరణి అవలంబించడం దుర్మార్గం అన్నారు. ఆప్కాస్ నుంచి మినహాయించాలని గతంలో మున్సిపల్ కార్మికులు నిరసన తెలియ జేస్తే ఆ హామీని కూడా ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. దీని వలన కార్మికులు విధి నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేతనాలు పెంపు హామీని ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. 10వ పీఆర్‌సీ ప్రకారం రూ.20వేలు జీతం కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుల కేశవరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన మున్సిపల్ కార్మికుని కుటుంబాలకు సీఎం జగన్ రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. రిటైర్మెంట్స్ బెనిఫిట్స్‌తో పాటు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికులు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్‌కే ఖాదర్ వలి, చార్లెస్, వీ మార్క్, గరటయ్య, దస్తగిరి, రమణమ్మ, ఈశ్వరమ్మ, దానియేలు, నాసర్‌వలి, రత్తయ్య పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, జనవరి 7 : తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగాభవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గంగమ్మకు పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు ప్రాంతంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావడంతో భక్తులతో సందడిగా మారింది. గంగమ్మ తల్లిని భక్తులు దర్శించుకోగా, పలువురు భక్తులు అమ్మవారికి వాహనదారులు వాహనపూజలు చేయించారు. మరి కొందరు భక్తులు గంగమ్మకు విరాళాలుగా సమర్పించారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశరావు, విజయలక్ష్మీ అమ్మవారికి పూజలు నిర్వహించారు. తూర్పు గంగవరం గ్రామానికి చెందిన గుజ్జుల అంజిరెడ్డి గంగమ్మకు దర్శనం కోసం వచ్చే భక్తులకు అన్నదాన నిర్వహణ కోసం 5 వేల విలువగల గ్యాస్ పొయ్యి, సిలిండర్‌ను చైర్మన్ కొసనా గురుబ్రహ్మంకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పికార్తిక్, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం పాల్గొన్నారు.

లక్కవరంలో బైకు దగ్ధం

తాళ్లూరు, జనవరి 7 : కుటుంబీకులు నిద్రిస్తుండగా వరండాలో ఉన్న మోటార్ సైకిల్ దగ్ధమైన ఘటన శనివారం అర్ధరాత్రి లక్కవరం గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన కొనికి సుబ్బారావు శనివారం రాత్రి కుటుంబీకులతో కలిసి ఇంట్లో నిద్రిస్తున్నారు. తన బైకును ఇంటి వరండాలో ఉంచారు. రాత్రి 12 గంటల సమయంలో బైక్ దగ్ధమవుతున్నట్లు గుర్తించిన ఇరుగు పొరుగువారు కేకలు వేశారు. సుబ్బారావుపై కక్షతోనే బైకును గుర్తు తెలియని వ్యక్తులు తగల బెట్టి ఉంటారన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

హోరాహోరీగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు

తిలకించేందుకు పోటెత్తిన ప్రజలు

దర్శి జనవరి 7 : జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో దర్శిలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. దర్శి ప్రాంతంలో గతంలో ఎన్నడూలేని విధంగా నాలుగు రోజులు పాటు భారీ స్థాయిలో జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఏర్పాటు చేయడంతో ఈ పోటీలను తిలకించేందుకు ప్రజలు పోటెత్తారు. వందలాది మంది మహిళలు కూడా వేదిక వద్ద కూర్చుని పోటీలు తిలకించడం విశేషం. తొలి రోజు శనివారం నాలుగు పళ్ల ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించగా అత్యధికంగా 38 జతలు పాల్గొన్న విషయం తెలిసిందే. తొలిరోజు పోటీలు పూర్తయ్యే సరికి అర్ధరాత్రి 2 గంటల సమయం పట్టింది. పోటీలు పూర్తయిన తర్వాత విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రెండవ రోజు ఆదివారం ఆరుపళ్ల ఎడ్ల బలప్రదర్శన పోటీలకు 21 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ఈ రోజు కూడా పోటీలు అర్ధరాత్రి వరకు కొనసాగే అవకాశం ఉంది. మూడవ రోజు సోమవారం న్యూ క్యాటగిరీ ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తారు. 9వ తేదీ చివరిరోజున మంగళశారం సీనియర్ క్యాటగిరీ ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తారు. దర్శి - అద్దంకి రోడ్డులో పోలాల్లో విశాలమైన మైదానంలో పోటీలు నిర్వహిస్తున్నారు. వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ముఖ్య అతిథులు కూర్చునేందుకు వీలుగా 200 మంది ఆహుతులు కూర్చునే వీలుగా సభా వేదికను ఏర్పాటు చేశారు. బలప్రదర్శన పోటీలు నిర్వహించే సభ చుట్టూ గ్యాలరీని ఏర్పాటు చేసి ప్రజలు చూసేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. మహిళలకు లోపల కుర్చీలు వేసి ప్రత్యేక సదుపాయం కల్పించారు. పోటీలను తిలకించేందుకు వచ్చిన ప్రజలకు భోజన వసతి కల్పిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన



మొదటి బహుమతిని తోట శ్రీనివాసరావుకు, ద్వితీయ బహుమతిని రామిరెడ్డికి అందజేస్తున్న జనసేన పార్టీ నేత వెంకట్


విద్యుత్ ప్రభ విశేష ఆకర్షణగా నిలిచింది. ప్రభపై ప్రజలను అలరించేందుకు కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. నిర్వాహకుడు వెంకట్‌ను పలువురు అభినందిస్తున్నారు. చివరి రెండు రోజులు భారీ స్థాయిలో ఎడ్లు వచ్చే అవకాశం ఉన్నందున పోటీలు ఉత్కంఠంగా సాగే అవకాశం ఉంది. పోటీలను తిలకించేందుకు అధికసంఖ్యలో యువత పాల్గొని ఆస్వాదించారు.

నాలుగు పళ్ల ఎడ్ల బలప్రదర్శనలో విజేతలకు బహుమతులు ప్రదానం

జనసేన పార్టీ దర్శి నియోజకవర్గ నాయకుడు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో తొలిరోజు జరిగిన నాలుగు పళ్ల ఎడ్ల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో గుంటూరు జిల్లా, కుప్పురావూరుకు చెందిన తోటా శ్రీనివాసరావు ఎడ్లు 15 నిమిషాల్లో 4269.5 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానం సాధించారు. గుంటూరు జిల్లా తుళ్లూరుకు చెందిన మోదుగుల రామిరెడ్డి ఎడ్లు 4202.9 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం పొందారు. గరికపాటి వెంకట్‌కు చెందిన ఎడ్లు 4202.5 అడుగుల దూరం లాగి మూడవ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా, సరిపూడికి చెందిన శాఖమూరి రామకోటయ్య, వెదుళ్లపల్లి శ్రీనివాసరావు ఎడ్లు 4200 అడుగుల దూరం లాగి నాల్గవ స్థానం, పల్నాడు జిల్లా, గురజాలకు చెందిన లింగా అంజయ్యచౌదరి ఎడ్లు 4131.3 అడుగుల దూరం లాగి ఐదవ, గుంటూరు జిల్లా కుప్పురావురుకు చెందిన తోటా శ్రీనివాసరావు ఎడ్లు 4110.4 అడుగుల దూరం లాగి ఆరవ, ప్రకాశం జిల్లా, ఎర్రగొండపాలెంకు చెందిన పునాది శ్రీనివాసరెడ్డి ఎడ్లు 3908.1 అడుగు దూరం లాగి ఏడవ, నంద్యాల జిల్లా, పులిగెల గ్రామంకు చెందిన బత్తుల జనార్దన్‌రెడ్డి ఎడ్లు 3773.5 అడుగుల దూరం లాగి ఎనిమిదవ, గుంటూరు జిల్లా, తక్కెళ్లపాడుకు చెందిన నందిపాటి శ్రీజరి భవాగ్న, అభయ్‌రామ్ తరుణ్‌తేజ్‌కు చెందిన ఎడ్లు 3681 అడుగుల దూరం లాగి తొమ్మిదవ స్థానం సాధించాయి. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.50వేలు, రెండవ బహుమతిగా రూ.40వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు, నాల్గవ బహుమతిగా రూ.25వేలు, ఐదవ బహుమతిగా రూ.20వేలు, ఆరవ బహుమతిగా రూ.18 వేలు, ఏడవ బహుమతిగా రూ.15వేలు, ఎనిమిదవ బహుమతిగా రూ.10వేలు, తొమ్మిదవ బహుమతిగా రూ.8వేలు నగదును అందజేశారు. పోటీల్లో పాల్గొన్న అన్ని జట్లకూ రూ.6వేలు చొప్పున ప్రత్యేక బహుమతులను అందజేశారు. ఎడ్ల యజమానులందరినీ శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

బంగారు తొడుగుకు రూ.లక్ష విరాళం

పామూరు, జనవరి 7 : అయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్ప స్వామి మూలవిరాట్‌కు బంగారు తొడుగు కోసం మండలంలోని వీరభద్రాపురం గ్రామ మాజీ ఉప సర్పంచ్ పువ్వాడి చిన లక్ష్మయ్య, గ్రామ సర్పంచ్ జయమ్మ, కు టుంబ సభ్యులు రూ.1,1,116 విరాళాన్ని అందజేశారు. ఆ నగదును ఆదివారం దేవస్థాన కమిటీ చైర్మన్‌కు అందజేశారు. దాతలు పువ్వాడి రామారావు, నాగమ జి, కుమార్తె డాక్టర్ సింధుభార్గవి, కృష్ణకౌశిక్, పువ్వాడి శ్రీనివాసరావు, (యూఎస్‌ఏ), సుప్రియ కుమారులు సహస్ర, లోహన్స్, శ్రీకార్తికేయను కమిటీ చైర్మన్‌లు కావిటి సుబ్బయ్య, గుత్తి వెంకటరాజ సత్కరించి స్వామి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన ప్రధాన అర్చకులు చిమట పట్టాభిస్వామి, కమిటీ కోశాధికారి రాచూరి సురేష్, భక్తులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న దాతలు

ఎస్మాకు భయపడం

- అంగన్‌వాడీలు

కనిగిరి, జనవరి 7: ఎస్మాలకు భయపడి బెదిరేదే లేదని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజేశ్వరి అన్నారు. ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలు ఆదివారం 27వ రోజుకు చేరాయి. పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి స్థానిక సుగుణావతమ్మ ఆసుపత్రి సెంటర్ వద్ద ధర్నా నిర్వహించి ఎస్మా జీవో ప్రతులను తగులబెట్టారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీలపై నిరంకుశంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. పాదయాత్రలో అంగన్‌వాడీలను అన్ని విధాలా ఆదుకుంటామని మాటిచ్చిన జగన్‌రెడ్డి ఇప్పుడు మా జీవితాలతో ఆటలాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. వేతనాలు పెంచడంతో పాటు, మినీ అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి విస్మరించారన్నారు. చట్టబద్ధత కాని ఎస్మా చట్టాన్ని మహిళలపై ప్రయోగించడం జగన్‌రెడ్డి దుర్మార్గానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు ప్రభుత్వ నిరంకుశ వైఖరితో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్ని దుర్మార్గపు చట్టాలు ప్రయోగించాలని చూసినా అంగన్‌వాడీలు పోరాటంలో వెనక్కి తగ్గేది లేదన్నారు. దుందుడుకు విధానాలను ఉపసంహరించుకోక పోతే వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించక పోతే చలో విజయవాడ కార్యక్రమం చేపడతామన్నారు. రిలే దీక్షలను విరమించి నిరవదిక నిరాహార దీక్షలకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పీసీ కేశవరావు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రజని, సుజాత, సీత, భాగ్యలక్ష్మీ, రాజేశ్వరి, సౌందర్య రామ సుబ్బులు, నరేంద్ర, ఐద్వా మహిళలు పాల్గొన్నారు.



ఎస్మా ప్రతులను కాల్చుతున్న అంగన్‌వాడీలు

ఉరితాళ్లతో నిరసన

దర్శి : అంగన్‌వాడీ కార్యకర్తలపై ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్మా చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం అంగన్‌వాడీ కార్యకర్తలు ఉరితాళ్లు వేసుకొని నిరసన తెలిపారు. తొలుత ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం వైసీపీ పాలకుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఉరితా ళ్లు మెడకు వేసుకొని నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న ఆందోళనకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పొత్తూరి కొండారెడ్డి అంగన్‌వాడీ కార్యకర్తల వద్దకు వెళ్లి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా మాట తప్పుతున్నారని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎస్మా చట్టాన్ని ఉపయోగించి బెదిరించడం దారుణమన్నారు. వైసీపీ పాలకులు తీరు మార్చుకోకుంటే ప్రజల ఆగ్రహాన్ని చవిచూస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గురవయ్య, కోటేశ్వరరావు, ఏసు, సీఐటియు నాయకులు టీ రంగారావు, సందు వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు అచ్చమాంబ, మోహన్ రావు, సుజాత, తిరుపతమ్మ, ప్రశాంతి, మల్లేశ్వరి, నాగలక్ష్మి, బాలమ్మ, పాతిమా పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

పామూరు : రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అంగన్‌వాడీల సమ్మె ఆదివారం 27వ రోజుకు కొనసాగింది. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం దారుణమని సీఐటీయూ అధ్యక్షుడు కే మాల్యాద్రి అన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్మా కాపీలను తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. అ నంతరం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఐద్వా సంఘం మండల కార్యదర్శి షేక్ ఖాదర్‌ఎన్నిసా, సయ్యద్ రమీజ, మదార వ్మ, సీఐటీయూ నాయకులు, షేక్ అల్లాభక్ష్, మహదేవయ్య అంగన్‌వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.





ఇంటర్ విద్యార్థుల ల్యాబ్ (పాతచిత్రం)

ఆసరా.. ఏదీ?



- ఐదేళ్లైనా నాలుగో విడత ఊసేది
- 2020 సెప్టెంబరులో పథకం ప్రారంభం
- కిందటేడు మార్చిలో మూడో విడత బటన్ నొక్కుడు
- ఏప్రిల్, మే నెల వరకూ లబ్ధిదారులకు అందని నగదు
- వాయిదాల మధ్య దూరం పెంచి దాటవేస్తున్న ప్రభుత్వం
- నాలుగో విడతపై ఎన్నికల కోడ్.. ఆందోళనలో లబ్ధిదారులు

మహిళాభ్యుదయమే ధ్యేయమన్నారు. వారికి తాము ఆసరా అన్నారు.. విడతల వారీగా నగదు అన్నారు.. అధికారం చేపట్టి సంవత్సరంపైగా ఆసరా ఊసే మరిచారు. ఆ తర్వాత కూడా పథకాన్ని ప్రారంభించినా అమలులో పథకాన్ని నీరుగార్చారు. డ్వాక్రా రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు కావస్తున్నా ఇప్పటికి మూడు విడతలు కూడా సరిగా పూర్తి చేయలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. విడతల వారీ రుణమాఫీలో విడత విడతకూ వాయిదా వేస్తూ, దూరం పెంచుతూ పక్కాగా మూడు విడతలు మాత్రమే పూర్తి చేశారు. మూడో విడతకు 2023 మార్చి నెలాఖరున ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కారు. ఈ పరిస్థితుల్లో నాలుగో విడత కూడా మార్చిలోనే అయితే ఎన్నికల కోడ్‌తో అది తమకు కచ్చితంగా అందదన్న భావన లబ్ధిదారుల్లో అనుమానం నెలకొంది.

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం ప్రకటించింది. డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు కావస్తున్నా ఇప్పటికీ మూడు విడతలు కూడా పూర్తి చేయలేదు. అధికారం చేపట్టిన 15 నెలల వరకూ పథకం ఊసెత్తలేదు. 2019మే చివర్లో అధికార పగ్గాలు చేపట్టిన జగన్ 2020 సెప్టెంబరు వరకూ పథకం ఊసే ఎత్తలేదు. ఉమ్మడి జిల్లాలో 74,640 గ్రూపులు ఉండగా వాటిలో 74,169 గ్రూపులకు చెందిన 6.97 లక్షల మందిని అర్హులుగా గుర్తించి వారికి రూ.24,480 కోట్ల మేర రుణమాఫీ చేయాలని నిర్ణయించారు. వాటితో పాటు బాపట్ల జిల్లాలో కలిసిన చీరాల డివిజన్లో మరో లక్ష మందికి మరో రూ.350 కోట్ల మేర రుణమాఫీ చేయాలి. మొత్తంగా మూడు జిల్లాల్లో నాలుగు విడతల్లో దాదాపు 8 లక్షల మందికి దాదాపు రూ.2,800 కోట్ల రుణమాఫీ చేయాలి. తొలివిడత 7 లక్షల మందికి ఈ పథకం ద్వారా రూ.698 కోట్లు విడుదల చేశారు. రెండో విడత ఒక నెల ఆలస్యంగా 2021 అక్టోబరు 7న మరో రూ.696 కోట్లు విడుదల చేశారు. మూడో విడత రుణమాఫీని ఆరు నెలల ఆలస్యంగా గత ఏడాది మార్చి 25న ప్రారంభించారు. 2022 అక్టోబరు నుంచి అదిగో ఇదిగో అంటూ 2023 మార్చి చివరి వరకూ నెట్టుకొచ్చి మూడో విడతను విడుదల చేశారు. అప్పుడు మరో రూ.699 కోట్లు రుణమాఫీ చేశారు. స్వయంగా ముఖ్యమంత్రి బటన్ నొక్కినా లబ్ధిదారులకు నెల వరకూ నగదు అందలేదు. ఏప్రిల్ చివర, మే తొలినాళ్ల వరకూ వారు ఎదురు చూడాల్సి వచ్చింది. నాలుగో విడత చెల్లించాల్సిన రూ.699 కోట్ల రుణమాఫీపై అనుమానాలు నెలకున్నాయి.



వస్తే ఈ నెలలో వచ్చినట్లు..

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ(డీఆర్‌డీఏ), పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) శాఖల పరిధిలోని డ్వాక్రా సంఘాల్లో విభజిత గుంటూరు జిల్లాలో 29,322 డ్వాక్రా సంఘాలకు చెందిన 2 లక్షల 86వేల మందికి రూ.246 కోట్లు, పల్నాడు జిల్లాలో 25,168 గ్రూపుల్లో 2,47,833 మందికి రూ.190 కోట్లు, బాపట్ల జిల్లాలో 30,604 గ్రూపుల్లో మూడు లక్షల మందికి రూ.263 కోట్లు ఆసరా పథకం కింద నాలుగో విడత రుణమాఫీ జరగాలి. రాష్ట్ర ప్రభుత్వం కింద టేడాది మార్చిలో మూడో విడత పంపిణీ చేసినప్పుడే లబ్ధిదారుల్లో నాలుగో విడతపై అనుమానాలు నెలకొన్నాయి. మూడో దఫా కిందటేడాది ఏప్రిల్‌లో ఇవ్వడంతో నాలుగో దఫా పథకం కోసం 2024 ఏప్రిల్ వరకూ వేచి చూడక తప్పదన్న ఆందోళన ఆనాడే లబ్ధిదారుల్లో కనిపించింది. తాజా పరిణామాలు అదే నిజమని రుజువు చేసేలా ఉన్నాయి. 2024 మార్చి- ఏప్రిల్‌లో సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే అవకాశం స్పష్టంగా ఉంది. ఇస్తే ఈ నెలలో ఇచ్చినట్లు, లేదంటే ఇక రానట్టేనన్న భావనలో లబ్ధిదారులు ఉన్నారు. అధికారులు మాత్రం ఎప్పటిలాగే ఇదిగో.. అదిగో అంటూ నెట్టుకొస్తున్నారు. జనవరి 23న వైఎస్సార్ ఆసరా పథకం ఉంటుందని చెబుతున్నారు.

ప్రాక్టికష్టాల్

- ప్లస్ టూ విద్యార్థినులకు పరీక్షే
- ల్యాబ్‌లపై చేతులెత్తేసేసిన జగన్ ప్రభుత్వం
- ప్రయోగాలకు ఇతర కళాశాలలపై ఆధారపడాల్సిందే
- రెండేళ్లుగా ప్రకటనలకే పరిమితమైన ల్యాబ్‌ల ఏర్పాటు
- ప్రాక్టికల్ పరీక్షకు సగటున ఐదు కిలోమీటర్లు వెళ్లాల్సిందే

ప్లస్ టూపై ఆది నుంచి నిర్లక్ష్యమే..

గుంటూరు(విద్య), జనవరి 7: విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు.. నాడు నేడుతో కార్పొరేట్ తరహా విద్య.. పాఠశాలల్లోనే విద్యార్థునులకు ప్లస్ టూ విద్య.. అత్యాధునిక డిజిటల్ గదులు.. ల్యాబ్‌లు.. అంటూ ముఖ్యమంత్రి జగన్ రెండేళ్లుగా ఊదరగొడుతున్నారు. దూరం వెళ్లకుండా తాము చదివిన పాఠశాలలోనే ప్లస్ టూ ద్వారా ఇంటర్ మీడియట్ చదువుకునే అవకాశం కల్పించిన ప్రభుత్వం ఆయా పాఠశాలల్లో సరైన సౌకర్యాలు కల్పించలేదు. పదో తరగతి పాసైన విద్యార్థినులు ఇంటర్ అభ్యసించాలంటే ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని చెప్పి ప్లస్ టూ ఏర్పాటు చేసిన ప్రభుత్వం రెండేళ్లుగా ల్యాబ్‌ల ప్రతిపాదన ప్రకటనలకే పరిమితమైంది. ఫలితంగా ఎంపీసీ, బైపీసీ విద్యార్థినులు ప్రాక్టికల్స్‌కు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. ఎలాగోలా నెట్టుకొచ్చిన విద్యార్థినులు ఇప్పుడు ద్వితీయ సంవత్సరంలో ప్రాక్టికల్ పరీక్షలు రాయాల్సి వచ్చింది. అయితే అసలు ప్రాక్టికల్స్ అంటే తెలియని ఎంతోమంది విద్యార్థినులు ఆ పరీక్షలపై ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే ఆ పరీక్షలకు వెళ్లేందుకు కూడా వారిపై దూరాభారం పడింది. విద్యార్థినులు వారు చదివే పాఠశాల నుంచి ఐదు నుంచి పది కిలో మీటర్లు దూరం వెళ్లి ప్రయోగ పరీక్షలకు హాజరుకావాల్సిన దుస్థితి నెలకొంది.

ఉమ్మడి జిల్లాలో దాదాపు 35పైగా పాఠశాలల్లో ప్లస్ టూ తరగతులను ఏర్పాటు చేశారు. తొలుత అడ్మిషన్లు సక్రమంగా జరగకపోవడంతో బలవంతంగా ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తీసుకువచ్చి పదో తరగతి విద్యార్థినుల్ని అక్కడ చేర్పించారు. అక్కడ కనీస వసతులు, బోధన కోసం అధ్యాపకులు లేకున్నా విద్యార్థినులకు అడ్మిషన్లు ఇచ్చారు. మరోవైపు అనేక పాఠశాలల్లో నాడు నేడు పనులు పూర్తికాక గదుల కొరత ఉన్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఉన్న గదుల్ని సర్దుబాటు చేసి ప్లస్ టూ తరగతుల్ని నిర్వహింపజేశారు. విద్యార్థినులకు అడ్మిషన్లు ఇచ్చిన మూడు నెలల తర్వాత ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను డిప్యూటేషన్‌పై ప్లస్ టూ పాఠశాలలకు పంపి ఇంటర్ బోధన చేయించారు ఫలితంగా విద్యార్థినులకు పాఠాలు అర్థం కాక పరీక్షల్లో భారీ సంఖ్యలో ఫెయిల్ అయ్యారు. ఆ తర్వాత సప్లిమెంటరీ పరీక్షలు రాసి అనేక మంది ఉత్తీర్ణులు కావాల్సివచ్చింది. ఈ ఏడాది ఆయా విద్యార్థినులు ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి వచ్చారు. అయినా ప్రభుత్వం వారి కోసం మౌలిక వసతులు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఈ ఏడాది ప్లస్ టూ పాఠశాలల్లో ద్వితీయ సంవత్సరం విద్యార్థిను లు ప్రయోగ పరీక్షల కోసం సటున 5 నుంచి 10 కిలోమీటర్ల వెళ్లాల్సిన దుస్థితి నెల కొంది. ఉదాహరణకు గుంటూరు సమీపం లోని అంకిరెడ్డిపా లెం లోని ప్లస్‌టూ పాఠశాలలో దాదాపు 23 మంది ద్వితీయ సంవ త్సరం విద్యార్థినులు ఉన్నారు. వీరు ప్రయోగ పరీక్షలకు గుంటూరులోని ఏసీ కళాశాలకు వెళ్లాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలో దాదాపు అన్ని ప్లస్ టూ పాఠశాలల్లో విద్యార్థినులు తమ పాఠశాలకు సమీపంలోని ప్రభుత్వ లేదా ప్రైవేటు జూనియర్ కళాశాలల ల్యాబ్‌ల్లో ప్రయోగ పరీక్షలకు హాజరు కావాల్సిన దుస్థితి నెలకొంది. ప్రయోగ పరీక్షలు ఫిబ్రవరి రెండో వారంలో నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్లస్ టూ విద్యార్థినులు ఏఏ కళాశాలల్లో ప్రయోగాలకు హాజరుకాను న్నారో ఇంటర్ బోర్డుకు, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు నివేదిక అందజేశారు.

గోవిందా..

- గోవాడ తిరునాళ్ల టెండర్లలో గోల్‌మాల్
- కీలకనేత ఒత్తిళ్లతో నిబంధనలకు పాతర
- ఎక్కువ కోట్ చేసిన వ్యక్తిని కాదని తెరపైకి మరొకరు
- ఒత్తిడి తట్టుకోలేక సెలవుపై వెళ్లే ఆలోచనలో ఈవో?

దేవుడి సొమ్మునూ వదలని వైనం



గోవాడలోని శ్రీ బాలకోటేశ్వరస్వామి వారి దేవస్థానం

బాపట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భక్తుల సొమ్ము దేవుడికి వెళ్లాలి. కానీ ఇక్కడ ఓ కీలక నేత రంగ ప్రవేశం చేసి రూ.లక్షలకు గండికొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. అధికార పార్టీ నేతలు దేవుడ్ని కూడా వదలకుండా దోపిడీకి పాల్పడుతున్నారనేందుకు గోవాడ తిరునాళ్ల టెండర్లు నిదర్శనంగా నిలుస్తున్నాయి. అమర్తలూరు మండలం గోవాడలోని శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రతిఏటా శివరాత్రి తిరునాళ్లు 5 రోజుల పాటు ఘనంగా జరుగుతాయి. ఇందుకు సంబంధించి ఆలయ భూమి 96 సెంట్ల విస్తీర్ణంలో వివిధ షాపులు పెట్టుకుంటారు. ఈ క్రమంలో ఈ ఏడాది శివరాత్రిని పురస్కరించుకుని ఎప్పటిలాగే సీల్డ్ కవర్ టెండర్ విధానం ద్వారా ఆ స్థలాన్ని కేటాయించాలని అధికారులు నిర్ణయించారు. గడచిన డిసెంబరులోనే ఇందుకు సంబంధించిన ప్రక్రియను యంత్రాంగం ప్రారంభించింది. డిసెంబరు 16న ఆ స్థలం దక్కించుకోవడానికి పది మంది వరకు బిడ్‌లో పాల్గొనగా సత్యనారాయణ అనే వ్యక్తి అత్యధికంగా రూ.19 లక్షలకు టెండర్ వేశారు. నిబంధనల ప్రకారం అతడికే టెండర్ దక్కాలి. కానీ అలా జరగకపోగా మరింత ఎక్కువగా బిడ్ దాఖలవుతుందన్న అంచనాతో మరోసారి టెండర్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధం. కాంట్రాక్టర్లు సిండికేట్ అయి తక్కువ మొత్తానికి టెండర్ పొందారని నిర్ధారణకు వచ్చినప్పుడు మాత్రమే మళ్లీ బిడ్‌లకు వెళ్లే అవకాశం ఉంది. ఇక్కడ అలాంటిదేమి లేకపోయినా తమకు కావాల్సిన వారికి ఆ స్థలాన్ని అప్పగించేందుకు కీలక నేత రంగప్రవేశం చేశారు. అత్యధికంగా కోట్ చేసిన వ్యక్తిని కాదని పది లక్షలకే మరో వ్యక్తికి టెండర్ కట్టబెట్టడానికే నిబంధనలకు పాతరేశారు. కీలకనేత ఒత్తిళ్లే ఈ వ్యవహారంలో కీలకంగా పనిచేశాయని భక్తులు ఆరోపిస్తున్నారు. మళ్లీ శుక్రవారం టెండర్లు వేయడానికి కాంట్రాక్టర్లను ఆహ్వానించగా ముగ్గురు రాగా డిపాజిట్ల సాకు చూపి అసలు ప్రక్రియే ప్రారంభించలేదు. శుక్రవారం టెండర్ వేయడానికి వచ్చిన ముగ్గురిలో డిసెంబరు 16న అత్యధికంగా బిడ్ వేసిన వ్యక్తి కూడా ఉండడం గమనార్హం. టెండర్ విధానంలో వెళితే తొలిసారి అత్యధికంగా కోట్ చేసిన వ్యక్తి ఉండగా తక్కువకు తమకు దక్కదనే ఉద్దేశంతో సదరు కీలకనేత అండదండలతో తీర్మానం అనే కొత్త ఎత్తుగడకు తెరతీసినట్లు తెలుస్తోంది. ఆలయ బోర్డులో 9 మంది సభ్యులు ఉండగా మెజారిటీ సభ్యుల తీర్మానం మేరకు కీలకనేత అండదండలున్న వ్యక్తికి కేవలం పది లక్షలకే ఆ స్థలం టెండర్ ఇచ్చే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఇదే సభ్యులు డిసెంబరులో టెండర్ ద్వారా ఆ స్థలాన్ని కేటాయించాలని తీర్మానం చేశారని, కానీ ఇప్పుడు ఓ వ్యక్తి కోసం దానికి పాతరేసి ఇష్టారీతిన నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు. దేవుడి సొమ్ము విషయంలో నిబంధనలను అతిక్రమించలేక సెలవుపై వెళ్లే ఆలోచనలో ఈవో ఉన్నట్లు తెలుస్తోంది. టెండర్‌ను తమకు నచ్చిన వ్యక్తికే వచ్చేలా చూడాలని కీలక నేతలు ఏకంగా దూషణలకు కూడా దిగుతుండడంతో సన్నిహితుల వద్ద ఈవో ఆవేదన వ్యక్తం చేయడంతో పాటు తాను విధుల్లో కొనసాగలేనని చెబుతున్నట్లు సమాచారం. చూస్తూ చూస్తూ తాను లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టలేనని అలా అని చెప్పి ఈ ఒత్తిళ్లను తట్టుకుని విధుల్లో కూడా కొనసాగలేనని ఈవో వాపోతున్నట్లు ప్రచారం జరుగుతుంది.

కొబ్బరి కాయలలోనూ...

పాలకపార్టీ నేతల దందాల తీరు ఏకంగా కొబ్బరి కాయల అమ్ముకునే హక్కు కేటాయించే విషయంలోనూ వదలని విధంగా తయారైంది. గతేడాది ఆలయంలో కొబ్బరి కాయల విషయంలో రూ.2,68,000కు పోయిన కాంట్రాక్టు ప్రస్తుతం అది కాస్తా రూ.1,50,000లకు తగ్గి పోయింది. ఇక్కడ కూడా పాలకపార్టీ నేతలే చక్రం తిప్పి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారు.

రేంజ్ లో 16మంది సీఐల బదిలీ

గుంటూరు, జనవరి 7: రేంజ్ పరిధిలో 16 మంది సీఐలను బదిలీ చేస్తూ ఐజీ పాలరాజు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల నిబంధనలను అనుసరించి పోలీస్ శాఖలో బదిలీల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే ఎస్‌ఐలను బదిలీ చేయగా తాజాగా సీఐలను బదిలీ చేశారు. బీ అశోక్‌కుమార్‌ను చిలకలూరిపేట రూరల్ నుంచి నెల్లూరు వన్ టౌన్‌కు, వీ శ్రీనివాసరెడ్డిని ఒంగోలు రూరల్ సర్కిల్ నుంచి నాయుడుపేటకు, కే నరసింహారావును నాయుడుపేట నుంచి సంతమాగులూరుకు, బీ ప్రభాకర్‌ను సంతమాగులూరు నుంచి రేంజ్ వీఆర్‌కు, ఏ రాజ మోహనరావును చుండూరు సర్కిల్ నుంచి ఒంగోలు రూరల్ సర్కిల్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా డీ జగన్మోహనరావును రేంజ్ వీఆర్ నుంచి నాయుడుపేట సర్కిల్‌కు, వై వీరసోమయ్యను నాయుడుపేట సర్కిల్ నుంచి రేంజ్ వీఆర్ గుంటూరుకు, జీ దశరథ రామయ్యను రేంజ్ వీఆర్ నుంచి తెనాలి వన్ టౌన్‌కు, కే చంద్రశేఖర్‌ను తెనాలి వన్ టౌన్ నుంచి రేంజ్ వీఆర్‌కు, ఖాజా అల్తాఫ్‌హుస్సేన్‌ను పొన్నూరు టౌన్ నుంచి నెల్లూరు ఫోర్త్ టౌన్‌కు, బీవీవీ సుబ్బారావును నెల్లూరు ఫోర్త్ టౌన్ నుంచి రేంజ్ వీఆర్‌కు, సీ కృష్ణారెడ్డిను కమాండ్ కంట్రోల్ రూమ్ తిరుపతి నుంచి నరసరావుపేట వన్ టౌన్‌కు బదిలీ చేశారు. ఏ అశోక్‌కుమార్‌ను నరసరావుపేట వన్ టౌన్ నుంచి పల్నాడు డీసీఆర్బీకు, ఎన్ నరసింహారావును పల్నాడు డీసీఆర్బీ నుంచి రేంజ్ వీఆర్‌కు, యూ శోభన్‌బాబును పల్నాడు ట్రాఫిక్ నుంచి డీటీఆర్‌బీ పల్నాడుకు, టీ విజయకృష్ణను డీటీఆర్‌బీ నుంచి పల్నాడు రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు.

గోవా టూ చీరాల

- జోరుగా అక్రమ మద్యం రవాణా
- తీరప్రాంతంలో పలు రిసార్ట్‌లకు సరఫరా
- తీరప్రాంతాల్లో విక్రయాలకు అనధికారిక వేలం

చీరాల, జనవరి 7: గోవా, తెలంగాణ, కర్నాటక మద్యం చీరాలకు యథేచ్ఛగా తరలుతోంది. ఒకటికి పలుమార్లు పెద్దమొత్తంలో గోవా మద్యం పట్టుబడటం, పలు తీరప్రాంత గ్రామాలలో అక్రమ మద్యం విక్రయాలకు బహిరంగ వేలం నిర్వహించడం ఇందుకు నిదర్శనం. పలుచోట్ల బెల్ట్ షాపులు బార్లను తలపిస్తున్నాయి. ఓ తీరప్రాంత గ్రామంలో నిర్వహించిన వేలం రూ.10 లక్షలు పలికినట్లు ప్రచారం జరుగుతోంది. సంక్రాంతి సంబరాల నేపథ్యంలో పాటలు, పందేలకు సమాయత్తమవుతున్నారు. గోవా నుంచి అక్రమంగా దిగుమతి అవుతున్న మద్యంలో సింహభాగం తీరప్రాంత గ్రామాల్లోను, పలు రిసార్ట్స్‌కు విక్రయిస్తుంటారు. ఇది బహిరంగ రహస్యం. ఈ నేపథ్యంలో నూతన సంవత్సర వేడుకలకు రిసార్ట్స్‌లో పలు ఈవెంట్లు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఆక్రమంలో గతనెల 28న విజయవాడ నుంచి చీరాల డిపోకు చెందిన రెండు బస్సులో గోవా మద్యం ఐదు బ్యాగులలో పట్టుబడింది. అందుకు సంబంధించి వాడరేవుకు చెందిన ఇద్దర్ని ఎస్‌ఈబీ సీఐ సోమయ్య అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపారు. తమకు కావల్సిన మద్యం బ్రాండ్లు వైన్‌షాపుల్లో లభించడంలేదు. దీంతో మందుబాబులు డిఫెన్స్ మద్యం కొనుగోలుకు, మరికొందరు ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా దిగుమతయ్యే ఎన్‌డీపీ లిక్కర్ కొనుగోలుకు ఎక్కువ అసక్తి చూపుతున్నారు. ఎస్‌ఈబీ, పోలీస్ అధికారులు పాత నేరస్థులను కట్టడి చేస్తున్నా, కొంతకాలం స్తబ్దుగా ఉండి తర్వాత మరలా ఆ దందా సాగిస్తున్నారు. కొందరు కొత్తవారు ఆవైపు అడుగులు వేస్తున్నారు. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యంను చీరాల ప్రాంతానికి తరలించేవారి సంఖ్య పెరిగింది. దీంతో అక్రమార్కులు అధికారులకు సవాల్‌గా మారుతున్నారు.

గోవా టూ చీరాల

చీరాల నియోజకవర్గం తీరప్రాంతం నుంచి మత్స్యసంపద కంటైనర్లలో కేరళ, గోవా తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంది. ఇది పైకి కనిపించే వ్యాపారం. అయితే అందులో కొందరు కంటైనర్లలో మత్స్యసంపదను అక్కడకు చేర్చాక, ప్రధానంగా గోవాలో తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి ఆ కంటైనర్‌లో చుట్టూ చేపల ట్రేలు ఉంచి, మధ్యలో గోవా మద్యం కేసులను ఉంచి చీరాల ప్రాంతానికి తెస్తుంటారు. గతంలో ఓ కంటైనర్ నాయినిపల్లి పంచాయతీ పరిధిలో అనుమానాస్పదంగా ఉండటాన్ని గుర్తించిన స్థానికులు ఎస్పీ కార్యాలయానికి అందించిన సమాచారం మేరకు పోలీస్, ఎస్‌ఈబీ, ఎక్సైజ్ శాఖల అధికారులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో విషయం వెలుగుచూసింది. అందులో సుమారు 130 కేసులకు పైగా గోవా మద్యం పట్టుబడింది. ఆ తరువాత మరో కంటైనర్ పట్టుబడింది. పలు మార్లు తెలంగాణ, కర్నాటక మద్యం అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుబడిన సందర్భాలు ఉన్నాయి. ఈక్రమంలో వేటపాలేనికి చెందిన ఓ వ్యక్తి మద్యం తెలంగాణ నుంచి దిగుమతి చేసేందుకు కారులో ప్రత్యేక అరలు ఏర్పాటు చేయించటం విశేషం.



చీరాల ఆర్టీసీ బస్టాండ్‌లో గత నెల 28న అధికారులకు పట్టుబడిన గోవా మద్యం



కంటైనర్‌లో రొయ్యల ట్రేల మధ్య తరలిస్తూ అధికారులకు పట్టుబడిన గోవా మద్యం (ఫైల్)

ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నాం

ఎన్‌డీపీఎల్, సారా అనేది ఎక్కడా లేకుండా కట్టడి చేస్తున్నాం. ఇటీవల పట్టుబడిన మద్యం కేసులో నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని, కోర్టులో హాజరు పరిచాం. సంక్రాంతి నేపథ్యంలో ఈ దందాలో ఉన్న వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాం. అనధికారిక పాటలు అనేవి లేవు. బెల్ట్ షాపులను పూర్తిగా నియంత్రించాం. ప్రతి రోజూ నిఘా ఉంటూనే ఉంది.

- సోమయ్య, ఎస్‌ఈబీ సీఐ, చీరాల

నృసింహస్వామి సేవలో లోకేశ్

- మంగళగిరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- 20 లక్షల విలువ చేసే ఆభరణాల వితరణ
- పానకాలస్వామి నడక మార్గంలో మెట్ల పూజ
- హాజరైన భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మిణి, దేవాన్ష్

మంగళగిరి సిటీ, జనవరి 7: మంగళగిరిలో ప్రసిద్ధిగాంచిన శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఎగువ, దిగువ సన్నిధులతోపాటు శివాలయంలో ఆదివారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. తల్లి భువనేశ్వరి, భార్య బ్రాహ్మిణి, తనయుడు దేవాన్ష్‌తో కలిసి లోకేశ్ మంగళాద్రి క్షేత్రాన్ని సందర్శించారు. తూర్పు రాజగోపురం వద్ద దేవస్థానం అధికారులు లోకేశ్ కుటుంబ సభ్యులకు ఘనస్వాగతం పలికారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి, శ్రీచెంచులక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి పట్టువస్త్రాలను సమర్పించారు. చెంచులక్ష్మీ అమ్మ వారికి బంగారు కిరీటం, రాజ్యలక్ష్మీ అమ్మవారికి బంగారు పంచ పాత్ర, ఉద్ధరిణి అందజేశారు. అక్కడి నుంచి కాలినడకన శివాలయం చేరుకుని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివార్లను దర్శించుకున్నారు. స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించి వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. గతంలో ఆయన మొక్కు కున్న మొక్కును తీర్చుకునే నిమిత్తం పానకాలస్వామి సన్నిధిని చేరుకునే నడక మార్గంలో లోకేశ్ కుటుంబ సభ్యులతో కలిసి మెట్ల పూజ చేశారు. పానకాల స్వామి సన్నిధిలో పానకాన్ని నైవేద్యంగా సమర్పించారు. అనంతరం రాజ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించుకుని కంఠహారం(నెక్లెస్) సమర్పించారు. స్వామివార్లకు సుమారు 20 లక్ష ల విలువ చేసే 320 గ్రాముల బంగారు ఆభరణాలను లోకేశ్ కు టుంబ సభ్యులు ఈవో ఎ.రామకోటిరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్ల మెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఈవో రామకోటిరెడ్డికి బంగారు ఆభరణాలను అందజేస్తున్న భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మిణి, దేవాన్ష్

వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి!

- గ్రామాలలో ఓటరు పేజీ నేస్తం అమలు వేగవంతం చేయాలి
- సమష్టిగా ఉంటూ టీడీపీని బలోపేతం చేయాలి
- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

బల్లికురవ, జనవరి 7: వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ప్రజలకు తెలియజేయాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెంలో ఎమ్మెల్యే అతిథి గృహంలో బల్లికురవ మండలానికి చెందిన కూకట్లపల్లి, వైదన, కొణిదెన గ్రామాలకు చెందిన టీడీడీ నేతలతో ఎమ్మెల్యే రవికుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాలవారీగా పార్టీ నేతలతో మాట్లాడారు. గ్రామాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరయిన అభివృద్ధి పనులు, ఇప్పుడు చేసిన పనులపై చర్చించారు. ఈవిషయాలను ప్రజలకు తెలియజేయాలని ఓటరు పేజీని వేగవంతంగా పూర్తిచేసి ఇంటింటికి తిరిగి ప్రచారం చేపట్టాలని సూచించారు.

ఈసందర్భంగా నేతలతో ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలపై పెనుభారం మోపుతుందన్నారు. విచ్చలవిడిగా అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మారుస్తుందన్నారు. గత నాలుగేళ్ల నుంచి అభివృద్ధి అనే పనులు చేపట్టకుండా వచ్చిన కాడికి అప్పులు తెచ్చి అరకొరగా ప్రజలకు నగదు పంపిణీ చేయటం దుర్మార్గమన్నారు. ప్రజలకు ఈ విషయాలను అర్థమయ్యేలా వివరించాలని చెప్పారు. ఎంతో అనుభవశాలి అయిన చంద్రబాబునాయుడు తిరిగి ముఖ్యమంత్రిగా వస్తే సంపద సృష్టించి అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలందరికి అందిస్తారన్నారు. ఇప్పుడు జగన్ ఇస్తున్న పథకాల నగదు విద్యుత్ బిల్లుకు కూరగాయాలకు కూడ సరిపోవటం లేదని అయన విమర్శించారు. పేరు గోప్ప ఊరు దిబ్బ అన్న చందంగా అరకొర పథకాలు అందించిన ప్రతిసారి కోట్లు వెచ్చించి ప్రకటనల రూపంలో ప్రజా ధనం వృథా చేస్తున్న ఘనత వైసీపీకే దక్కుతుందని ధ్వజమెత్తారు. కొత్త పరిశ్రమలను రాకుండా చేస్తూ ఉన్న పరిశ్రమలపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రూ.మూడు వేల పింఛన్ ఒకేసారి ఇస్తానని చెప్పి నాలుగుసార్లుగా పెంచి ప్రజలను మోసం చేశారన్నారు. గతంలో చంద్రబాబునాయుడు రూ.రెండు వేలు పింఛన్ అందిస్తే వృద్ధులను మోసం చేసేలా తానే ఒకేమారు రూ. మూడు వేలు ఇచ్చానని చెబుతుండటం హాస్యస్పదంగా ఉందన్నారు.

విద్యా వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందని ఎమ్మెల్యే రవికుమార్ ధ్వజమెత్తారు. ఇంజనీరింగ్ చదివే పిల్లలకు సకాలంలో ఫీజు రియంబర్స్ విడుదల చేయటం లేదని చెప్పారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలలో వైసీపీని చిత్తు చిత్తుగా ఓడిస్తారని అయన తెలిపారు. టీడీపీ నూతనంగా ప్రవేశపెట్టిన మహాశక్తి మేనిఫెస్టోపై గ్రామాలలో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వటంతో పాటు ప్రతి ఏటా నిరుద్యోగులకు జాబు క్యాలెండర్ విడుదల చేస్తారన్నారు. అలాగే, ఇంట్లో చదువుకొనే పిల్లలు ఎంత మంది ఉన్నా వారందరికి ఏడాదికి రూ.15 వేలు అందజేస్తారన్నారు. మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం చేసే వీలు కల్పిస్తారన్నారు. నిరుద్యోగ యువతకు నెలకి రూ.మూడు వేలు అందిస్తారన్నారు. గ్రామీణ రోడ్లను తిరిగి అభివృద్ధి పరిచేలా నిధులు మంజూరు చేస్తారని తెలిపారు. పార్టీ నేతలంతా సమిష్టిగా ఉండి రానున్న పది నెలల సమయంలో టీడీపీ బలోపేతానికి


కూకట్లపల్లి గ్రామ టీడీపీ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైన దొంగ ఓట్లు ఉంటే వెంటనే అధికారులకు ఫిర్యాదులు చేయాలని కోరారు.

సమావేశంలో టీడీపీ మండల నేత కొండేటి ఇజ్రాయల్, గ్రామాల నేతలు ఇప్పల అంజిరెడ్డి, పందిరి అబ్రహం, పోగుల చంద్రశేఖర్, మండల ముస్లిం మైనారిటీ అధ్యక్షులు షేక్ ఖాదే, గ్రామాల బూత్ కమిటీ సభ్యులు, పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే టీడీపీ ధ్యేయం

మేదరమెట్ల , జనవరి 7: తెలుగుదేశంపార్టీ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం రాత్రి మేదరమెట్ల పతుల కాలనీలో టీడీపీ అధికారంలోకి వస్తే చేయబోయే సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రతి ఇంటికి దీపం పథకం కింద మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. ప్రతి రైతుకు 20వేలు ఆర్థిక సాయం అందిచడంతో నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు అందిస్తామని చెప్పారు. ఇంటిలో ఎంత మంది చదువుకుంటున్నా ఒక్కొక్కరికి సంవత్సరానికి రూ.15 వేలు సాయం అందిస్తామన్నారు. మహాశక్తి పథకం కింద 18 నుండి 59 సంవత్సరాలు ఉన్న మహిళలకు నెలకు రూ.1500 అందజేస్తామన్నారు.

రాష్ట్రంలో పరిశ్రమలను తీసుకువచ్చి యువతకు ఉపాధి కల్పిస్తామని ఎమ్మెల్యే రవికుమార్ చెప్పారు. మహిళల భద్రతపై టీడీపీ ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావడంతో పాటు ఉపాధి కల్పనకు అవసరమయిన చర్యలు చేపడతామన్నారు.

తొలుత స్థానిక దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మన్నె రామారావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, కర్నాటి పూర్ణచంద్రరావు, బొల్లెపల్లి సుబ్బారావు, మన్నె రామలింగ ప్రసాద్, రేగుల హనుమంతరావు, రేగుల సంజీవరావు, మన్నె సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు శేషయ్య, చావా రాజేష్, బ్రహ్మయ్య, తూమాటి సాంబశివరావు, మండలంలోని ఇతర గ్రామాల నేతలు పాల్గొన్నారు.

ఓట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

పంగులూరు, జనవరి 7: ఎన్నికలు సమీపిస్తున్న వేళ అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుండి తొలగిపోకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సూచించారు. మార్టూరు మండలంల జొన్నతాళి క్యాంప్ కార్యాలయంలో పంగులూరు మండలం అలవలపాడు టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహిం చారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ అధికార పార్టీ టీడీపీ, కార్యకర్తలు, సానుభూతిపరుల ఓట్ల తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. నేతలు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి ఓట్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్న పూర్తి చేయాలన్నారు. సూపర్ సిక్స్ పథకాల ప్రయోజనాలు ప్ర తిఒక్కరికీ తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మస్తాన్‌వలి, కోమటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కొరిశపాడులో అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున్న టీడీపీ నాయకులు

అంగన్‌వాడీలకు టీడీపీ మద్దతు

మేదరమెట్ల , జనవరి 7: గత 27 రోజులుగా డిమాండ్‌ల సాధనకోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు టీడీపీ మండల నాయకులు మద్దతు ప్రకటించారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ఎస్మా జీవో కాపీ నకలను తెలుగుదేశం నాయకుల సమక్షంలో దహనం చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాదయాత్రలో జగన్‌ఇచ్చిన హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జాగర్లమూడి జయకృష్ణ, చెన్నుపాటి హరిబాబు, మేదరమెట్ల శ్రీనివాసరావు, గోళ్లమూడి సురేంద్రరెడ్డి, కారుసాల గురుబాబు, నాదెండ్ల కోటేశ్వరరావు, సింబోతు సత్యనారాయణ, దాట్ల సరి రవి , సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

రవాణా రంగంలో నూతన చట్టాలను రద్దుచేయాలి

అద్దంకిటౌన్, జనవరి 7: కేంద్ర ప్రభుత్వం రవాణా రంగంలో తీసుకువచ్చిన నూతన చట్టాలను రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అయ్యప్ప రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో గ్రేట్ మీటింగ్ నిర్వహించారు. నూతన చట్టాల ద్వారా భారతదేశంలో ఎవరూ కూడా డ్రైవర్ వృత్తిలోనికి రానివిధంగా ఉన్నాయన్నారు. కార్మికులందరూ అవగాహన కలిగి నూతన చట్టాలను వ్యతిరేకించాలని వారు కోరారు.

ఉన్నతస్థాయికి విద్యార్థులు చేరుకోవాలి

చినగంజాం, జనవరి 7: విద్యార్థులకు శాస్త్రీయ ఆలోచన విధానం పెంపొందించుకునేందుకు సైన్సు సంబరాలు ఎంతగానో దోహదపడతాయని డాక్టర్ హైమా సుబ్బారావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వై.భాస్కరరావు అధ్యతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ హైమా సుబ్బారావు మాట్లాడుతూ నిత్య జీవితంలో మనం చేసే తప్పులను సరిచేసుకుంటూ విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు. జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు మాట్లాడుతూ విద్యార్థులు ఎందుకు, ఏమిటి, ఎలా అనే ప్రశ్నల ద్వారా శాస్త్రవేత్తలుగా ఎదగాలని అన్నారు. జిల్లా స్థాయి చెకుముకి సంబరాలలో ప్రభుత్వ పాఠశాలల్లో నగరం మండలం ఉల్లిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం, అద్దంకి మండలం తిమ్మాయిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం, అమర్తలూరు మండలం అమర్తలూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానం పొందారు. ప్రైవేట్ పాఠశాలల్లో చినగంజాం సత్యం హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం, పర్చూరు ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం, చెరుకుపల్లి వనజ చంద్ర హైస్కూల్ విద్యారులు తృతీయ స్థానం సాధించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి తంగా శ్రీనివాస్, చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి.రత్నకుమారి, జిల్లా స్థాయి సైన్సు అధికారి ఎండీ సాధిక్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగం తగదు

చీరాల, జనవరి 7: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ చేపట్టిన సమ్మె, నిరసనపై ప్రభుత్వం నిరంకుశంగా ఎస్మా చట్ట ప్రయోగం చేయటం సరికాదని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్, సమాజ్‌వాదీపార్టీ ప్రతినిధి సయ్యద్‌బాబు మండిపడ్డారు. ఎస్మాకు నిరసనగా ఆదివారం పట్టణంలో ప్రదర్శన చేశారు. అనంతరం స్థానిక గడియార స్తంభం సెంటర్లో ఎస్మా ప్రతులను తగులబెట్టారు. కార్యక్రమంలో సీపీఐ, సీఐటీయూ బాధ్యులు అచ్చుతుని బాబూరావు, చిరుమల ప్రకాష్, రామేశ్వరం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

అద్దంకి, జనవరి7: స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆదివారం చిలకలూరిపేటలో ఎమ్మెల్యే స్వగృహంలో గొట్టిపాటి రవికుమార్ ఆవిష్కరించారు. కార్య క్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు పిచ్చయ్య, గౌరఅధ్యక్షుడు మాధవరావు, మహిళా అధ్యక్షురాలు రామతులశమ్మ, నాగిరెడ్డి, శ్రీహరినాథ్, కట్టా శ్రీనివాసరావు, వలేటి నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, ముకుందరావు, గంగాధర్, కోయి శ్రీనివాసరావు, బాచిన రామానాయుడు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేసిన సీపీఎస్ ఉద్యోగులు

అద్దంకి, జనవరి7: ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (ఏపీసీపీఎస్) ఉద్యోగులు ఆదివారం ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జగన్ ప్రభుత్వం తీసుకు వచ్చిన జీపీఎస్‌ను రద్దు చేసి ఉద్యోగులను, కుటుంబాలను కాపాడేలా టీడీపీ మేనిఫెస్టోలో చేర్చాలని ఎమ్మెల్యే రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం టీడీపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, అధికారంలోకి వచ్చిన తరువాత పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే రవికుమార్ హామీ ఇచ్చారు.

వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

అద్దంకి, జనవరి 7: మనువరాలి వయస్సు ఉండే బాలిక పట్ల అసభ్యకరంగా వ్యవహరించిన వృద్ధుడిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. అద్దంకి పట్టణంలోని సాయిబాబా గుడి ప్రాంతంలో ఆదివారం సాయంత్రం 8 సంవత్సరాల బాలిక ను అదే ప్రాంతానికి చెందిన 53 సంవత్సరాల రామారావు అగ్గిపెట్టె కొనుక్కొని రమ్మని పిలిచాడు. అగ్గి పెట్టె తెచ్చిన తరువాత ఇంట్లోకి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలిపారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు రామారావుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

డిమాండ్లు పరిష్కారమయ్యేవరకు పోరు

- 27వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె
- ఎస్మా జీవో ప్రతులు దహనం

చినగంజాం, జనవరి 7: డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు తమ పోరాటం ఆపేది లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు తేల్చి చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో న్యాయమైన డిమాండ్ల కోసం చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం 27వ రోజు కూడా కొనసాగింది. ఎన్ని చట్టాలు ప్రవేశపెట్టినా కనీస వేతనాలు ఇచ్చే వరకు తగ్గేదే లేదని అన్నారు. ఎస్మా చట్టం పేరుతో జీవో నెంబరు2ను తీసుకురావడం దారుణమన్నారు. వేతనాల పెంపుతో పాటు ఇతర న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఎస్మా చట్టం ప్రతులను దహనం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు గోడకుర్చీలు వేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్, ఎ.హైమావతి, కె.రంగనాయకమ్మ, ఆదిలక్ష్మి, యానాదమ్మ, మండల పరిధిలోని కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

బల్లికురవ: వైసీపీ ప్రభుత్వం అబద్ధపు హామీలు ఇచ్చి మోసం చేయడమేకాక కక్షపూరితంగా జీవో నెంబరు2ను ప్రవేశపెట్టటంపై అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం బల్లికురవ తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా జీవో ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సంఘ నేతలు నాగమణి, సునంద, శివపావని, సరస్వతి,


చీరాలలో ఎస్మా ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు: అంగన్‌వాడీలు తమ న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారానికి ఆదివారం 27వ రోజు నిరసనలు తెలిపారు. ఇంకొల్లు స్థూపం సెంటర్‌లో ఎస్మా జీవో కాపీలను దహనం చేశారు. వైజంక్షన్ నుంచి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు, ప్రాజెక్టు లీడర్లు సరళ, శ్రీలత, అనంతలక్ష్మి, రాజ్యలక్ష్మి, రమాదేవి, అంజమ్మ, లావణ్య, దేవమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్మా చట్టంపై వెల్లువెత్తిన నిరసనలు

పర్చూరు, జనవరి 7: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలంటూ చేపట్టిన నిరవధిక సమ్మెను నీరుకార్చేవిధంగా ప్రభుత్వం విడదల చేసిన ఎస్మా చట్టం జీవోపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. పెద్ద ఎత్తున అంగన్‌వాడీలు ఆయా ప్రభుత్వ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. కార్యక్రమంలో భాగంగా పర్చూరు సీడీపీవో కార్యాలయం ముందు ఆదివారం ప్రభుత్వం విడుదల చేసిన ఎస్మా చట్టం ప్రతులను చించివేసి నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలు చేపట్టిన


బల్లికురవలో జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నిరసన కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు పాల్గొని మద్దతుగా నిలిచారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, చెరుకూరు చింపయ్య, కట్టెంపూడి నాగరాజు, గోరంట్ల రామకృష్ణ, కాంగ్రెస్‌పార్టీ నాయకుడు తోట శివనాగేశ్వరరావు, జనసేన నాయకుడు హనుమంతరావు, సీపీఎం నాయకులు బండి శంకరయ్య, పేతులు, తదితరులు పాల్గొన్నారు.

అదరం.. బెదరం..

చీరాల, జనవరి 7: ఎస్మా చట్టాన్ని ప్రయోగించినా అదరం, బెదరం.. మా న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు సమ్మె, నిరసనలు కొనసాగుతాయని అంగన్‌వాడీ కార్యకర్తలు స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన శిబిరంలో ఆదివారం ఎస్మా ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియంతకన్నా దారుణంగా రాష్ట్ర ప్రభుత్వ చర్యలు ఉన్నాయని మండిపడ్డారు.

మార్టూరు: సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించిన రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆదివారం మార్టూరులో మండల కాంప్లెక్స్ వద్ద వాటి ప్రతులను దహనం చేశారు. సమ్మెకు టీడీపీ, సీఐటీయూ నాయకులు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు శ్యామల, రాణి, రాజేశ్వరి, విజయ, రాజ్యం తదితరులతో పాటు టీడీపీ నాయకులు షేక్ రజాక్, గొట్టిపాటి వెంకట్రావు, తొండెపు ఆదినారాయణ, రావినేని శ్రీను, పోలూరి సింగయ్య, తాటి నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకుడు బత్తుల హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు(పర్చూరు): అంగన్‌వాడీల సమ్మెను విరమించేందుకు ప్రభుత్వం జారీచేసిన ఎస్మా చట్ట ప్రతులను కారంచేడు మండలంలోని అంగన్‌వాడీలు ఆదివారం తహసీల్దార్ కార్యాలయం ముందు తగులపెట్టి నిరసన వ్యక్తం చేశారు. డిమాండ్లను పరిష్కరించకుండా ఎస్మాచట్టం పేరుతో సమ్మెను నీరు గార్చే చర్యలు చేపట్టడం దుర్మార్గమని అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు.



చినగంజాంలో ఎస్మా చట్టం ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కార్మికుల సమస్యలను సామరస్యంగా పరిష్కరించాలి

- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్
- హామీలు ఇచ్చి మోసం చేసిన సీఎం

అద్దంకి, జనవరి 7: మున్సిపల్ కార్మికులకు రెగ్యులర్ స్కేల్ వర్తింపచేయాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె 13 వ రోజుకు చేరగా, ఆదివారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సంఘీభావం తెలిపారు. కార్మికుల డిమాండ్‌లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను ప్రభుత్వం సామరస్యంగా పరిష్కరించాలే కాని అంగన్‌వాడీలపై బలవంతంగా ఎస్మా చట్టం ప్రయోగించటం దుర్మార్గమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

సీఎం జగన్మోహనరెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అధికారం లోకి వచ్చిన తరువాత అమలు చేయకుండా అందరిని మోసం చేశారన్నారు. పట్టణాలు పరిశుభ్రంగా ఉండి ఆరోగ్యంగా ఉండాలంటే మున్సిపల్ కార్మికులు కష్టపడి పని చేయాల్సి ఉందన్నారు. అలాంటి మున్సిపల్ కార్మికులకు సరైన వేతనాలు ఇవ్వకపోవటం దారుణమన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు కూడా మిగిలిన కార్మికుల వలే వేతనాలు చెల్లించాలని చెప్పారు. మున్సిపల్ కార్మికులు ఉద్యోగ విరమణ చేసినా, మృతి చెందినా కుటుంబసభ్యులకు ఉద్యోగం కల్పించాలన్నారు. కొత్త జీవోలు తీసుకు వచ్చి అంగన్‌వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించటం సరైన పద్ధతి కాదన్నారు. వంద రోజులలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటం జరుగుతుందని, మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.


మున్సిపల్ కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే రవికుమార్

కార్యక్రమంలో సీపీఎం జిల్లా నేత గంగయ్య, మున్సిపల్ సిబ్బంది నేత ఆదాం, టీడీపీ నేతలు కరి పరమేష్, సంది రెడ్డి శ్రీనివాసరావు, కాకాని అశోక్, కుందారపు రామారావు, గార్లపాటి శ్రీనివాసరావు, వడ్డవల్లి పూర్ణచంద్రరావు,భోజనపల్లి సత్య నారాయణ, చుండూరి మురళీ, కఠారి నాగేశ్వరరావు, కౌన్సిలర్ లు అత్తులూరి రమేష్, కంపా రజనీ, మాగులూరి తిరుపతమ్మ, జహీర, లహరి, చిన్ని హనుమా తదితరులు పాల్గొన్నారు.

నియంత పోకడలకు స్వస్తిపలకాలి

చీరాల, జనవరి 7: సీఎం జగన్ నియంత పోకడలకు స్వస్తిపలి మున్సిపల్ పారిశుధ్య కార్మికుల న్యాయమైన కోర్కెలను తీర్చాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఎన్. బాబూరావు అన్నారు. లేదంటే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమ్మెలో భాగంగా ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద శిబిరంలో కూర్చున్న కార్మికులు మాట్లాడుతూ సీఎం జగన్ మాటలకు, చేతలకు పొంతన ఉండదన్నారు. అందుకు ఆయన అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు నిదర్శనమన్నారు. తమ నిరసన జ్వాల జగన్‌కు తగలుతుందన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన

బల్లికురవ, జనవరి 7: సార్వత్రిక ఎన్నికలలో ఈవీఎంల ద్వారా ఓటు హక్కు ఎలా వినియోగించాలి అన్న దానిపై ఆదివారం గ్రామాలలో ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని కొప్పెరపాడు, కొమ్మినేనివారిపాలెం, అంబడిపూడి, వల్లాపల్లి గ్రామాలలో కూడళ్లలో ఓటర్లను ఒక చోటకు చేర్చి ఓటును ఎలా వేయాలి ఎలక్ట్రానిక్ మిషన్ల ద్వారా ఎక్కడ నొక్కితే ఎలా ఓటు నమోదు అవుతుంది అన్న విషయాలపై ఓటర్లకు వివరించారు. ఈవీఎం మిషన్‌ను తీసుకువచ్చి ఓటర్లలో భయం లేకుండా ఉండేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డి.ప్రసాద్, యార్లగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దైవ పూజలతో మానసిక ప్రశాంతత

బల్లికురవ, జనవరి 7: ప్రతిరోజు కొంతసేపు దైవ పూజలు నిర్వహించటం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని చిలకలూరిపేటకు చెందిన ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు యద్దనపూడి వీరాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని మల్లాయపాలెం, బల్లికురవ గ్రామాలలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథంపై ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాలలో పలురకాల దైవ గ్రంథాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రామాంజనేయులు, చిర్రా వెంకట్రామిరెడ్డి, గంగయ్య, కోటేశ్వరమ్మ, సామ్రాజ్యమ్మ పుల్లయ్య, నరేంద్ర పాల్గొన్నారు.

రేపటినుంచి కొండమంజులూరులో టీ20 క్రికెట్ పోటీలు

పంగులూరు, జనవరి 7: మండలంలోని కొండమంజులూరు గ్రామంలో ఈనెల 9 నుంచి పాణెం హనుమరెడ్డిస్ కొండమంజులూరు ప్రీమియర్ లీగ్ టీ20 క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కేసీసీ చైర్మన్ కరణం స్వామి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోటీల షెడ్యూల్‌ను కొండమంజులూరు క్రికెట్ క్లబ్(కేసీసీ) ప్రతినిధులు ఆదివారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ స్వామి మట్లాడుతూ. ఈ పోటీలలో ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, ఉత్తరప్రదేశ్, జమ్ముకాశ్మీర్, జార్ఖండ్, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఐపీఎల్, రంజీ ఆటగాళ్ళతోకూడిన 15 జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.6 లక్షలు, రూ.4 లక్షలు, రూ.2 లక్షలు ప్రైజ్‌మనీ అందజేయనున్నట్లు స్వామి తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు బొప్పూడి వెంకన్నబాబు, వేణుబాబు, ప్రతాప్, జంపాని రాజేష్, బత్తుల వీరాంజనేయులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలి

పంగులూరు, జనవరి 7: రాష్ట్రంలో రాజ్యాధికారం దిశగా బీసీ సంఘాల ప్రతినిధులు తమ కార్యకలాపాలు ముందుకు నడిపించాలని బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఫణిదపు శ్రీనివాసాచారి పేర్కొన్నారు. ఆదివారం పంగులూరులో జరిగిన బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా గోలి పూర్ణచంద్రరావు, మండల కమిటీ అధ్యక్షుడిగా కడియం శివయ్య, ప్రధానకార్యదర్శిగా కందుల రామారావు, ఉపాధ్యక్షుడిగా ఉల్లగంటి వలి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లికార్జున, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడిగా పల్లపు గోపిని నియమించి నియామక పత్రాలు అందచేశారు. అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు చేబ్రోలు రవిచంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు స్థానిక బీసీ నాయకులు పాల్గొన్నారు.

అయోధ్య రాములోరి అక్షతలు పంపిణీ

చినగంజాం, జనవరి 7: మండలంలోని కడవకుదురు గ్రామంలో అయోధ్య రామయ్య అక్షింతలను ఆదివారం పంపిణీ చేశారు. గ్రామంలోని సీతా లక్ష్మణహనుమత్ సమేత కోదండరామస్వామి దేవస్థానంలో స్వామి వారికి ఆలయ పూజారి విశేష పూజలు నిర్వహించారు. స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలమాలతో అలంకరించి ట్రాక్టర్లో పుర వీధులలో ఊరేగింపు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, మహిళల కోలాటాల నడుమ స్వామి వారిని ఊరేగిస్తూ, అయోధ్య నుంచి వచ్చిన అక్షితలను గ్రామంలోని గడప గడపకు మహిళా భక్తులు పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్యలో జరిగే విగ్రహ ప్రతిష్ఠ వేడుక సమయంలో అక్షితలను పూజా మందిరంలో ఉంచాలని సూచించారు. తదనంతరం దేవస్థానం ప్రాంగణంలో భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది.

చీరాల: దేవాంగపురి పంచాయతీ పరిధిలో స్వామి వివేకా నంద అసోసియేషన్ ఆఫ్ ఫ్రండ్స్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ, క్షేత్ర పూజిత అక్షింతలను భక్తులకు పంపిణీ చే శారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 22వ తేది అయోధ్యలో జరిగే ప్రత్యేక పూజలకు హాజరుకాలేకపోయినప్పటికీ ఎవరి ఇళ్లలో వారు దీపాలు వెలిగించి ఆ పూజల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు నాశిక శివాజీ, పింజల శైలజ, బండారు చౌడేశ్వరి, లేళ్ల నాగమణి, బండారు ఝాన్సీ, సజ్జా లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

17 చికెన్ షాపులకు జరిమానా

మార్టూరు, జనవరి 7: మార్టూరు సెంటరులో ఆదివారం చీరాల తూనికలు కొలతలు ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు చికెన్, చేపలు అమ్మే దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. వాటిలో తూకం సరిగా లేని కాటాలను గుర్తించారు. 17 మందికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున జరిమానా విధించారు. తనిఖీలు నిర్వర్తిస్తున్న సమయంలో కొంతమంది చికెన్ షాపులు నిర్వహించేవారు షాపులు మూసి వెళ్లిపోయారు.

వాసవీ క్లబ్ కార్గవర్గం ప్రమాణ స్వీకారం

అద్దంకిటౌన్, జనవరి 7: అద్దంకిలోని డిస్ట్రిక్ వి205ఏలోని రీజియన్5వ జోన్2లోని వాసవి క్లబ్ అద్దంకి, వాసవి వనిత క్లబ్ అద్దంకి 2024 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక గీతామందిర్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా రీజియన్ ఐఈపీ ఆఫీసర్, విద్యా సంకల్ప కేసీజీఎఫ్ ఊటుకూరి ఉమాఅన్నపూర్ణ హాజరై నూతన కార్యవర్గం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ ప్రెసిడెంట్‌గా ఉడుత్తు వెంకట ఆదినారాయణ, సెక్రటరీగా గొల్లా పాపారావు, ట్రెజరర్‌గా నల్లమల్లి అనిల్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. వాసవి క్లబ్ వనిత ప్రెసిడెంట్‌గా ఉడుత్తు విజయలక్ష్మి, సెక్రటరీగా నిచ్చెనమెట్ల అంజలి, ట్రెజరర్‌గా కొత్తమాసు నాగలక్ష్మిని ఎన్నుకున్నారు. క్లబ్‌ల ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలు విరివిగా నిర్వహించి క్లబ్ అభివృద్ధికి కృషి చేయాలని ఉమాఅన్నపూర్ణ అన్నారు. కార్యక్రమంలో రీజనల్ సెక్రటరీ అయితా శివనాగరాజు, జోన్ చైర్మన్ ఆత్మకూరి పెద్ద ఆంజనేయులు, భైసాని వెంకటసుజాత, రాచుమల్లి రాధిక, క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు.

రాము కుటుంబసభ్యులను పరామర్శించిన గొట్టిపాటి

మేదరమెట్ల , జనవరి 7: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నూనె రామకృష్ణ(రాము) కుటుంబసభ్యులను ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. ఆదివారం రాత్రి మేదరమెట్లలోని వారి ఇంటికి వెళ్లి కుమారుడు కోటేశ్వరరావుతో మాట్లాడి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనమనమూరు సర్పంచ్‌గా పనిచేసిన రాము తెలుగుదేశం పార్టీలో చాలాకాలం క్రియాశీలకంగా పని చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కర్నాటి పూర్ణచంద్రరావు, మన్నె రామలింగప్రసాద్, సుబ్బారావు, కవల ధనుంజయ, తదితరులు ఉన్నారు.

పద్మశాలి సంఘం సమన్వయ కమిటీ సమావేశం

చీరాల, జనవరి 7: స్థానిక ముత్యాలపేట పద్మశాలి సేవాసంఘం కల్యాణ మండపంలో ఆదివారం అఖిల భారత పద్మశాలి సంఘం సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ముందుగా ఈపురుపాలెంలోని ఆకురాతి రంగనాయకస్వామి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. సంఘ ప్రతినిధి జీవీ నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. సంఘ బలోపేతం, రాజకీయప్రాధాన్యత, చట్టసభల్లో స్థానం పొందటం తదితర అంశాలను ప్రస్తావించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పద్మశాలి సంఘ ప్రతినిధులు, బాధ్యులు పాల్గొన్నారు.

దయనీయంగా దళితవాడలు

చీరాలటౌన్, జనవరి 7: దళిత వాడల్లో పరిస్థితి దయనీయంగా ఉందని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని తోటవారిపాలెంలో జరిగిన అంబేద్కర్‌వాదుల సమావేశంలో మాట్లాడారు. దళితవాడల్లో మౌలిక వసతులు సక్రమంగా లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. అంబేద్కర్ భవనం, పేదల ఇళ్ల స్థలాలకు హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ నేటివరకు అమలు జరగలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మడి ఏసురత్నం, గూడూరి శివరామప్రసాద్, స్వామిదాస్, రత్నప్రకాష్, రవి, కాగిత ఆదాం, రాజ్‌కుమార్, ఉదయ్‌బాబు, ఐజాక్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

బల్లికురవ, జనవరి 7: మండలంలోని పాతమల్లాయపాలెం గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న సారెద్దు వెంకయ్య అన వ్యక్తి ఇంట్లో ఆదివారం ఎస్ఐ వేమన ఆరు మద్యం బాటిళ్లను పట్టుకొన్నారు. అనుమతులు లేకుండా గ్రామాలలో మద్యం అమ్మకాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

వైసీపీకి షాక్

● బేస్తవారపేట మండలంలో నలుగురు మాజీ సర్పంచ్‌లు టీడీపీ చేరిక

● కండువాలు వేసి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు, జనవరి 7 : వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. బేస్తవారపేట మండలంలో అధికార పార్టీకి భారీ షాక్ తగిలింది. నేకునాంబాద్, చెట్టిచెర్ల, బేస్తవారపేట పంచాయతీలకు చెందిన నలుగురు మాజీ సర్పంచులు, నూర్‌బాషా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆదాములు, వారి అనుచరులతో విడివిడిగా టీడీపీలో చేరారు. గిద్దలూరులో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వీరికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. తొలుత బేస్తవారపేట పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు, నూర్‌బాషా సంఘం రాష్ట్ర కార్యదర్శి దూదేకుల ఆదాము 25 కుటుంబాలతో సహా వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. గత ఎన్నికల్లో జగన్ ఇచ్చిన అబద్ధపు హామీలను నమ్మి మోసపోయామన్నారు. టీడీపీలో చేరిన వారిలో బేస్తవారపేట మాజీ సర్పంచ్ దూదేకుల మాబుతోపాటు బాబూసాహెబ్, సిద్ధయ్య, పెద్దఖాదర్, కాశయ్య, తదితరులు ఉన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహ,నాయకులు సైదులు, ముప్పూరి రాము, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. నేకునాంబాద్ మాజీ సర్పంచ్ యామా సుహాసిని ఆధ్వర్యంలో 40 కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరాయి. వారిలో దూదేకుల కాశయ్య, బత్తుల మహాలక్ష్మమ్మ, సాలమ్మ, నాగరాజు, నాగేంద్ర, రంగయ్య తదితరులు ఉన్నారు. చెట్టిచెర్ల పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్‌లు తీగిరెడ్డి భూపాల్‌రెడ్డి, కె.కొండారెడ్డి, మాజీ వైస్ సర్పంచ్ చింతల చిన్నవెంకటయ్య, ప్రస్తుత వైస్‌సర్పంచ్ మాచర్ల భూపాల్‌రెడ్డి, వైసీపీ నాయకులు రామచంద్రారెడ్డి, నారాయణరెడ్డి, అనంతరెడ్డి, సయ్యద్ భాషా, తదితరులు టీడీపీలో చేరారు. వీరికి అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.



అద్దంకి పట్టణ, మండల వైసీపీ నేతల సమావేశం లో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

సంపూర్ణ సహకారం అందించాలి

● శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

● మీ వెంటే నడుస్తామన్న పలువురు వైసీపీ నేతలు

అద్దంకి, జనవరి7: సర్వేలన్నీ నాకు అనుకూలంగా ఉన్నాయి.. వైసీపీ అధిష్ఠానం టికెట్ నాకే ఇస్తుందన్న నమ్మకం ఉందని శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. గత రెండు రోజులుగా కొరిశపాడు, పంగులూరు మండలాల నేతలతో సమావేశాలు నిర్వహించిన కృష్ణచైతన్య ఆదివారం సాయం త్రం స్థానిక శింగరకొండ రోడ్డులో వైసీపీ కార్యాలయంలో అద్దంకి మండల, పట్టణ వైసీపీ నేతలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ నేతలు, కార్యకర్తలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా హాజరైన పలువురు వైసీపీ నేతలు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తూ మీ వెంటే మేము నడుస్తామని, మీరు తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, మాకినేని శ్రీనివాసరావు, సందిరెడ్డి రమేష్, మాదాల రామకృష్ణ, గోరంట్ల శ్రీనివాసరావు, కామేపల్లి హనుమంతరావు, గోరంట్ల శివాజీ, శ్రీనివాసరెడ్డి, కోయి శ్రీనివాసరావు, అనిల్, బోస్, నరసింహారావు, జొన్నలగడ్డ మోహనరావు, నాగరాజు, సుధీర్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



సినీ నటుడు తనికెళ్ల భరణికి పురస్కారాన్ని అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

తెలుగు భాష ఓనమాలు దిద్దుకున్న నేలపై

పురస్కారం అభినందనీయం

అద్దంకిటౌన్, జనవరి 7: ఎర్రాప్రగడ నడిచిన అద్దంకి సీమలోని ప్రతి అణువు శివమయమని, తెలుగుభాష ఓనమాలు దిద్దుకున్న నేలపై పురస్కారం అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని సినీ నటుటు, పురస్కార గ్రహీత తనికెళ్ళ భరణి అన్నారు. ఆదివారం నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కల్యాణ మండపంలో పుట్టంరాజు బుల్మెయ్య, రామలక్ష్మమ్మ జీవిత సాఫల్య పురస్కార సభ డీవీఎం సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. తనికెళ్ల భరిణి నటనవైదుష్యాన్ని, ఆయా పాత్రల్లో పంపించిన హాస్యాన్ని విలనిజాన్ని, సోదహరణలద్వారా సినీ విశ్లేషకులు వారణాసి రఘురామశర్మ వివరించారు. ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ, కుటుంబ సభ్యులతో పురస్కారాన్ని తనికెళ్ల భరణికి అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్వీ రాఘవరావు, వారణాశి రఘురామశర్మ, ట్రస్ట్ సభ్యులు పుట్టరాజు చక్రధర్, తాండవకృష్ణ, నంబూరి హనుమంతరావు, బాలభార్గవి, వీరవల్లి రుద్రయ్య(సుబ్బారావు), మురళీ సుధాకరరావు, కేవీ పోలిరెడ్డి, వీ రయ్య, శ్రీనివాసరావు, జె.హనుమంతరావు, వెంకటేశ్వర్లు, ప్రసాదరావు, విశ్వమోహన్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన

ఒంగోలు, గిద్దలూరుల్లో నిర్వహణ

ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

సప్తవర్ణ శోభితం

పుడమితల్లి ముగ్గుల చీర కట్టి పరవసించింది. మహిళలు రమణీయమైన రంగవల్లికలతో సంక్రాంతి శోభకు వన్నెలద్దారు. ఒంగోలు, గిద్దలూరుల్లో ముందే పండుగ సందడి తెచ్చారు. "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. ఒంగోలులో శ్రీ సరస్వతీ విద్యాసంసంస్థల సౌజన్యంతో పీవీఆర్ బాలుర హైస్కూల్‌లోని క్రీడా మైదానం, గిద్దలూరులో లక్ష్మీ మిల్క్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సౌజన్యంతో టెన్నిస్ స్టేడియంలో పోటీలు జరిగాయి. మహిళలు భారీగా తరలివచ్చారు. ఆకాశంలో చుక్కలను నేలకు దించారు. తమ వేలికొనలతో ఒక్కో చుక్కను కలుపుతూ రమణీయమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. కొందరు సామాజిక స్పృహను జోడించారు. సంక్రాంతి విశిష్టతను, తెలుగు సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా పలువురు వేసిన ముగ్గులు చూపరులను ఆకట్టుకున్నాయి.

ఒంగోలు (కల్చరల్), జనవరి 7: ఒంగోలులో సంక్రాంతికి ముందే పండుగ సందడి నెలకొంది. నగరంలోని పీవీఆర్ బాలుర హైస్కూల్ సప్తవర్ణ శోభితమైంది. ముత్యాల ముగ్గులతో మెరిసిపోయింది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా సంఖ్యలో మహిళలు తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలలో ప్రథమ విజేతగా ఇంకొల్లుకు చెందిన సిహెచ్.మణిమంజరి, ద్వితీయ విజేతగా ఒంగోలు పాపాకాలనీకి చెందిన కె.విజయలక్ష్మి నిలిచారు. తృతీయ బహుమతిని కడవకుదురుకు చెందిన జి.విజయశాంతి సాధించారు. ప్రథమ బహుమతిగా ఎల్‌ఈడీ స్మార్ట్ టీవీ, ద్వితీయ బహుమతిగా వాషింగ్ మిషన్, తృతీయ బహుమతిగా ట్రావెలర్స్ లగ్జరీ సూట్‌కేస్‌లను ఇతర అతిథులతో కలిసి సరస్వతీ విద్యాసంస్థల అధినేత ఎ.వి.రమణారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో తెలుగు వారి పెద్దపండుగ అయిన సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం హర్షణీయమన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు మహిళలను ప్రోత్సహించటానికి, మన సంస్కృతిని కాపాడుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మరో అతిథి కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఏబీఎన్-ఆంధ్రజ్యోతి, తమ బ్యాంకు కలిసి నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. న్యాయనిర్ణేతలుగా సింహాద్రి జ్యోతిర్మయి, సిహెచ్.లక్ష్మి, పద్మావతి వ్యవహరించారు. ఈ సందర్భంగా 13 మందికి ప్రోత్సాహక బహుమతులు, పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ గిఫ్ట్‌ను సరస్వతీ విద్యాసంస్థల తరఫున రమణారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి అల్ల శ్రీనివాస్, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టర్ బండపల్లి వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఒంగోలులో జరిగిన ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన ముగ్గు



రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందాలన్నదే లక్ష్యం

- సిహెచ్.మణిమంజరి, ఇంకొల్లు, ప్రథమ బహుమతి విజేత

మహిళలకు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీలు నిర్వహించి ప్రోత్సహించడం అభినందనీయం. ఒంగోలులో ప్రథమ బహుమతి సాధించిన నేను రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలలో సైతం గెలుపొందాలన్నదే లక్ష్యం. నాకు చిన్నతనం నుంచి ముగ్గులంటే ఎంతో ఇష్టం. అటువంటి పోటీలో విజేతగా నిలవడం ఆనందంగా ఉంది.

మహిళలకు ప్రోత్సాహకరం

- కె.విజయలక్ష్మి, ఒంగోలు, ద్వితీయ బహుమతి విజేత

ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల ద్వారా మహిళలలో ఉన్న సృజనాత్మకత, పోటీతత్వం వెలికివస్తాయి. అంతేకాకుండా ఈ పోటీలు మహిళలకు ఎంతో ప్రోత్సాహకరం. ప్రతి సంవత్సరం వీటిని నిర్వహించడం అభినందనీయం.

చాలా ఆనందంగా ఉంది

- జి.విజయశాంతి, కడవకుదురు, తృతీయ బహుమతి విజేత

ముగ్గుల పోటీలలో గెలుపొందడం ఎంతో ఆనందంగా ఉంది. నేను ఉద్యోగం చేస్తూనే ముగ్గులను ప్రాక్టీసు చేస్తుంటాను. అందుకు తగిన ఫలితం ఈరోజు లభించిందని భావిస్తున్నాను. అంతేకాకుండా నేను వేసిన ముగ్గులో కాన్సెప్ట్‌కు ఈ బహుమతి లభించిందని భావిస్తున్నాను.



గిద్దలూరులో ప్రథమ బహుమతి పొందిన ముగ్గు

గిద్దలూరులో తరలివచ్చిన తరుణీమణులు

గిద్దలూరు, జనవరి 7 : గిద్దలూరులో ఆదివారం నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. పెద్దఎత్తున తరుణీమణులు తరలివచ్చారు. అందాల రంగవల్లికలతో ఇలపై ఇంద్రధనుస్సు సౌందర్యాన్ని ఆవిష్కరించారు. కొందరు సామాజిక స్పృహను జోడించారు. స్థానిక టెన్నిస్ స్టేడియంలో లక్ష్మీ మిల్క్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సౌజన్యంతో ఈ పోటీలు జరిగాయి. 130 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. రమణీయమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. బేస్తవారపేటకు చెందిన బెల్లం హిమబిందు విజేతగా నిలిచి మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చేతుల మీదుగా రూ.10వేల నగదు బహుమతిని అందుకున్నారు. కొమరోలు మండలం గాజుల వెంకటాపురం గ్రామానికి చెందిన జి.శిరీష ద్వితీయ బహుమతి రూ.6వేల నగదును గెలుచుకొన్నారు. కడప జిల్లా బద్వేలుకు చెందిన జె.రెడ్డికాత్యాయని తృతీయ స్థానంలో నిలిచి రూ.4వేల నగదు బహుమతిని అందుకున్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు నిర్వాహకులు బహుమతి అందజేశారు. కన్సొలేషన్ బహుమతులను కూడా దాతలు అందించారు. ముగ్గుల పోటీ ద్వారా రాష్ట్రంలో సంక్రాంతి శోభను ముందుగానే 'ఆంధ్రజ్యోతి' తెచ్చిందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ఈసందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ ఐ.వి.సుబ్బారావు, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ షానావలి, నాయకులు బిల్లా రమేష్, హిందూ దేవాలయాల కమిటీ అధ్యక్షులు చేరెడ్డి యర్రారెడ్డి పాల్గొన్నారు. సుజాత, ఆదిలక్ష్మి, రేవతి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.



ఆడబిడ్డకు సంక్రాంతి కానుక

- బెల్లం హిమబిందు, ప్రథమ బహుమతి విజేత

ఆడబిడ్డకు 'ఆంధ్రజ్యోతి' నుంచి సంక్రాంతి కానుక అందినట్లు ఉంది. బేస్తవారపేటలో నేను వలంటీర్‌గా పనిచేస్తున్నా. మూడేళ్ల నుంచి నేను ముగ్గుల పోటీలో పాల్గొంటున్నా. ఒకసారి కన్సొలేషన్, మరోసారి తృతీయ బహుమతి, నేడు ప్రథమ బహుమతి లభించింది. ఏటా మహిళల కోసం పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉంది.

చెప్పలేని సంతోషంగా ఉంది

- శిరీష, ద్వితీయ బహుమతి విజేత

ముత్యాల ముగ్గుల పోటీల్లో ద్వితీయ స్థానం సాధించడం సంతోషంగా ఉంది. గతంలోనూ నేను ఈ పోటీల్లో పాల్గొన్నా. కన్సొలేషన్ బహుమతి లభించింది. పట్టుదలగా ప్రయత్నించడం ద్వారా ద్వితీయ స్థానం పొందా. పండుగ కళ కనుమరుగవుతున్న ఈ తరుణంలో 'ఆంధ్రజ్యోతి' ఏటా ముగ్గుల పోటీ నిర్వహించడం అభినందనీయం.

ముగ్గుల పోటీలపై మక్కువతో

-కాత్యాయని, తృతీయ బహుమతి విజేత

ముగ్గుల పోటీలు ఎక్కడ జరిగినా అక్కడకు వెళుతుంటాను. ఈ పోటీలు మహిళలకు కానుక లాంటివి. అందుకే జిల్లా మారి వచ్చి ఇక్కడ పోటీలో పాల్గొన్నాను. ముగ్గుల పోటీలో పాల్గొనడం, బహుమతి పొందడం సంతోషంగా ఉంది. పక్క జిల్లా నుంచి వచ్చిన శ్రమ కూడా మరచిపోయాను.

నేడు ఆంధ్రజ్యోతి రంగవల్లుల పోటీలు

● కనిగిరిలో ఏర్పాట్లు పూర్తి

కనిగిరి, జనవరి 7 : "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" సంయుక్త ఆధ్వర్యంలో అమరావతి మెడికల్ సైన్సెస్ గుంటూరు ఎండీ డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి సౌజన్యంతో కనిగిరిలో సోమవారం జరిగే పోటీలకు సర్వం సిద్ధమైంది. అమరావతి గ్రౌండ్స్‌లో అందుకు ఏర్పాట్లు చేశారు. పోటీల్లో కనిగిరి నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి ఎల్‌ఈడీ టీవీ, రెండో బహుమతిగా ట్రావెలింగ్ లగ్జరీ సూట్‌కేస్, మూడో బహుమతిగా రాకింగ్ రిలాక్సబుల్ చైర్‌ను అందజేస్తారు. జిల్లా స్థాయిలో విజేతలకు 1వ బహుమతిగా ట్రావెలింగ్ లగ్జరీ సూట్‌కేస్, 2వ బహుమతిగా రాకింగ్ రిలాక్సబుల్ చైర్‌ను ఇవ్వనున్నారు. పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. పేర్లు ముందుగా నమోదు చేసుకున్న మహిళలు ఉదయం 9గంటల లోపే అమరావతి గ్రౌండ్స్‌కు చేరుకోవాలని నిర్వాహకులు కోకారు.

హోరాహోరీగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు

తిలకించేందుకు పోటెత్తిన ప్రజలు



మొదటి బహుమతిని తోట శ్రీనివాసరావుకు, ద్వితీయ బహుమతిని రామిరెడ్డికి అందజేస్తున్న జనసేన పార్టీ నేత వెంకట్

దర్శి, జనవరి 7 : జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో దర్శిలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సా గుతున్నాయి. దర్శి ప్రాంతంలో గతంలో ఎన్నడూలేని విధంగా నాలుగు రోజులు పాటు భారీ స్థాయిలో జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఏర్పాటు చేయడంతో ఈ పోటీలను తిలకించేందుకు ప్రజలు పోటెత్తారు. వం దలాది మంది మహిళలు కూడా వేదిక వద్ద కూర్చుని పోటీలు తిలకించడం విశేషం. తొలి రోజు శనివారం నాలుగు పళ్ల ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించగా అత్యధికంగా 38 జతలు పాల్గొన్న విషయం తెలిసిందే. తొలిరో జు పోటీలు పూర్తయ్యే సరికి అర్ధరాత్రి 2 గం టల సమయం పట్టింది. పోటీలు పూర్తయిన తర్వాత విజేతలకు బహుమతులు ప్రదానం చే శారు. రెండవ రోజు ఆదివారం ఆరుపళ్ల ఎడ్ల బలప్రదర్శన పోటీలకు 21 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ఈ రోజు కూడా పోటీలు అర్ధరాత్రి వ రకు కొనసాగే అవకాశం ఉంది. మూడవ రోజు సోమవారం న్యూ క్యాటగిరీ ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తారు. 9వ తేదీ చివరిరోజున మంగళవారం సీనియర్ క్యాటగిరీ ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తారు. దర్శి - అద్దంకి రోడ్డులో పోలాల్లో విశాలమైన మైదానంలో పోటీలు నిర్వహిస్తున్నారు. వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ముఖ్య అతిథులు కూర్చునేందుకు వీలుగా 200 మంది ఆహుతులు కూర్చునే వీలుగా సభా వేదికను ఏర్పాటు చేశారు. బలప్రదర్శన పోటీలు నిర్వహించే సభ చుట్టూ గ్యాలరీని ఏర్పాటు చేసి ప్రజలు చూసేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. మహిళలకు లోపల కుర్చీలు వేసి ప్రత్యేక సదుపాయం కల్పించారు. పోటీలను తిలకించేందుకు వచ్చిన ప్రజలకు భోజన వసతి కల్పిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ విశేష ఆకర్షణగా నిలిచింది. ప్రభపై ప్రజలను అలరించేందుకు కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. నిర్వాహకుడు వెంకట్‌ను పలువురు అభినందిస్తున్నారు. చివరి రెండు రోజులు భారీ స్థాయిలో ఎడ్లు వచ్చే అవకాశం ఉన్నందున పోటీలు ఉత్కంఠంగా సాగే అవకాశం ఉంది. పోటీలను తిలకించేందుకు అధికసంఖ్యలో యువత పాల్గొని ఆస్వాదించారు.

నాలుగు పళ్ల ఎడ్ల బలప్రదర్శనలో విజేతలకు బహుమతులు ప్రదానం

జనసేన పార్టీ దర్శి నియోజకవర్గ నాయకుడు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో తొలిరోజు జరిగిన నాలుగు పళ్ల ఎడ్ల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో గుంటూరు జిల్లా, కుప్పరావూరుకు చెందిన తోటా శ్రీనివాసరావు ఎడ్లు 15 నిమిషాల్లో 4269.5 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానం సాధించారు. గుంటూరు జిల్లా తుళ్లూరుకు చెందిన మోదుగుల రామిరెడ్డి ఎడ్లు 4202.9 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం పొందారు. గరికపాటి వెంకట్‌కు చెందిన ఎడ్లు 4202.5 అడుగుల దూరం లాగి మూడవ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా, సరిపూడికి చెందిన శాఖమూరి రామకోటయ్య, వెదుళ్లపల్లి శ్రీనివాసరావు ఎడ్లు 4200 అడుగుల దూరం లాగి నాల్గవ స్థానం, పల్నాడు జిల్లా, గురజాలకు చెందిన లింగా అంజయ్యచౌదరి ఎడ్లు 4131.3 అడుగుల దూరం లాగి ఐదవ, గుంటూరు జిల్లా కుప్పరావురుకు చెందిన తోటా శ్రీనివాసరావు ఎడ్లు 4110.4 అడుగుల దూరం లాగి ఆరవ, ప్రకాశం జిల్లా, ఎర్రగొండపాలెంకు చెందిన పునాది శ్రీనివాసరెడ్డి ఎడ్లు 3908.1 అడుగు దూరం లాగి ఏడవ, నంద్యాల జిల్లా, పులిగెల గ్రామంకు చెందిన బత్తుల జనార్దన్‌రెడ్డి ఎడ్లు 3773.5 అడుగుల దూరం లాగి ఎనిమిదవ, గుంటూరు జిల్లా, తక్కెళ్లపాడుకు చెందిన నందిపాటి శ్రీజరి భవాగ్న, అభయ్‌రామ్ తరుణ్‌తేజ్‌కు చెందిన ఎడ్లు 3681 అడుగుల దూరం లాగి తొమ్మిదవ స్థానం సాధించాయి. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.50వేలు, రెండవ బహుమతిగా రూ.40వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు, నాల్గవ బహుమతిగా రూ.25వేలు, ఐదవ బహుమతిగా రూ.20వేలు, ఆరవ బహుమతిగా రూ.18 వేలు, ఏడవ బహుమతిగా రూ.15వేలు, ఎనిమిదవ బహుమతిగా రూ.10వేలు, తొమ్మిదవ బహుమతిగా రూ.8వేలు నగదును అందజేశారు. పోటీల్లో పాల్గొన్న అన్ని జట్లకూ రూ.6వేలు చొప్పున ప్రత్యేక బహుమతులను అందజేశారు. ఎడ్ల యజమానులందరినీ శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కల్చరల్), జనవరి 7: విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, తమ భవిష్యత్‌ను నిర్ణయించుకునే సత్తాను పెంపొందించుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్‌లో ఆదివారం శ్రీ పతాంజలి శ్రీనివాస్ యోగా శిక్షణలో గత ఐదు నెలలుగా సాంఘిక సంక్షేమ హస్టల్స్ విద్యార్థులతో నిర్వహిస్తున్న నిత్య యోగ సాధన శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా నిత్య సాధన ద్వారా విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. ఫిబ్రవరి 15న రథసప్తమి సందర్భంగా సూర్య భగవానుడికి నీరజనాల అర్పిస్తూ 3వేల మంది విద్యార్థులతో 108 పర్యాయల సూర్య నమస్కారాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పతంజలి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు యోగా విద్య, అలాగే సూర్య యజ్ఞం ప్రకాశం జిల్లాలో మాత్రమే కొనసాగుతుందని తెలిపారు. ఈ ఘనత పూర్తిగా కలెక్టర్ దినేష్‌కుమార్‌కే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు తాతా ప్రసాద్, కిరణ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, జనవరి 7 : తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగాభవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గంగమ్మకు పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు ప్రాంతంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి మొ క్కులు తీర్చుకునేందుకు రావడంతో భక్తులతో సందడిగా మారింది. గంగమ్మ తల్లిని భక్తులు దర్శించుకోగా, పలువురు భక్తులు అమ్మవారికి వాహనదారులు వాహనపూజలు చేయించారు. మరి కొందరు భక్తులు గంగమ్మకు విరాళాలుగా సమర్పించారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎన్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశరావు, విజయలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.కార్తీక్, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

దర్శి, జనవరి 7 : హోరాహోరీగా సాగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. మూడు రోజుల పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పో టీలు జరిగాయి. ఈ పోటీల్లో 11 పురుష, 11 మహిళల జట్లు పాల్గొన్నాయి. దర్శిలో రెండవ సంవత్సరం నగర పంచాయతీ వైస్ చైర్మెన్ స్టీవెన్, సీనియర్ జర్నలిస్టు శీలం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు.



సోమశిలలో 32.303 టీఎంసీల నీరు నిల్వ



అనంతసాగరం: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 24 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 32.303 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,700 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 250, దక్షిణ కాలువకు 20 క్యూసె క్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.



నెల్లూరులోని టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న చైర్మన్ ప్రసన్న కుమార్, తదితరులు

మూడో వారంలో టిడ్కో ఇళ్ల పంపిణీ

- నెల్లూరు, వెంకటగిరిలో లబ్ధిదారులకు వితరణ
- చైర్మన్ ప్రసన్న కుమార్ వెల్లడి

నెల్లూరు జడ్పీ, జనవరి7: నెల్లూరు నగర పాలక సంస్థ, వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో పూర్తయిన టిడ్కో గృహాలను జనవరి 3వవారంలో లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్టు టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్ తెలిపారు. నెల్లూరు నగరంలోని టిడ్కో గృహాలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరు కార్పొరేషన్, వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో 16,500 గృహాలను లబ్ధిదారులకు అందజేయనున్నామని చెప్పారు. మున్సిపల్ శాఖామంత్రి ఆదిమూలం సురేష్, జిల్లా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని చెప్పారు. ఆయన వెంట టిడ్కో ఎస్ఈ జాన్ సైమన్‌రావు, ఈఈ శాస్త్రి తదితరులు ఉన్నారు.

షోకాజ్ నోటీసులు అన్యాయం

- కాపీలు దహనం చేసిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నెల్లూరు (విద్య), జనవరి 7 : చట్టబద్ధంగా తమ హక్కుల కోసం సమ్మె చేస్తున్న ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం అన్యాయమని సమగ్రశిక్ష ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ నేతలు ఆరోపించారు. కలెక్టరేట్ ఎదుట చేస్తున్న సమ్మెలో భాగంగా ఆదివారం షోకాజ్ నోటీసుల ప్రతులను దహనం చేశారు. ఎస్పీడీతో చర్చలు జరిగినప్పుడు కూడా తమతో సానుకూలంగా మాట్లాడి షోకాజ్ నోటీసులివ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఉద్యోగుల సమ్మెకు న్యాయవాదుల బృందం మద్దతు తెలియచేసింది. జేఏసీ నేతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

యాప్‌లతో యాతన

- తాజాగా మరో యాప్‌ను తీసుకువచ్చిన ప్రభుత్వం
- ఒత్తిడితో ఉపాధ్యాయుల విధి నిర్వహణ
- బోధన కంటే బోధనేతర పనులే వారికి ఎక్కువ
- తలలు పట్టుకుంటున్న టీచర్లు

నెల్లూరు (విద్య), జనవరి 7: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువులు నిత్యం యాప్‌లతో యాతన పడుతూ ప్రభుత్వ వేధింపులకు గురవుతున్నారు. పాఠశాలల్లో బోధన కంటే బోధనేతర పనులకు ఉపాధ్యాయులు ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోంది. విద్యాశాఖ ప్రవేశపెట్టిన వివిధ యాప్‌లలో వివరాలు నమోదు చేయడానికి వారు తంటాలు పడుతున్నారు. పిల్లలకు బోధించడానికి ఎనిమిది పీరియడ్లు ఉంటే బోధనేతర పనులు నిర్వహించడానికి రోజుకు మూడు, నాలుగు గంటలు సమయం పడుతోంది. వీటితో పాటు అటెండెన్స్ యాప్‌ను తీసుకురావడం, ఈ యాప్ సరిగా పనిచేయకపోవడం, నెట్‌వర్క్ సరిగా లేకపోవడం.. తదితర కారణాలతో అటెండెన్స్ ఆలస్యమైతే వెంటనే సంబంధిత ఉపాధ్యాయుల ఫోన్‌లకు అధికారుల నుంచి బెదిరింపుల మెసేజ్‌లు వస్తున్నాయి. తాజాగా వచ్చిన కొత్తయాప్‌లో విద్యార్థుల హాజరుకు సంబంధించి నాలుగు అంశాలను నమోదు చేయాల్సి ఉంది. దీంతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.



యాప్ రూపంలో మరో పిడుగు

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులపై యాప్ రూపంలో మరో పిడుగు పడింది. ప్రభుత్వం ఇప్పటికే నిర్దేశించిన యాప్‌లతో సతమతమవుతుండగా కొత్తగా వచ్చిన యాప్‌తో ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందోనని టీచర్లు తలలు పట్టుకుంటున్నారు. ఇటీవల వచ్చిన కొత్త యాప్‌లో విద్యార్థుల హాజరుకు సంబంధించి నాలుగు అంశాలను నమోదు చేయాల్సి ఉంది. ప్రతిరోజూ ఉదయం తరగతి గదిలో మొదటి పీరియడ్‌లోనే విద్యార్థుల వివరాలను వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఆ ప్రకారం పాఠశాలలకు హాజరు కాని విద్యార్థి ఏ కారణం చేత రాలేదన్న విషయాన్ని కొత్తయాప్‌లో స్పష్టం చేయాలి. విద్యార్థి పాఠశాలకు రాకపోవడానికి మొదటి కారణంగా నాట్ ఫీల్ గుడ్(స్కూల్ అంటే ఇష్టం లేకనా) అని ఉంటుంది. రెండో అంశంలో వలసపోయారా..? మూడో అంశం ఇతర పాఠశాల నుంచి టీసీలు తీసుకురాలేదా... ? నాలుగో అంశం లాంగ్ ఆప్సెంట్ అని ఉంటుంది. వీటిలో ఏదో ఒకటి స్పష్టం చేయాలి. చిన్నచిన్న పాఠశాలల్లో ఈ తరహా నమోదులు పెద్ద సమస్య కాదు కానీ... పెద్ద సంఖ్యలో విద్యార్థులుండే పాఠశాలల్లో మాత్రం తొలి పీరియడ్‌లో ఇన్ని వివరాలు ఎలా నమోదు చేయాలని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. యాప్‌లతోనే తమకు సమయం అంతా గడిచిపోతుంటే ఇక పాఠాలు ఎప్పుడు చెప్పాలో అర్థం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బోధనేతర పనులే అధికం

పాఠశాలల్లో బోధన కంటే బోధనేతర పనులకే ఉపాధ్యాయులు అధిక సమయం కేటాయిస్తున్నారు. పాఠశాలకు సమయానికి హాజరు కావడం, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం ఫొటోలు అప్‌లోడ్, స్పెషియల్ అటెండెన్స్ అప్‌లోడ్, టీచింగ్ నోట్స్‌లు రాయడం, వర్క్‌బుక్‌లు కరెక్షన్ చేయడం, సిలబస్ ఎంత వరకు పూర్తి చేసారన్న విషయాన్ని నిత్యం మెసేజ్ పెట్టడం, స్టాక్ రిజిస్టర్‌లు పక్కాగా నిర్వహించడం, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు, అధికారుల సమావేశాలు, విద్యా సంబంధిత కార్యక్రమాలు... ఇలా అనేక బోధనేతర పనుల్లో ఉపాధ్యాయులు బిజీబిజీగా ఉంటున్నారు. మరోవైపు విద్యాశాఖ ఉన్నతాధికారులు పాఠశాలల్లో బోధన సకాలంలో పూర్తి చేయాలని, పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులను సంసిద్ధులను చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వం తమపై కక్షగట్టి వేధింపులకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తోందని ఉపాధ్యాయలు ఆవేదన చెందుతున్నారు. ఉపాధ్యాయులను వేధిస్తే తగిన సమయంలో, తగిన రీతిలో బుద్ధి చెపుతామని, సమయం కోసం ఎదురు చూస్తున్నామని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి.



కావలిలో ఎస్మా జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

ఎస్మా పత్రాల దహనం

- కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

నెల్లూరు(హరనాథపురం), జనవరి 7: ఎస్మాను ప్రయోగించడాన్ని వ్యతిరేకిస్తూ నెల్లూరు నగరంలోని వేదాయపాళెంలో ఉన్న బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట ఆదివారం అంగన్‌వాడీలు ఎస్మా ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నెల్లూరు రూరల్ కార్యదర్శి కిన్నెర కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ప్రయోగించిన ఎస్మాను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకో వాలని డిమాండ్ చేశారు. అంగన్ వాడీ వర్కర్స్ యూనియన్ రూరల్ కార్యదర్శి సంపూర్ణ మాట్లాడుతూ తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించక పోగా ఎస్మాను ప్రయోగించటం విచారకరమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రూరల్ అధ్యక్షుడు కొండా ప్రసాద్, అంగన్‌వాడీ రూరల్ అధ్యక్షురాలు కుమారి పాల్గొన్నారు.

- నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీలు ఆదివారం వెల్లంటిలో నిరసన వ్యక్తం చేశారు.
- కావలిలో ఆదివారం అంగన్‌వాడీలో సమ్మె శిబిరంలో ఎస్మా ప్రతులను తగులబెట్టారు.
- కందుకూరులో అంగన్‌వాడీలు రిలే నిరసన దీక్ష కొనసాగిస్తున్నారు.

ఎస్మా ప్రయోగం దుర్మార్గం : బీటీఏ

నెల్లూరు (విద్య) : అంగన్‌వాడీ వర్కర్స్‌పై ఎస్మా ప్రయోగం దుర్మార్గమని, దాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని బీటీఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మణిసుబ్బు, మాస ప్రసాద్ ఆదివారం ఓ సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా సమ్మె చేస్తున్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశత్వంతో ఎస్మా ప్రయోగించిందని వారు పేర్కొన్నారు. హక్కులను కాలరాస్తూ ప్రశ్నించిన వారిపై ఉక్కుపాదం మోపడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన తీరు మార్చుకోవాలని, లేని పక్షంలో రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు.



నెల్లూరు కపాడిపాళెం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఏసయ్యా.. నువ్వైనా చెప్పయ్యా !

- చర్చిలో మున్సిపల్ కార్మికుల ప్రార్థనలు

నెల్లూరు(సిటీ),జనవరి 7 : ఏసయ్యా... జగన్ మనసు మార్చి.. మా సమస్యలు పరిష్కరించమని నువ్వైన్నా చెప్పయ్యా... అంటూ మున్సిపల్ కార్మికులు ఆదివారం చర్చిలో ప్రార్థనలు చేశారు. నెల్లూరులోని కపాడి పాళెం వద్ద ఉన్న క్యాథలిక్ మిషన్ చర్చిలో వారు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చమని అడిగితే, వాటిపై స్పష్టత ఇవ్వని దుస్థితిలో ప్రభుత్వం ఉందని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం, ఏళ్ల తరబడి ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని కోరడం తప్పా..? అంటూ వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అనంతరం నగరంలోని పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లాడి గోపాల్, కత్తి శ్రీనివాసులు, దేశమూర్తి, సూర్యనారాయణ, అశోక్‌లు పాల్గొన్నారు.

- ఆత్మకూరులో సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు పట్టణంలోని ప్రధాన రహదారి వెంబడి భిక్షాటన చేస్తు నిరసన వ్యక్తం చేశారు.



కావలిలో పొర్లుదండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

- కావలిలో సీఐటీయూ అనుబంధ సంఘం మున్సిపల్ కార్మికులు పొర్లుదండాలతో నిరసన తెలిపారు.
- కందుకూరులోని అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో మున్సిపల్ కార్మికులు నిరసన దీక్ష కొనసాగించారు.

అతివేగం, అజాగ్రత్తే కారణం..

- మోచర్ల వద్ద లారీని ఢీకొన్న టీఎస్ ఆర్టీసీ బస్సు
- ఇద్దరు మృతి, ఆరుగురికి గాయాలు
- బాధితులంతా తెలంగాణ వాసులే...

కందుకూరు/ గుడ్లూరు, జనవరి 7: అతివేగం, అజాగ్రత్త రెండు నిండు ప్రాణాలను బలితీసుకుంది. జాతీయ రహదారిపై గుడ్లూరు మండలం మోచర్ల సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ముందువెళ్తున్న లారీని వేగంగా వెళ్తున్న టీఎస్‌ఆర్టీసీ బస్సు ఢీకొంది.ఈ ప్రమాదం లో ఆర్టీసీ డ్రైవరు పోకల వినోద్‌కుమార్ (28), ప్రయాణికురాలు ప్రగడా సీత (55) మృతిచెం దారు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి శ్రీకాళహస్తి మీదుగా తిరుపతికి వెళ్లే ఆర్టీసీ బస్సును డ్రైవర్ వినోద్‌కు మార్ అతివేగంతో నిర్లక్ష్యంగా నడపటం వల్లే ఈ ప్రమాదం జరిగింది. మృతులు, క్షతగాత్రులంతా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉండగా మిగిలిన వారంతా క్షేమంగా బయటపడ్డారు. మృతిచెందిన బస్సు డ్రైవర్‌ది నల్గొండ జిల్లా దామరచర్ల మండలం తాళ్లవీరప్పగూడెం గ్రామం. మృతురాలు సీతది సూర్యాపేట జిల్లా బ్రాహ్మణనేరేడుచర్ల గ్రామం. బస్సు డ్రైవర్ ఘటనాస్థలంలోనే మృతిచెందగా, సీత నెల్లూరు అపోలో వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. ఈ ప్రమాదంలో సీత కుమారుడు ప్రగడా సీతారాం, మరో ప్రయాణికుడు కందాల ఉమాకాంత్‌లు నెల్లూరు అపోలో వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. స్వల్పగాయాలతో బయటపడిన కత్తి సంజయ్‌కుమార్, అడపాల కోటేశ్వరరావు, అడపాల శ్రీలక్ష్మి, బస్సులోని మరో డ్రైవర్ వెంకన్నలు కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తెలంగాణ ఆర్టీసీ బస్సు డ్రైవర్ వినోద్



చికిత్స పొందుతూ మృతి చెందిన ప్రయాణికురాలు సీత

హైవేపై హాహాకారాలు

ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఒక్కసారిగా పెద్దశబ్దంతో కుదుపులు రావటంతో ఒక్కసారిగా హతాశులై నిద్రలేచారు. నిద్రలోంచి మేలుకొనేసరికే కొందరు క్షతగాత్రులు కాగా, మరికొందరు ముందు సీట్లను గుద్దుకుని చిన్నచిన్న గాయాలతో ఉన్నారు. దీంతో ఏమి జరిగిందో అర్థంకాక ప్రయాణికులంతా హాహాకారాలు చేశారు. ప్రమాదంలో బస్సు ముందు భాగమంతా నుజ్జునుజ్జయి డ్రైవర్ సీట్లోనే అసువులు బాశాడు. కొందరు ప్రయాణికులు తేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గుడ్లూరు ఎస్ఐ ప్రసాదరెడ్డి తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే ఆర్టీసీ బస్సు కావటంతో వివిధ ప్రాంతాల్లో ఆ బస్సు ఎక్కిన వారంతా తిరుపతి దైవదర్శనానికి కుటుంబాలతో వెళ్తున్న వారేనని తెలిసింది. చిన్నచిన్న గాయాలైన పలువురు ఆసుపత్రికి వెళ్లేందుకు ఇష్టపడకుండా ప్రత్యామ్నాయ వాహనాల్లో తిరుపతికి వెళ్లారని ప్రత్యక్షసాక్షులు తెలిపారు.





చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



కావలిలో చికిత్స పొందుతున్న బాధితులు

కాలువా... కబ్జా చేసేయ్ !

- నెల్లూరు నగరంలో పెరుగుతున్న ఆక్రమణలు
- యథేచ్ఛగా అక్రమ కట్టడాలు
- ఇరిగేషన్ అధికారులపై ఫిర్యాదుల వెల్లువ
- సర్వేకు ముందుకురాని రెవెన్యూ అధికారులు
- అక్రమార్కులతో కుమ్మక్కు?
- జేసీ ఆదేశించినా పట్టించుకోని వైనం!

నెల్లూరు(ఆంధ్రజ్యోతి)

ఇలా నెల్లూరు నగరంలో విచ్చలవిడిగా పంట కాలువలను ఆక్రమిస్తున్నారు. ఒకప్పుడు పంట కాలువలుగా ఉన్నవి ఇప్పుడు డ్రైనేజీ కాలువలుగా మారాయి. పంట కాలువలు ఇరిగేషన్‌కు సంబంధించినవి కదా ? మాకేం సంబంధం అన్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది వ్యవహరిస్తున్నారు. వారి కళ్ల ముందు ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇక ఇరిగేషన్ అధికారులకు ఎవరో ఒకరు చెబితేగానీ ఈ ఆక్రమణలు తెలియడం లేదు. అందులోనూ ఇప్పుడు ఆ కాలువలను కార్పొరేషన్ ఉప యోగించుకుంటోంది కదా ? అంటూ ఉదాసీనత ప్రదర్శి స్తున్నారు. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే మాత్రం స్పందిస్తు న్నారు. అయితే వారికి రెవెన్యూ సిబ్బంది నుంచి మాత్రం సహకారం అందడం లేదు. ఫలానా కాలువను ఆక్రమి స్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయి.. ఆ కాలువలను సర్వే చేసి మా హద్దులు చూపిస్తే మేమే రక్షించుకుంటాం.. అని పలుమార్లు మండల రెవెన్యూ అధికారులకు లేఖలు రాసినా ఫలితం ఉండడం లేదు. దీంతో అక్రమార్కులు చకచకా నిర్మాణాలు చేసేస్తున్నారు. ఆ తర్వాత రాజకీయ ఒత్తిళ్లు చేయడం, కుదరకపోతే అధికారులను కోర్టులకు తిప్పడం చేస్తున్నారు. ప్రారంభంలోనే ఆక్రమణలను అడ్డుకుంటే ఎలాంటి సమస్య ఉండదు. కానీ ప్రస్తుతం రెవెన్యూ సిబ్బంది నుంచి సహకారం అందడం లేదు. కాగా ప్రభుత్వ ఆస్తుల రక్షణలోనూ రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఒక కాలువను సర్వే చేసి హద్దులు చూపించ డానికి గంట సమయం సరిపోతుంది. కానీ ఆ పని చేసేందుకు మండల సర్వే అధికారులు ముందుకు రాకపోతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. అక్రమార్కులతో సర్వే సిబ్బంది కుమ్మక్కవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- నెల్లూరులోని ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో మినీబైపాస్‌ను ఆనుకుని ఉన్న శ్రీహరినగర్ వద్ద పెద్ద పంట కాలువ ఆక్రమణలకు గురవుతోంది. ఈ కాలువకు రెండు వైపులా ఉన్న స్థల యజమానులు కొద్ది కొద్దిగా కాలువను పూడ్చుకుంటూ వస్తున్నారు. ఉత్తరం వైపు ఓ వ్యక్తి ఏకంగా భారీగా నిర్మాణం చేసేందుకు గోడ కూడా నిర్మించారు. దీంతో వర్షపు, డ్రైనేజీ నీటిని నగరం వెలుపలకు తీసుకెళ్లే ప్రధాన కాలువ కుచించుకుపోతోంది. రోడ్డును వెళ్లే ప్రతి ఒక్కరికీ ఈ దుస్థితి కనిపిస్తుంటుంది.

- నగరంలోని మాగుంట లేఅవుట్ నుంచి సాగు, వర్షపు, మురుగునీటిని సర్వేపల్లి కాలువలోకి తీసుకెళ్లే ఓ కాలువను అన్నమయ్య సర్కిల్‌లో ఆక్రమించారు. చుక్క నీరు ఆ కాలువ గుండా పారేందుకు వీల్లేకుండా పూడ్చేశారు. ఇప్పుడు ఏకంగా ఆ కాలువపై ఐదు అంతస్థుల నిర్మాణాన్ని చేపట్టారు. ఈ నిర్మాణానికి కార్పొరేషన్ సిబ్బంది అనుమతులు ఎలా ఇచ్చారన్నది కూడా అనుమానంగా ఉంది. కాగా ఆ పక్కనే పీవీఆర్ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న ప్రాంతంలో మరో పంట కాలువను కూడా పూడ్చేసి తమ స్థలాల్లో కలిపేసుకున్నారు.

రెండు రోజుల్లో సర్వే చేస్తాం

కాలువల ఆక్రమణలకు సంబంధించి ఇరిగేషన్ అధికారుల నుంచి కొన్ని లేఖలు వచ్చాయి. వాటిని పరిశీలించి రెండు రోజుల్లో సర్వే చేస్తాం. కాలువ హద్దులను తేల్చి ఇరిగేషన్ సిబ్బందికి అప్పగిస్తాం.

- సోమ్లా నాయక్, నెల్లూరు రూరల్ తహసీల్దార్

లేఖ రాసినా స్పందన లేదు..

శ్రీహరినగర్‌లో కాలువ ఆక్రమణపై సర్వే చేయాలని కొన్ని నెలల క్రితం సర్వే అధికారులకు ఇరిగేషన్ అధికారులు లేఖ రాశారు. కానీ ఇంతవరకు స్పందించలేదు. ఈ విషయాన్ని జేసీ రోణంకి కూర్మనాథ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన కూడా మండల సర్వే అధికారులను ఆదేశించారు. అయినా పట్టించుకోలేదు. ఇక మాగుంట లేఅవుట్, అన్నమయ్య సర్కిళ్ల వద్ద కాలువలు ఉన్నట్లు నగర పటంలో కనిపిస్తోంది. వాటికి హద్దులు చూపించాలని పలుమార్లు కోరినా రెవెన్యూ సిబ్బంది నుంచి స్పందన ఉండడం లేదని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. కాలువల ఆక్రమణలను అధికారులు తేలిగ్గా తీసుకుంటుండగా, అది వర్షాలు కురిసినప్పుడు నగర ప్రజలకు చాలా పెద్ద సమస్యగానే మారుతోంది.



సర్వే చేయాలని రాశాం

మాగుంట లేఅవుట్, శ్రీహరి నగర్ వద్ద కాలువలను ఆక్రమిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. ఈ కాలువలను సర్వే చేసి హద్దులు చూపించాలని రెవెన్యూ అధికారులకు లేఖలు రాశాం. వారు సర్వే చేయగానే ఆక్రమణలు తొలగిస్తాం.

- ఎం అనీల్‌కుమార్‌రెడ్డి, ఇరిగేషన్ నెల్లూరు డీఈ

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం : బొల్లినేని



టీడీపీ కండువాలు వేసుకున్న నాయకులతో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు

ఉదయగిరి రూరల్, జనవరి 7: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయగిరిలోని దిలావర్‌ఖాయ్‌వీధి, షబ్బీర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ప్రజాదీవెన యాత్ర చేపట్టి ఇంటింటికీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు షేక్‌నాటి సందానీ తన అనుచరులతో టీడీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. తొలుత యువత కేక్ కట్ చేసి 101 టెంకాయలు కొట్టి బొల్లినేనికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కలిసొచ్చే నాయకులందర్నీ టీడీపీ ఆహ్వానిస్తుందన్నారు. ముస్లిం సోదరులను మోసం చేసిన సీఎం జగన్‌కు బుద్ధిచెప్పాలన్నారు. ఉదయగిరి పట్టణంలో గత కొన్నిరోజులుగా తాను చేపడుతున్న ప్రజాదీవెన యాత్రలో ప్రజలు అనేక సమస్యలు తన దృష్టికి తీసుకొస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే తొలిసారిగా ఉదయగిరి పట్టణ అభివృద్ధికి చర్యలు చేపట్టి సుందరంగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, నరసింహా, ఓబులరెడ్డి, సందానీ, నజీల్, ఖాన్‌సా, మాబాషా, బొజ్జా నరసింహా, శివకృష్ణ, ఖాదర్‌బాషా, సురేష్, అబ్బయ్యనాయుడు, కలివెల జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వం రైతాంగాన్ని విస్మరించింది

కొండాపురం: వైసీపీ ప్రభుత్వం రైతాంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు పేర్కొన్నారు. మండలంలోని సాయిపేటకు ఆదివారం వచ్చిన బొల్లినేని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమశిల ఉత్తర కాలువను పూర్తిచేసి మండలంలోని చివరి గ్రామాలైన సాయిపేట, కొమ్మి తదితర చెరువులకు నీరందించి రైతులను ఆదుకున్న ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కిందన్నారు. సోమశిల జలాశయంలో నీరున్నా ఉత్తరకాలువకు నీరు తీసుకురాకుండా రైతులను నిలువునా వైసీపీ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెట్టడానికే ఉదయగిరి వైసీపీ ఇన్‌చార్జి తన సమయాన్ని కేటాయిస్తున్నాడే తప్ప రైతుల అవసరాలు తీర్చడంలో శ్రద్ధ చూపడం లేదన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో ఉదయగిరి ఎమ్మెల్యేగా తనను ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును గెలిపించుకుంటేనే రాష్ట్ర ప్రజలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి సీహెచ్.వెంకటాద్రి, టీడీపీ నాయకులు మహేష్, కుంకు మోహనరావు, వల్లూరు వెంకటేశ్వర్లు, చాగంటి క్రిష్ణ, మామిళ్లపల్లి వెంకట రమణయ్య, గద్దె రాఘయ్య, కుమ్మర వెంకటరావు, పదర్ల తిమోతి పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మకు పొంగళ్లు



వరికుంటపాడు, జనవరి 7: మండలంలోని గొల్ల పల్లిలో ఆదివారం గ్రామదేవత పోలేరమ్మకు గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు నిర్వహించారు. గ్రామానికి చెందిన గంగవరపు పుల్లయ్య ఆధ్వర్యంలో గ్రామస్థులు నివాసాల నుంచి ఊరేగింపుగా నైవేద్యాలను ఆలయానికి చేర్చి పాల పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి ప్రసాదాలను పంచిపెట్టారు.

పింఛన్ల పంపిణీ



లబ్ధిదారుడికి పింఛన్ అందజేస్తున్న మేకపాటి

ఉదయగిరి రూరల్, జనవరి 7: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ టీచర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మోడి రామాంజనేయులు, మండల వైసీపీ కన్వీనర్ జీ ఓబులరెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ మట్ల శాంతి, సర్పంచ్ గౌస్‌మొహిద్దీన్, నాయకులు అక్కి భాస్కర్‌రెడ్డి, జీ తిరుపతి, యస్థానీ, మట్ల లక్ష్మయ్య రామయ్య, ఎంపీడీవో ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పూర్తికాని పింఛన్ల పంపిణీ

● ఆందోళనలో లబ్ధిదారులు

చేజర్ల, జనవరి 7: నెల ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా ఇంకా పలువురికి పింఛన్ నగదు అందలేదని, పట్టించుకునే నాథుడే కరువయ్యాడని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 7వ తేదీ గడిచిపోయినా పింఛన్ నగదు అందకపోవడంతో వృద్ధులు, వితంతువులు, కులవృత్తుల వారు ఆందోళన చెందుతున్నారు. అయితే పూర్తిస్థాయిలో పింఛన్ నగదు రాకపోవడంతోనే కొంతమందికి పింఛన్ పంపిణీ చేయలేదని వాలంటీర్లు తెలపుతున్నారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు ఇచ్చిన నగదు పంపిణీ చేశామని, అయితే గతంలో ఇచ్చిన మాదిరిగా పూర్తిస్థాయిలో నగదు ఇవ్వలేదని, ఈ నేపథ్యంలోనే కొంతమందికి పింఛన్ పంపిణీ చేయలేదని వారు పేర్కొంటున్నారు. అయితే మిగిలినవారికి సోమవారం పంపిణీ చేస్తామని మండల అధికారులు పేర్కొంటున్నారు.

ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్లు



ప్రమాదకరంగా మారిన మార్జిన్లు

వరికుంటపాడు, జనవరి 7: మండల కేంద్రమైన వరికుంటపాడు నుంచి జీ.కొండారెడ్డిపల్లి వరకు నిర్మించిన తారురోడ్డు నిర్మాణంలో భాగంగా ఇటీవల వరికుంటపాడు, తూర్పుబోయమడగల గ్రామాల సమీపంలో సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని సంబరపడిన ప్రజలు, వాహనదారులకు నిరాశే మిగిలింది. రహదారికి ఇరువైపులా నాణ్యతలేని మట్టిని మార్జిన్లుగా వేయడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఏమాత్రం చదును చేయకుండా అలాగే వదిలి వేయడంతో అటుగా ప్రయాణాలు సాగిస్తున్న వాహనదారులు రోడ్డు దిగితే ఎక్కడ జారిపడతామోనని బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగక ముందే తగిన చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

మర్రిపాడు, జనవరి 7: ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా మంజూరైన 120 గ్యాస్ కనెక్షన్లను ఆదివారం లబ్ధిదారులకు బీజేపీ ఆత్మకూరు నియోజకవర్గం ఇన్చార్జి కంది మల్లికార్జున రెడ్డి అందజేశారు. పేదరిక నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వ కృషి చేస్తోందని, రాష్ట్రంలో ప్రతీ అభివృద్ధి పనిలో కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యమై తనవంతు ఆర్థికంగా తోడ్పడుతోందని ఆయన తెలిపారు.

అలరించిన సంక్రాంతి పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి దంపతులు

ఆత్మకూరు, జనవరి 7: సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి సౌజన్యంతో తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి పోటీలు అలరించాయి. పట్టణంలోని అలఘనాథస్వామి ఆలయం సమీపంలోని రైస్‌మిల్లు ఆవరణలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ముగ్గులు, కోలాటం, సంక్రాంతి లక్ష్మీ, కర్రసాము, కుస్తీ పోటీలు జరిగాయి. ముగ్గుల పోటీల్లో బి భాగ్యలక్ష్మీ, టి సుజాత, బి సుజాత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. వీరితో పాటు ప్రతిభ కనపరిచిన మరో 19 మందిని ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులకు ఎంపిక చేశారు. కోలాటం పోటీల్లో వాసవీమాత గ్రూపు, నాయుడువీధి గ్రూపు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికల గ్రూపు విజేతలుగా నిలిచారు. పండరిభజన పోటీల్లో నాయుడువీధి గ్రూపు, ముగ్గుల పోటీలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికల గ్రూపు విజేతలుగా ఎంపికయ్యారు. అనంతరం సోమవరపు సుబ్బరాయుడు అధ్యక్షతన అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంచి పరమేశ్వరరెడ్డి దంపతులు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, తెలుగు భారతి సేవా సమితి నేతలు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో లుంబినీ విద్యార్థుల ప్రతిభ

చేజర్ల, జనవరి 7: కావలి విశ్వోదయ బాలుర పాఠశాలలో ఆదివారం పసుపులేటి సుధాకర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ప్రయివేటు పాఠశాలల విభాగంలో నిర్వహించిన చెకుముకి పోటీలలో స్థానిక లుంబినీ విద్యాలయానికి చెందిన కె కృష్ణకౌశిక్, బి సింధుహాసిని, యుహేమతేజ జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ఉదయగిరి రూరల్, జనవరి 7: మండలంలోని జీ.చెరువుపల్లి గ్రామానికి చెందిన అనంతరాజు రామరాజు అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆదివారం మాజీ ఏఎంసీ చైర్మన్, మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి తన ప్రతినిధులచే రూ.10 వేలు నగదు అందజేశారు. రామరాజు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని స్థానికులు మన ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు స్పందించి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కప్పా శ్రీనివాసులు, ట్రస్టు ప్రతినిధులు గాజుల రంతుజానీ, భోగ్యం శ్రీనివాసులు, గ్రామస్థులు చిరంజీవులు, వెంకటసుబ్బయ్య, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి రాని పీహెచ్‌సీ భవనం



వినియోగంలోకి రాని పీహెచ్‌సీ భవనం

అనంతసాగరం, జనవరి 7: మండల కేంద్రం అనంతసాగరంలోని పీహెచ్‌సీ భవనం నాడు- నేడు కింద అభివృద్ధి పరిచేలా ఏడాది క్రితం అధికారులు చర్యలు చేపట్టారు. రూ. 35 లక్షలతో పనులు పూర్తిచేసేలా పనులు ప్రారంభం కాగా ఇంతవరకు పనులు పూర్తికాలేదు. దీంతో భవనం వినియోగంలోకి రాని కారణంగా ఆసుపత్రికి వచ్చే రోగులు, వైద్యసిబ్బంది అవస్థలు పడుతున్నారు. వసతులు కరువై పీహెచ్‌సీ ప్రాంగణంలోని అతిథి భవనంలో తాత్కాలికంగా వైద్యసేవలు అందిస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అక్కడే మందులు నిల్వ చేసుకోవడం, రోగులకు పరీక్షలు చేయాల్సిన పరిస్థితితో అసౌకర్యం నెలకొంది. ఇక పీహెచ్‌సీలో నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి నాడు- నేడు పనులు పూర్తి చేసి ఆసుపత్రి భవన సముదాయం వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ చక్రబంధంలో ఉదయగిరి

వాహనదారుల అవస్థలు



రహదారిపైనే లారీలు నిలిపి సరుకులు దించుతున్న కూలీలు

ఉదయగిరి రూరల్, జనవరి 7: నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరి పట్టణంలో ప్రధానంగా పంచాయతీ బస్టాండ్ సెంటర్, మెయిన్‌బజార్, గండిపాళెం మార్గంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండడంతో ప్రజలు, వాహనదారుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. పార్శిల్, ఇతర సరుకులు తీసుకొచ్చే వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలిపివేసి సరుకులు దించుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కూరగాయల మార్కెట్‌లో వ్యాపారుల మధ్య విబేధాలు రావడంతో వారంతా మెయిన్‌బజార్, ఇతర ప్రాంతాల్లో తోపుడుబండ్లపై కూరగాయలు విక్రయిస్తూ రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. దుకాణాలకు వచ్చిన వారు తమ వాహనాలను రోడ్డుపైనే నిలపడంతో ట్రాఫిక్ స్తంభించి రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

నిలువ నీడ కరువాయే: పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ప్రయాణికుల విశ్రాంతి భవనం వివిధ పార్టీల ఫ్లెక్సీలు, జెండాల దిమ్మెలతో మూసుకుపోయింది. మరోవైపు భవనం శుభ్రత గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో అందులో సేదతీరేందుకు ప్రయాణికులు వెళ్లాలంటే భయపడుతున్నారు. దీంతో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు ఎండలో ఆరుబయట, దుకాణాల్లో వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు ట్రాఫిక్ సమస్య పరిష్కరించి విశ్రాంత భవనం ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

శేషసాయినాథుడికి ప్రత్యేక పూజలు

బిట్రగుంట: బోగోలు మండలం బిట్రగుంట ద్వారాక నగరులో వెలసి ఉన్న షిరిడీ శేష సాయినాథునికి ఆదివారం ప్రత్యేక పూజలు, నగర సంకీర్తన, హారతి కార్యక్రమాలు జరిగాయి. కే.సుధాకర్, ధనసూర్యావతి దంపతులు అన్నసంతర్పణ చేశారు. మందిర వ్యవస్థాపకుడు కే.బ్రహ్మానందం, భక్తులు పాల్గొన్నారు.

పొర్లు దండాలతో మున్సిపల్ కార్మికుల నిరసన



ఆత్మకూరు : భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కావలి, జనవరి 7: మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మెలో భాగంగా ఆదివారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు సమ్మెను కొనసాగించారు. సీఐటీయూ అనుబంధ కార్మికులు 13 రోజులుగా ఏఐటీయూసీ అనుబంధ కార్మికులు 5 రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఇద్దరూ రెండు శిబిరాలుగా మున్సిపల్ కార్యాలయం వద్ద టెంట్‌లు వేసుకుని సమ్మెలో కూర్చున్నారు. సీఐటీయూ అనుబంధ కార్మికులు పొర్లు దండాలతో ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం నాలుగున్నర సంవత్సరాలకు పైగా ఎదురు చూసి పరిష్కారం కోసం చివరకు సమ్మె చేపట్టాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అప్పటి వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య, యూనియన్ నాయకులు తురక శీనయ్య, బిడదల మహేష్, బాబు, పోలయ్య, చిన్నమ్మ, జ్యోతి, నారాయణమ్మ, సునీత, వెంకమ్మ, సీపీఐ కావలి నియోజకవర్గ కార్యదర్శి కొప్పర్తి నాగరాజు, ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ యూనియన్ నాయకులు గుంజి కిషోర్, ఏలూరు ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్, వై. రాజేష్, పద్మ, లక్ష్మమ్మ, అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల భిక్షాటన

ఆత్మకూరు, జనవరి 7 : సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేప ట్టిన సమ్మె ఆదివారం కొన సాగింది. వారు తమ విధు లను బహిష్కరించి స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదు ట సీఐటీయు, ఏఐటీయుసీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్ర ధాన రహదారి వెంబడి భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వీరికి మద్దతుగా సీపీఎం, సీఐటీయు నాయకులు నిరసనలో పాల్గొని తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనతను వీడి తక్షణం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయు నాయకులు కె డేవిడ్‌రాజు, జి లక్ష్మీపతి, ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య, మున్సిపల్ యూనియన్ నాయకులు, పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

మాయదారి జగన్ మాకొద్దు : ఇంటూరి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాగేశ్వరరావు

లింగసముద్రం, జనవరి 7 : రాష్ట్రాన్ని వెనక్కు తీసుకెళుతున్న జగన్మోహన్‌రెడ్డి మనకు వద్దని, ముందు చూపుతో అభివృద్ధి చేయగల సత్తా ఉన్న చంద్రబాబునాయుడును మళ్లీ ముఖ్యమంత్రిగా తెచ్చుకుందామని కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి లింగసముద్రం పంచాయతీ జంపాలవారిపాలెంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు అంగులూరి నరసింహారావు, టీడీపీ నాయకులు గాలంకి ప్రసాద్, జంపాల కృష్ణయ్య, జంపాల శివప్రసాద్, మక్కెన వెంకటేశ్వర్లు, జంపాల మహేష్, తోపూరి నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

కమ్మ సేవాసమితి సంక్రాంతి సంబరాలు



అతిథులకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న నిర్వాహకులు

కావలి రూరల్, జనవరి 7: కావలి పట్టణంలోని మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం లోని బొల్లినేని చెంచయ్యనాయుడు సభా ప్రాంగణంలో ఆదివారం కమ్మ సేవా సమితి సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్యేలు కొమ్మి లక్ష్మయ్య నాయుడు, బొల్లినేని వెంకట రామారావు, టీడీపీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు, ఏపీ కేఎస్ఎస్ జనరల్ సెక్రటరీ బెజవాడ వెంకట్రావ్, సెక్రటరీ వెలగా కోటేశ్వరరావు, గ్రీన్ హామ్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఎండీ బొల్లినేని హజరత్ నాయుడు, హరిబాబు, తమిళనాడు, తెలంగా ణ, ఒడిశా రాయ్‌ఘడ్‌కు చెందిన కమ్మసంఘం సభ్యులు వి.మోహన్, ధన్‌పాల్ నాయుడు, కండెపనేని రత్నాకర్‌రావు, పర్వతనేని పట్టాభిరామ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఐకమత్యంతో అందరూ కలసి మెలసి ఉండి కమ్మ నిరుపేద విద్యార్థులకు, ఇతర కులాలల్లోని నిరుపేద విద్యార్థులకు తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. అనంతరం సభాప్రాంగణంలో టీడీపీ నేత మాలేపాటి భాను ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. చిన్నారుల నృత్య ప్రదర్శన, పాటకచ్చేరి, గంగిరెద్దుల ప్రదర్శనతో పాటు సంక్రాంతి శోభ ఉట్టిపడేల భోగి మంటలతో సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ కార్యక్రమంలో కమ్మ సేవాసమితి అధ్యక్షుడు మాకినేని మాల్యాద్రి నాయుడు, సభ్యులు కూరపాటి రమేష్, గద్దం శ్రీనివాసరావు, దివి రమణయ్య, ఏ.వెంకటేశ్వర రావు, సుందరయ్యనాయుడు, చల్లా వెంకటేశ్వర్లు, మంచాల ప్రసాద్, రాజ్‌కుమార్ చౌదరి, గుత్తికొండ కిషోర్, బొట్లగుంట మాల్యాద్రినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతర తరువాత పైపులైన్ మరమ్మతులు



మంచినీటి పైపులైన్ మరమ్మతుల కోసం సిద్ధం చేస్తున్న పైపులు

కావలి, జనవరి 7: పట్టణంలోని వెంగళరావునగర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఎదురుగా గతంలో పగిలి తాత్కాలిక మరమ్మతులతో నీటి సరఫరా జరుగుతున్న పైపులైనుకు పోలేరమ్మ జాతర ముగిసిన వెంటనే శాశ్వత మరమ్మతులు చేపట్టనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. కావలి-ఉదయగిరి జాతీయరహదారి క్రాసింగ్ చేస్తూ వేసిన ఈ పైపులైన్ మరమ్మతుల కోసం 6 నెలల కిందట రోడ్డును తవ్వి పైపులైన్‌కు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి దానిని పూడ్చకుండా వదిలేశారు. దానివలన ప్రమాదాలు జరిగే పరిస్థితి ఏర్పడటమే కాక వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో అనేక పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే అక్కడ ఇనుప పైపులైన్‌ను శాశ్వతంగా ఏర్పాటు చేసేందుకు అనువుగా టెండర్లు పిలిచి పైపులు తెప్పించారు. అక్కడ పైపులైన్‌కు మరమ్మతులు చేపడితే కావలి పట్టణానికి తాగునీటి సరఫరా ఆగిపోయే ప్రమాదం ఉన్నందున పాతూరులోని నడివీధి పోలేరమ్మ జాతర ముగిసిన తర్వాత మరమ్మతులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

పింఛన్ల పంపిణీ

కొండాపురం, జనవరి 7: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం జరిగిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాలరెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 5558 మంది లబ్ధిదారులు అన్నిరకాల పింఛన్లు పొందుతున్నారన్నారు. కాగా 242 మందిని పింఛన్‌కు అర్హులుగా తేల్చినప్పటికీ కేవలం 134 మందికే నూతన పించ న్లు మంజూరయ్యాయి. అలాగే అన్ని పంచాయతీల పరిధిలో 1344 మంది రైతులకు 2830 ఎకరాల అసైన్డ్ భూముల పట్టాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొడ్డు అనూరాధ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో ఎమ్.బ్రహ్మయ్య, వైసీపీ మండల కన్వీనర్ రవీంద్ర, నాయకులు కర్తం శ్రీనివాసులురెడ్డి, యారవ నరసింహారావు, బంకా మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

13న వర్ణయుగం, దమనకాండ పుస్తకాల ఆవిష్కరణ

కందుకూరు, జనవరి 7: ప్రముఖ కవి డాక్టరు బద్ధిపూడి జయరావు రచించిన వర్ణయుగం, దమనకాండ పుస్తకాలు ఈనెల 13న సాయంత్రం 4 గంటలకు స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆవిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు రచయితతో కలిసి వివిధ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ఆదివారం సాయంత్రం పుస్తకాల ఆవిష్కరణ కరపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రామన్ మెగసెసే అవార్డు గ్రహీత బెజవాడ విల్సన్, సినీ దర్శకుడు ఈ.ప్రేమ్‌రాజ్ పాల్గొంటారని తెలిపారు. కవులు, కళాకారులు, మేధావులు, విద్యావంతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి ఏ పార్టీలో పోటీ చేసినా ఓడిస్తాం

లింగసముద్రం, జనవరి 7 : కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ఏ పార్టీ నుంచి పోటీ చేసినా ఓడిస్తామని వైసీపీ అసమ్మతి నేతలు స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని పెదపవనిలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు మలిశెట్టి మాల్యాద్రి నివాసంలో మాజీ ఎంపీపీ డాక్టర్ కేపీ నరసింహారావు అధ్యక్షతన నియోజకవర్గంలోని 5 మండలాలకు చెందిన సీనియర్ నాయకులు సుంకరి చెంచురామిరెడ్డి, సూరం చిరంజీవిరెడ్డి, దామా ప్రవీణ్, పీ.సుబ్బారెడ్డి, పీ.ప్రకాశరావు, ఎస్ఎం బాషా, జీ.వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాపాల్గొని మాట్లాడారు. ఆది నుంచి పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు ఎమ్మెల్యే అన్యాయం చేశారన్నారు. కేవలం తన సొంత గ్రూపులో వారికి పనులు చేసుకొని పదవులన్నీ కట్టబెట్టారని మండిపడ్డారు. ఆయనను ఓడించేందుకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ అసమ్మతి వాదులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

● ఎస్మా జీవో ప్రతులను దహనం చేసిన అంగన్‌వాడీలు

కావలిటౌన్, డిసెంబరు 7: ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నేతలు హెచ్చరించారు. ఆదివారం అంగన్వాడీల నిరసన శిబిరంలో ఎస్మా ప్రతులను తగులబెట్టారు. యూనియన్ నేతలు రఘురావమ్మ, విజయలతలు మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె 27 రోజులకు చేరుకుందన్నారు. సానుకూలంగా స్పందించాల్సిన ప్రభుత్వం కవ్వింపు చర్యలకు పాల్పడుతూ ఎస్మా చట్టం ఉపయోగించడం దుర్మార్గమన్నారు. దీంతో ముఖ్యమంత్రి జగన్‌కు మహిళ పట్ల ఆయనకున్న గౌరవం అర్థమవుతుందన్నారు. తాము గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని మాత్రమే కోరామని తెలిపారు. ఎన్నికలప్పుడు ఒకలాగా అధికారంలోకొచ్చాక మరోలా ముఖ్యమంత్రి ప్రవర్తిండం అన్యాయమని, పైగా తమపై రకరకాల నిర్బంధాలు విధించడం వేధించడం దుర్మార్గమన్నారు. ఎస్మాకు భయపడమని, సమ్మె కొనసాగిస్తామన్నారు. యూనియన్ నేతలు కళావతి, రజిత, బిందు, జయంతి, పద్మకుమారి, సీఐటీయూ నేతలు పెంచలయ్య, నరహరి తదితరులు పాల్గొన్నారు. కాగా యూటీఎఫ్ జిల్లా నేతలు చలపతిశర్మ, ఎస్‌కె గౌస్‌బాషా, శ్రీదేవి తదితరులు అంగన్వాడీల సమ్మె శిబిరంలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.

అంబేడ్కర్ స్మృతి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

కందుకూరు, జనవరి 7: భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టరు బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అంబేడ్కర్ స్మృతి కార్యక్రమాల్లో భాగంగా కందుకూరులో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని దళిత బహుజన అంబేడ్కర్ బుద్ధిస్ట్ సాహిత్య సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 8న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించటంతో స్మృతి కార్యక్రమాలను ప్రారంభమవుతాయని తెలిపారు. 9న స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద అంబేడ్కర్ - సామాజిక న్యాయం అనే అంశంపై చర్చా కార్యక్రమం, వివిధ పోటీలు, 10న రక్తదాన శిబిరం, 12న ఐక్యతా సమభావం ప్రతిబింబించే విధంగా మానవహారం నిర్వహించనున్నట్లు ఆయాసంస్థల ప్రతినిధులు ముప్పవరపు కిషోర్, పోకూరి కోటయ్య, గాండ్ల హరిప్రసాద్, గేరా చిరంజీవి తదితరులు తెలిపారు.

కరసేవకులకు సన్మానం



కరసేవకులను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు, జనవరి 7: అయోధ్యలో రామమందిరం కోసం 1990, 92లలో అక్కడకు వెళ్లిన కరసేవకులకు మందిరం సాకారమైన సందర్భంగా ఆదివారం కందుకూరులో బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. పట్టణంలోని పెద్దబజారు కోదండరామాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్.వంశీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్‌లు పాల్గొని కరసేవకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, వంశీకృష్ణనాయుడు, మన్నేపల్లి వరప్రసాద రావు, రాఘవులు, గట్టమనేని హరిబాబు, ముప్పల భూషయ్య, సురేష్, పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

కావలి, జనవరి 7: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కావలి తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో ఆ సం ఘం 2024 నూతన క్యాలెండర్‌ను ఆదివారం కావలి ఏరి యా వైద్యశాలలో ఆవిష్కరించారు. ఆ సంఘం కావలి తా లూకా యూనిట్ ప్రెసిడెంట్ నాగిశెట్టి శ్రీనివాసరావు అధ్యక్ష తన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘంలోని సభ్యులంద రూ హాజరవగా ఆ సంఘం మహిళా కార్యవర్గ సభ్యులచే క్యాలెండర్ ఆవిష్కరించి నూతన సంవత్సరం నుంచి చేప ట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం సంఘ సభ్యులకు క్యాలెండర్లను పంపిణీ చేశారు.